మీడియా టుడే

జాతీయ తెలుగు దినపత్రిక

www.mediatodaydaily.com

మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 సంచిక : 203 CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) గురువారం 22-10-2026 పేజీలు 15 వేల 5/-



జూలై దాకా కరువే!

అప్పటికి సాధారణ వర్షపాతం నమోదైతేనే ఊరట

రానున్న 9 నెలలూ అత్యంత ప్రమాదకర పరిస్థితులు

ఎండాకాలం తాగడానికి చుక్కనీరు దొరక్కపోవచ్చు

ఈ పరిస్థితిని దాచితే క్యాన్సర్‌లా తయారవుతుంది

రానున్న ముప్పును ప్రజలందరికీ వివరించండి

నాటి విపత్కరం కరోనా.. నేటి విపత్కరం ఎల్‌నినో

కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ హరీశ్‌రావు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలి

సంక్రాంతి తర్వాత ప్రజలకు పని కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక.. నేతలంతా గ్రామాలకు వెళ్లాలి

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ముఖ్య నేతలతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 23 : మీడియా టుడే

ఎల్‌నినో ప్రభావంతో చిన్నగా మొదలైన కరువు సమస్య.. వచ్చే ఏడాది జూలై వరకూ కొనసాగనుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కరువు ప్రభావంతో రానున్న 9 నెలలూ అత్యంత ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొనబోతున్నామని చెప్పారు. వేసవికాలంలో బయటకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడతాయని, తాగటానికి చుక్క నీరు కూడా దొరకని పరిస్థితి రాబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిజాన్ని దాచి పెడితే క్యాన్సర్‌లా బాధపడాల్సి వస్తుందని, అందుకే దాచకుండా ప్రజలకు చెప్పాలని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ముఖ్యనాయకుల కు సూచించారు.శుక్రవారం వారితో ప్రజాభవన్‌లో ఎల్‌నినో పరిస్థితులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, ఢిల్లీలో ఎస్‌ఐఆర్ వ్యతిరేక ర్యాలీకి సన్నద్ధతపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై గత ఆరు నెలల నుంచీ ప్రజల్ని అప్రమత్తం చేస్తూ వస్తున్నామని గుర్తు చేశారు. “ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ హరీశ్‌రావు రాజకీయ దురుద్దేశంతో కూడిన ప్రకటనలు చేస్తున్నడు. యూకేతో సహా ప్రపంచంలోని వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉంది. ఒక్కో ఊరు.. ఒక్కో మండలం, ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలాగా దీని ప్రభావం ఉండవచ్చు. తెలంగాణలోనే ఉత్తర తెలంగాణలో ఒకలాగా.. దక్షిణ తెలంగాణలో మరోలా ఉంది. ఏపీలో ఒకలా, మహారాష్ట్రలో మరోలా, కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో ఇంకో రకంగా ఉంది. ఈ వంద దేశాలకు, ఇన్ని రాష్ట్రాలకు చెందిన వారంతా హరీశ్‌రావు కంటే తెలివి తక్కువోళ్లా? గత 75 ఏళ్లలో చూడని కరువు ఇది. అత్యంత అభివృద్ధి చెందిన దేశాలూ ఈ పరిస్థితిని ఎదుర్కొంటు న్నాయి. మహారాష్ట్రలోని కచ్ ప్రాంతంలో ఇప్పటికే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తూ.. అందులోనూ రేషన్ విధానం పెట్టారు. ప్రతి మనిషీ తన నీటి వినియోగం కనీసంగా 20 శాతం తగ్గించుకోవడం తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలను రూపొందిస్తు న్నారు” అని సీఎం రేవంత్ వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఎండ వేడిమి పెరిగి.. ఉన్న నీరు ఆవిరి అవుతూ ఉంటుందని, సాగునీటి మాట అటుంచి తాగునీటికే కటకట ఏర్పడుతుందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించకుండా కరువు పరిస్థితిని ఎదుర్కొనడం అసాధ్యమన్నారు. అందుకే ఈ అంశాన్ని శాసనసభలో చర్చకు పెట్టడమే కాకుండా మంత్రివర్గ ఉపసంఘాన్నీ వేశామని తెలిపారు. గతంలో కరోనాపై కేసీఆర్ బాధ్యత లేని మాటల వల్లే వేలాది మంది చనిపోయారని రేవంత్ ఆరోపించారు.

కరోనా వచ్చినప్పుడు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ బాధ్యత లేకుండా వ్యవహరిం చారన్నారు. “శాసనసభలో కరోనాపై చర్చ సందర్భం గా 30 డిగ్రీల ఎండ కొడితే కరోనా చచ్చి ఊరుకుంటదని, ఎక్కువైతే పారాసిటమాల్ వేసుకుంటే పోతుందంటూ కేసీఆర్ దబాయించి మాట్లాడిండు. చివరకు ఏమైంది? లక్షల మంది చనిపోయారు. కరోనాతో చనిపోయిన వారిని దహనం, ఖననం చేయడానికి స్మశానాల్లో చోటు దొరకని పరిస్థితి ఏర్పడింది. కేసీఆర్‌ను దైవాంశ సంభూతుడని బావించి.. కరోనాపై ఆయన బాధ్యత లేని మాటలను నమ్మి బయటికి వెళ్లినవారు స్మశానానికి వెళ్లారు. నమ్మని మనం.. ఇక్కడ సమావేశంలో కూర్చుని మాట్లాడుకుంటున్నం” సీఎం వ్యాఖ్యానించారు.

రేవంత్ సర్కారుది లూటీ పాలన

త్వరలో దేశ రాజకీయాల్లోనూ కేసీఆర్ కీలకం: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 23 మీడియా టుడే



రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ లూటీ పాలన సాగిస్తోందని, పాలన పిచ్చోడి చేతిలో రాయిగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్ హడావుడి కేవలం ఏడాదేనన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల్లో నెలకొన్న వ్యతిరేకత నేపథ్యంలో త్వరలో రాష్ట్రానికి కేసీఆర్ సీఎం కావడంతోపాటు ఆయన దేశ రాజకీయాల్లో కీలకమయ్యే రోజులు అతి దగ్గర్లో ఉన్నాయని జోస్యం చెప్పారు.తెలంగాణ భవన్‌లో శుక్రవారం అంబర్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా, కేసీఆర్‌పై విమర్శలకే కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని ఆరోపించారు. రేవంత్ దున్నపోతు ఈనిందంటే.. దూడను కట్టేయమని కిషన్‌రెడ్డి చెబుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎంత చేసినా లాభం లేదని, ఆయనకు ఎన్ని జాకీలు పెట్టి.. పైకి లేపినా లేస్తలేరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ విఫలమైనందు వల్లే బీజేపీపై సీజేపీ పేరుతో యువత పోరాటం చేస్తున్నారన్నారు.

విభజన శక్తులకు వ్యతిరేకంగా ఏకమవ్వాలి

దేశం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి

‘చిన్మయ మిషన్’ సమ్మేళనంలో ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ, అక్టోబరు 23: మీడియా టుడే




విభజన శక్తులకు వ్యతిరేకంగా సమాజం అంతా ఒక్కటవ్వాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రజల్లో స్వావలంబనపై అవగాహన పెంచడంతోపాటు దేశంలోని ప్రతి ఒక్కరినీ 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణ లక్ష్యంతో అనుసంధానించాలని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగాదేశం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని, సమాజంలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన చిన్మయ మిషన్ అమృత మహోత్సవ అంతర్జాతీయ సమ్మేళనం ప్రారంభం సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. చిన్మయ మిషన్ సేవలను ప్రధాని ప్రశంసించారు. స్వామి చిన్మయానంద ప్రారంభించిన ఆధ్యాత్మిక ఉద్యమం ద్వారా లక్షలాది మంది యువత భారతీయ సంస్కృతికి ప్రతినిధులుగా నిలుస్తున్నారని చెప్పారు. చిన్మయానందతో తనకున్న అనుబంధాన్ని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యానికి తన పాలనలోనూ ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. చిన్మయ మిషన్ అమృత మహోత్సవంలో భాగంగా యువ వలంటీర్లు 300 రోజుల వ్యవధిలో 40 వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణించి లక్ష మందికి పైగా యువతను కలుసుకోవడాన్ని మోదీ అభినందించారు. భారతీయ తాత్విక సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రస్తావిస్తూ ఉపనిషత్తుల్లోని ‘వయం అమృతస్య పుత్రాః’ అనే వాక్యాన్ని మోదీ ఉటంకించారు. మనం అమృతత్వానికి వారసులమనే భావన భారతీయ జ్ఞాన సంపదకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని వివరించారు. వేల సంవత్సరాలుగా భారత్ జ్ఞాన అన్వేషణ, ఆధ్యాత్మిక వికాసం దిశగా సాగుతోందని చెప్పారు. దేశ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశం పట్ల బాధ్యతగా వ్యవహరించడం, జాతీయ ప్రగతికి తోడ్పడడం ప్రతి పౌరుడి కర్తవ్యమని తెలిపారు. దేశ సాంస్కృతిక ప్రదేశాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుండడం సంతోషకరమని, గత 12ఏళ్లలో 650కు పైగా ప్రాచీన విగ్రహాలను విదేశాల నుంచి భారత్‌కు తిరిగి తీసుకొచ్చినట్లు మోదీ ఈ సందర్భంగా తెలిపారు.

తెలంగాణలో 358 మండలాల్లో కరవు..

అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 23: మీడియా టుడే



ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులను ఎదుర్కోవడానికి అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కరవు పరిస్థితులపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ భేటీలో ఆయన మాట్లాడారు. ‘రాష్ట్రంలో ప్రాథమికంగా 358 మండలాల్లో కరవు పరిస్థితులను గుర్తించాం. 324 మండలాల్లో ఆందోళనకర స్థాయిలో భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. రాష్ట్ర రిజర్వాయర్లలో 470 టీఎంసీలకు గాను ప్రస్తుతం 170 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు వద్దు.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి. ఈ క్రమంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించాం. తాగునీరు, సాగునీటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నాం. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రాకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రతి వారం కరవు పరిస్థితులపై సమీక్షించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటికే ప్రతీ జిల్లా కలెక్టర్‌కు రూ. కోటి చొప్పున అత్యవసర నిధులను విడుదల చేశాం’ అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

వచ్చే నెలలో భారత్‌కు రానున్న బంగ్లాదేశ్ ప్రధాని!

న్యూఢిల్లీ, అక్టోబర్ 23మీడియా టుడే



బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ వచ్చే నెలాఖరు లేదా డిసెంబర్ మొదట్లో భారత్‌లో పర్యటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ పర్యటనలో ఇరు దేశాలూ గంగా నదీ జలాల పంపకాల ఒప్పందాన్ని పునరుద్ధరించుకునే అవకాశం ఉంది. ఈ దిశగా జరుగుతున్న చర్చలు ఆశించిన ఫలితాన్ని ఇస్తేనే తారిఖ్ పర్యటన ఖరారయ్యే అవకాశం ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయమై బంగ్లాదేశ్ జలవనరుల శాఖ మంత్రి షాహిదుద్దీన్ మాట్లాడుతూ డిసెంబర్‌లో ఇరు దేశాల మధ్య గంగా జలాల ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అన్నారు. తాము అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే అంశాల్లో ఇదీ ఒకటని చెప్పారు. బంగ్లాదేశ్, భారత్ మధ్య దాదాపు 30 ఏళ్ల క్రితం గంగా నదీ జలాల ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై అప్పట్లో ప్రధాని దేవె గౌడ, బంగ్లా ప్రధాని షేక్ హసీనా సంతకాలు చేశారు. జనవరి 1– మే 31 మధ్య వర్షాలు తక్కువగా ఉండే కాలంలో ఫరక్కా బ్యారేజీ ద్వారా గంగా నదీజలాల పంపకాలపై ఈ ఒప్పందం కుదిరింది. భారత పర్యటనకు రావాల్సిందిగా తాము గతంలోనే ఆహ్వానించామని బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషనర్ దినేశ్ త్రివేదీ తెలిపారు. ఈ విషయంలో తొందరపాటు కూడా అవసరం లేదని అన్నారు. ఇదిలా ఉంటే, ప్రధాని తారిక్ అహ్మద్ వచ్చేవారం జపాన్‌లో కూడా పర్యటించనున్నారు. ఇప్పటికే ఆయన మలేషియా, చైనాల్లో పర్యటించారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు..!

హైదరాబాద్, అక్టోబరు 23 : మీడియా టుడే

తెలంగాణ ప్రభుత్వం ఇక నుంచి ఇంటి వద్దకే మీ సేవా, ఆధార్ సేవలు తీసుకువచ్చేందుకు సిద్ధమవుతోంది. అలాగే, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు ఇంటి వద్దే పొందే అవకాశం కల్పించనుంది. ఆధార్ నమోదు, వివరాల అప్‌డేట్ సేవలు కూడా ఇంటి వద్దకే తీసుకురానున్నట్లు తెలుస్తోంది. మీ సేవా డోర్‌స్టెప్ ద్వారా డెలివరీకి తొలి నెలలోనే అపూర్వ స్పందన వచ్చింది. 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు 3,885 కాల్స్, 1100కు కాల్ చేసి లేదా మీ సేవా పోర్టల్ ద్వారా సేవలు బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలుపుతున్నారు. క్యూల్లో నిలబడే అవసరం లేకుండా ఇంటి వద్దే సేవలు తీసుకువచ్చేలా కసరత్తు చేస్తోంది.

దూసుకొస్తున్న తుఫాన్!

నేటి ఉదయానికి వాయుగుండం


ఎల్లుండికి తుఫాన్‌గా.. ఆపై తీవ్ర తుఫాన్‌గా

28న ఉత్తర కోస్తాలో తీరం దాటే అవకాశం

120-160 కి.మీ. వేగంతో పెనుగాలులు

తుఫాన్‌కు ‘ఆర్నాబ్’గా నామకరణం

అమరావతి, అక్టోబరు 23 : మీడియా టుడే



తుఫాన్ దూసుకువస్తోంది. ఈశాన్య రుతు పవనాల సీజన్‌లో దూసుకొస్తున్న తొలి తుఫాన్ ఇదే. రాష్ట్రం స్థానిక సంస్థల ఎన్నికల హడావుడిలో.. రైతులు ఖరీఫ్ పంట కోత పనుల్లో ఉన్న సమయంలో అందరి దృష్టినీ తన వైపు మళ్లించేలా తుఫాన్ తీవ్రత ఉండబోతోంది. ఉత్తర కోస్తా జిల్లాల్లో తీవ్ర విధ్వంసం సృష్టించేలా దూసుకొస్తున్న తుఫాన్... అతి తీవ్ర తుఫాన్‌గా బలపడి తీరాన్ని తాకనున్నది. ముఖ్యంగా ఈ నెల 27, 28 తేదీల్లో ఉత్తర కోస్తాలో గంటకు 120 నుంచి 160 కిలోమీటర్లు.. అప్పుడప్పుడు 185 కిలోమీటర్ల వేగంతో పెనుగా లులు వీయనున్నాయి. ఇదే సమయంలో శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు భారీ నుంచి అతిభారీగా, అక్కడ క్కడా కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈమేరకు ఏపీ, ఒడిశా ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. తూర్పు మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలో రెండు రోజులపాటు కొనసాగిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం ఉదయం తూర్పు మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి శనివారం ఉదయానికి అదే ప్రాంతంలో వాయుగుండంగా మారుతుంది. ఈ క్రమంలో పశ్చిమ వాయవ్యంగా పయనిస్తూ 25 నాటికి తీవ్ర వాయుగుండంగా బలపడి తూర్పు మధ్య దానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుంది. ఆపై మరింత బలపడి 26వ తేదీకల్లా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తూనే తుఫాన్‌గా మారుతుంది. ఈ తుఫాన్‌కు ‘ఆర్నాబ్’ అని పేరు పెట్టనున్నారు. ఆ తర్వాత రెండు రోజుల్లో తుఫాన్ మరింత బలపడి అతి తీవ్ర తుఫాన్‌గా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలో ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా తీరాల మధ్య (కళింగపట్నం– మచిలీపట్నం మధ్య తీరం దాటుతుందని పలు మోడళ్లు, విశాఖపట్నం– కాకినాడ మధ్య అని మరికొన్ని మోడళ్లు అంచనా వేస్తున్నాయి) తీరం దాటనున్నదని పేర్కొంది. 27 నుంచి ఉత్తరకోస్తా జిల్లాల్లో తీరం వెంబడి, దానిని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో గంటకు 120 నుంచి 160, అప్పుడప్పుడు 185 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీయనున్నాయి. కోస్తాలో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయి. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో కుంభవృష్టి, శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు భారీ నుంచి అతిభారీగా, గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. 28న అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, పోలవరం, తూర్పు, పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల్లో కుంభవృష్టి, శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల్లో అతిభారీ, గుంటూరు నుంచి నెల్లూరు వరకు అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయి. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు శనివారం ఉదయానికల్లా తీరానికి చేరుకోవాలని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది.

భారత్‌కు ముప్పు ఉంది..

మైక్రోసాఫ్ట్ ఏఐ నిపుణుడు నికొలస్ బట్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 23మీడియా టుడే

ఏఐ ఆధారిత సైబర్ దాడులతో భారత్‌కు ముప్పు పొంచి ఉందనేది వాస్తవమని మైక్రోసాఫ్ట్ ఏఐ, సైబర్‌సెక్యూరిటీ పాలసీ డైరెక్టర్ నికొలస్ బట్స్ చెప్పారు. సైబర్ దాడులకు ప్రధాన టార్గెట్‌గా మారిన దేశాల్లో భారత్ ఏడో స్థానంలో ఉందని అన్నారు. ఆసియా దేశాల్లో మూడో స్థానంలో ఉందని చెప్పారు. ఏఐ ఆధారిత సైబర్ ముప్పు వాస్తవ రూపం దాల్చిందని కూడా ఆయన చెప్పారు. ప్రపంచంలో సైబర్ ముప్పు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే అరుదైన అవకాశం తమకు ఉందని చెప్పారు. ప్రతి రోజూ తాము 165 ట్రిలియన్ల సెక్యూరిటీ సంబంధిత టెలిమెట్రీ సిగ్నల్స్‌ను పరిశీలిస్తామని చెప్పారు. సైబర్ ముప్పు తప్పించేందుకు రోజూ 5 బిలియన్ ఈమెయిల్స్‌ను చెక్ చేస్తామని తెలిపారు. ఈ చర్యల ద్వారా రోజూ సుమారు 5 మిలియన్ మాల్‌వేర్ దాడులను అడ్డుకుంటామని వివరించారు. ఈ నేపథ్యంలో భారత్‌కూ ముప్పు పొంచి ఉన్న మాట వాస్తవమేనని అన్నారు. సైబర్ నేరగాళ్లు ఇప్పటికే ఏఐ సాంకేతికతలను వాడుతున్నారని కూడా ఆయన చెప్పారు.



ఈ విషయంలో ప్రభుత్వాలు, సంస్థల ముందు పలు సవాళ్లు ఉన్నాయని అన్నారు. కాబట్టి సైబర్ ముప్పును నివారించేందుకు మరిన్ని పటిష్ఠ చర్యలు అవసరమని పేర్కొన్నారు. నిపుణులు చెప్పే దాని ప్రకారం, ప్రస్తుతం సైబర్ దాడులకు ఈమెయిల్ ప్రధాన సాధనంగా కొనసాగుతోంది. దీంతో, పాటు ఫిషింగ్ నుంచి కూడా ముప్పు పొంచి ఉంది. ఈ సమయంలో సైబర్ భద్రతా టీమ్స్‌కు డేటా ప్రధాన రక్షణ సాధనంగా మారిందని కూడా నిపుణులు చెబుతున్నారు.

నలుగురికి తీవ్ర గాయాలు..

నిర్మల్ జిల్లా కడ్తాల్‌లో ఘటన

సోన్, అక్టోబరు 23

నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులో గురువారం రాత్రి రోగిని హైదరాబాద్‌కు తరలిస్తున్న అంబులెన్స్‌ను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తల్లి, కుమార్తె మృతి చెందారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడకు చెందిన మెస్రం సరస్వతి(22) అనారోగ్యంతో ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఆమె ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో వైద్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు రిఫర్ చేశారు. ఐటీడీఏ ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో సరస్వతిని తీసుకొని కుటుంబ సభ్యులు ఈ నెల 22న రాత్రి ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు.

ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తోంది

ప్రజలను చైతన్య పర్చాలి - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, అక్టోబర్ 23:

ఎల్‌నినో ప్రభావాలు ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై చూపే ప్రభావం, వాటి వల్ల తలెత్తే పరిణామాలపై ప్రజలను చైతన్య పర్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు, తాగునీటి సమస్యలు వంటి అంశాలపై ఎల్-నినో చూపే ప్రభావాలను ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ముందస్తు జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సీఎస్ అధికారులకు సూచించారు.ఈరోజు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమాచార శాఖ అధికారులు, సాంస్కృతిక సారథి కళాకారులకు నిర్వహించిన ఒకరోజు చైతన్య సదస్సుకు ముఖ్య అతిథిగా సీఎస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తోందని, దాని ప్రభావాలను ఎదుర్కొనేందుకు ప్రజలకు సమయానుకూలంగా సరైన సమాచారం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో 20 శాతానికి పైగా వర్షపాతం తక్కువగా నమోదయిందని సీఎస్ అన్నారు.దీనితో, దాదాపు 20 శాతం పంట విస్తీర్ణం తగ్గిందని, తద్వారా సరిపడా ధాన్యం, పశుగ్రాసం తగ్గిందని సీఎస్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రిజర్వాయర్లలో కేవలం 30 నుండి 40 శాతం నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో రానున్న జులై మాసం వరకు తాగు నీటికి అత్యంత ప్రాధాన్య నిస్తున్నామని వివరించారు. గత మూడు నెలలుగా రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం జరుగుతోందని, అత్యధికంగా 20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని ఆయన వెల్లడించారు. సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ సాంస్కృతిక శాఖ సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రజా అవగాహన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు. కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ జి. ముకుంద రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఎ. నరసింహ రెడ్డి, సమాచార, పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, సంయుక్త సంచాలకులు కె. వెంకట రమణ, శ్రీనివాస్, మధుసూధన్ తో పాటు వ్యవసాయ, విద్యుత్, పశుసంవర్ధక శాఖల అధికారులు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల పౌర సంబంధాల అధికారులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట పుష్కరిణిలో ప్రమాదం.. నాలుగేళ్ల చిన్నారి మృతి

సన్నాయి హనుమంతరావు । జాయింట్ బ్యూరో
రంగారెడ్డి జిల్లా । మీడియాటుడే। అక్టోబర్ 23 న్యూస్ :

కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన నాలుగేళ్ల చిన్నారి పుష్కరిణిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట, సరూర్‌నగర్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరిగుట్టకు వచ్చారు. కళ్యాణ కట్ట సమీపంలోని పుష్కరిణిలో కుటుంబ సభ్యులు స్నానం చేస్తుండగా, ఆయన నాలుగేళ్ల కుమార్తె శివలింగం ఆద్య పుష్కరిణి మెట్ల వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయింది. చిన్నారికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు, అక్కడున్న ఇతరులు చిన్నారిని నీటిలో నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే, వైద్యులు చికిత్స అందిస్తుండగా అదే రోజు రాత్రి 8:32 గంటలకు చిన్నారి మృతి చెందినట్లు ధ్రువీకరించారు.



ఈ ఘటనపై యాదగిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని చిన్నారి తండ్రికి అప్పగించారు. ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

శంషాబాద్ విమానాశ్రయంలో బీజేపీ జాతీయ నేతలకు ఘన స్వాగతం



సన్నాయి హనుమంతరావు । జాయింట్ బ్యూరో
రంగారెడ్డి జిల్లా । మీడియాటుడే। అక్టోబర్ 23 న్యూస్:

ఈరోజు మధ్యాహ్నం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బీజేపీ జాతీయ నాయకులు, మాజీ ఎంపీ వీడీ శర్మ, బీజేపీ జాతీయ జాయింట్ కన్వీనర్ విష్ణువర్ధన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. బీజేపీ రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన బృందం భారీ పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఘనంగా ఆహ్వానించింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ నాయకులకు స్వాగతం పలికారు. పార్టీ నాయకుల రాకతో విమానాశ్రయ ప్రాంగణంలో సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీహెచ్ కృష్ణారెడ్డి, బి. ప్రతాప్, గంగాపురం వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, ప్రశాంత్, విష్ణువర్ధన్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చలో నల్గొండ ఇంటి ఓ మనిషి ఊరుకో బండి

నల్లగొండలో జరిగే రైతు సంఘం మహాసభలను జయప్రదం చేద్దాం



నడిగూడెం, అక్టోబర్ 23. మీడియా టుడే:

నడిగూడెం మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశం రేఖా తిరపయ్య అధ్యక్షతన జరిగింది .ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇంటికొక మనిషి ఊరుకొక బండి చలో నలగొండ ఆలిండియా రైతు సంఘం మహాసభలను జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రైతులంతా ఐక్యంగా ఉద్యమించాలని వారు కోరారు స్థానికంగా రైతులు సాగునీటి కొరత విద్యుత్ సరఫరాల అంతరాయాలు ఎరువులు ఇత్తనాలు పురుగుమందుల ధరలు పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు .పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారని పెట్టుబడి ఖర్చులు పెరిగిన పండించిన పంటలకు ఆశించిన గిట్టుబాటు ధరలు లభించడం లేదని వారు అన్నారు .వరి పత్తి తగల పంటలు సాగు చేస్తున్న రైతులకు కొనుగోలు కేంద్రాలు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించాలని ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని తేమశాతం పేరుతో రైతులని ఇబ్బందులు గురి చేయకుండా చూడాలని కోరారు. కొనుగోలు చేసిన పంటలకు సకాలంలో డబ్బులు చెల్లించాలని అకాల వర్షాలు తెగులుతో నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతుబంధు పంటల బీమా రుణ వంటి పథకాల ప్రయోజనాలు అరువైన రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు .కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇచ్చి వారికి కూడా ప్రభుత్వ పథకాలు బ్యాంకు రుణాలు అందించాలని కోరారు. భూ సమస్యలు పట్టాదార్ పాస్ బుక్కుల సమస్యలు పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీరు లేక ఎండిన పంటలకు వరి పత్తి పంటలకి ఎకరాకి 25వేల రూపాయల స్టపరీయాలను చెల్లించాలని లిఫ్టుల ద్వారా చెరువులు నింపాలని డిమాండ్ చేశారు . ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు ఏనుగుల వీరాంజనేయులు కోరట్ల శ్రీనివాస్, ఎస్.కె లతీఫ్ బాబు, ఎస్కే మస్తాన్ , ఎస్కే సైదా హుస్సేన్, కాసాని కిషోర్, కేసగాని భద్రయ్య ,బొడ్డు వెంకటనారాయణ, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు

ఝరాసంగం ఆలయ పాలక మండలి
ప్రమాణ స్వీకారంలో ఎంపీ సురేష్ షెట్కర్

నారాయణఖేడ్ నుంచి ఎన్నికైన బీఎస్ వీర్ శెట్టికి ప్రత్యేక సన్మానం


నారాయణఖేడ్, అక్టోబర్ 23:



సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని ప్రసిద్ధ శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన ఆలయ పాలక మండలి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్‌తో పాటు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి మరింత వేగవంతం కావాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.అనంతరం నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి ఆలయ పాలక మండలి సభ్యుడిగా ఎన్నికైన బీఎస్ వీర్ శెట్టిని ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, పీసీసీ సభ్యుడు శంకరయ్య స్వామి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, హుగ్గెల్లి రాములు, భాస్కర్ రెడ్డి, సువర్ణ--మల్లన్న పాటిల్, పవన్ రాథోడ్, మాజీ మండల అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్షద్ అలీ, బడంపేట్ రాచన్న స్వామి ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్ స్వామి, కాంగ్రెస్ నాయకులు ముల్తానీ, ఆలయ పాలక మండలి సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి


నడిగూడెం, అక్టోబర్ 23.
మీడియా టుడే:



నడిగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధంనడిగూడెం: కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా జరిగే చర్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని నాయకులు కోరారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మృత దేహాన్ని సందర్శించి ఆర్థిక సహాయం అందజేత



యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,అక్టోబర్ 23:రామన్నపేట,ప్రతినిధి

రామన్నపేట మండలం వెల్లంకి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు శ్రీమతి చేగూరి సుశీల అత్తగారైన చేగురి శివమ్మ వృద్ధాప్యం వల్ల మరణించారు.ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ శ్రీమతి ఇడం రాదా శ్రీనివాస్ శివమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి అంత్యక్రియల నిమిత్తం 5000 రూపాయల ఆర్థిక సహాయం వారి యొక్క కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఈడెం శ్రీనివాస్ వార్డు సభ్యులు సంద్ల లింగయ్య,జువగొని మల్లమ్మ,బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి పిట్ట మహేందర్ రెడ్డి,ఉపాధ్యక్షులు తలారి నరసింహ,జింక శేఖర్, కురుమ నరసింహ, మరియు మహిళలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం

SIR పేరుతో ఓటర్ల హక్కులను హరించే చర్యలను నిలిపివేయాలి

- మామిడి వెంకటరెడ్డి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐఎఎఎ) రాష్ట్ర ఉపాధ్యక్షులు

యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,అక్టోబర్ 23:రామన్నపేట,ప్రతినిధి



రామన్నపేట: ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే విధానాలను, ూ×= పేరుతో ఓటర్ల హక్కులను హరించే చర్యలను, విద్యార్థులు,యువతపై పోలీసుల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ దేశవ్యాప్త నిరసన పిలుపులో భాగంగా శుక్రవారం రామన్నపేట కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మామిడి వెంకటరెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రశ్నించే గొంతులను అణచివేస్తోందని విమర్శించారు.శాంతియుతంగా నిరసన తెలిపే విద్యార్థులు,యువత, మహిళలపై పోలీసుల దౌర్జన్యాలు చేయడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసనలకు అందుబాటులో లేకుండా చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) పేరుతో లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి ఆయన వ్యవహారశైలిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ూ×= ప్రక్రియను రద్దు చేసి అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని కోరారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులతో పాటు ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు.ప్రజల ప్రాథమిక హక్కులపై జరుగుతున్న దాడులను ఐక్యంగా ప్రతిఘటించాలని, స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలను నిర్వహించేలా ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డి. మజీద్, సీనియర్ న్యాయవాది ఉయ్యాల హనుమంతు గౌడ్, న్యాయవాదులు కట్టెల లింగస్వామి, గాలి సుదర్శన్, అంకేం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక
రిజిస్టర్డ్ కమిటీని పునరుద్ధరణ

యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,అక్టోబర్ 23: రామన్నపేట,ప్రతినిధి

రామన్నపేట ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నుకున్నారు.నూతన కమిటీ అధ్యక్షులు గా తెలుసూరి మల్లేశ్, ప్రధాన కార్యదర్శి గా బత్తుల గణేష్ లు ఎన్నికై, రామన్నపేట రిజిస్టర్డ్ ప్రెస్ క్లబ్ ను పునరుద్ధరణ చేసి నూతన కమిటీ ఎన్నుకున్నారు.నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా కొండ మల్లేశం గౌడ్, గౌరవ సలహాదారులు గా రుద్రాల శ్రీరాములు, కె.వి.సుధాకర్ రాజు, అధ్యక్షులు గా తెలుసూరి మల్లేశ్, ప్రధాన కార్యదర్శి గా బత్తుల గణేష్, కోశాధికారి గా నడిగోటి నగేష్, ఉపాధ్యక్షులు గా సిర మహేష్, నోముల శంకర్, సహాయ కార్యదర్శి గా ముత్యాల రమేష్, కార్యవర్గ సభ్యులుగా నాగటి యాదయ్య, వీరమల్ల రమేష్ లను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్ట్ ల సమస్యలు,కమిటీ బలోపేతంకి కృషి చేస్తామని తెలుపుతూ, నూతన రిజిస్టర్డ్ కమిటీ ఎన్నిక విషయం అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,మండల ప్రజలందరికీ తెలుపుతూ అందరీ సహకారం అందజేయాలి తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం



రాయికల్-మీడియా టుడే-అక్టోబర్ 23:

రాయికల్ పట్టణంలోని వివిఎస్ గార్డెన్ లో 2005-06 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శుక్రవారం జరిగింది. 20సంవత్సరాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి మిత్రులు అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాల, శాలువా, మెమంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కైరం సత్యం, ఉపాధ్యాయులు రాజేశం, భోగ రాజేశం, భూమేశ్వర్, రాంగోపాల్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఇల్లేందుల శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం జాయిలుకాస్ షోరూమ్‌లో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ఘనంగా నిర్వహణ

ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



సన్నాయి హనుమంతరావు । జాయింట్ బ్యూరో । రంగారెడ్డి జిల్లా । మీడియాటుడే

అక్టోబర్ 23 న్యూస్: రంగారెడ్డి జిల్లా ఎల్.బి. నగర్ నియోజకవర్గ పరిధిలోని వనస్థలిపురంలో ఉన్న జాయిలుకాస్ జ్యువెలరీ షోరూమ్‌లో నిర్వహించిన 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా షోరూమ్‌లో ప్రదర్శించిన వజ్రాభరణాల ప్రత్యేక కలెక్షన్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామారావు, డివిజన్ అధ్యక్షుడు కొల్లూరి శ్రీనాథ్, జాయిలుకాస్ షోరూమ్ సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ముఖ్య అతిథులు, ఆహ్వానితుల సమక్షంలో కార్యక్రమం సందడిగా సాగింది. షోరూమ్ నిర్వాహకులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

రంగారెడ్డి జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు



సన్నాయి హనుమంతరావు । జాయింట్ బ్యూరో । రంగారెడ్డి జిల్లా । మీడియాటుడే

అక్టోబర్ 23 న్యూస్: రంగారెడ్డి జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మంజూరు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దత్తు నాయక్ ఆధ్వర్యంలో నాయకులు ఈరోజు ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ ప్రియరంజన్ సిన్హాను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో పారిశ్రామిక రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కేంద్రంగా మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేస్తే ఈఎస్ఐ పరిధిలోని కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్యం అందుతుందని పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పించడం ద్వారా కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ఏఐటీయూసీ నాయకులు అందించిన వినతిపత్రంపై ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ ప్రియరంజన్ సిన్హా సానుకూలంగా స్పందించినట్లు నాయకులు వెల్లడించారు. కార్మికుల ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి మంజూరుకు కృషి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బతి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, కొమ్మగళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

షేక్ అక్బర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దేప భాస్కర్ రెడ్డి

సన్నాయి హనుమంతరావు । జాయింట్ బ్యూరో
రంగారెడ్డి జిల్లా । మీడియాటుడే






అక్టోబర్ 23 న్యూస్: ఎన్టీఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు షేక్ అక్బర్ జన్మదినం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా షేక్ అక్బర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పందుల వెంకటేష్ గౌడ్, నబి, ఇస్మాయిల్, రాజు తదితరులు పాల్గొని షేక్ అక్బర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మహా సిమెంట్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

కోదాడ, అక్టోబర్ 23 (మీడియా టుడే)-:



మేళ్లచెరువు మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన కొండా శ్రీను రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. గురువారం, అక్టోబర్ 22న రాత్రి 7 గంటల సమయంలో గణపవరం, ఎర్రవరం గ్రామాల మధ్య మహా సిమెంట్‌కు చెందిన లారీ ఢీకొట్టి, ఆగకుండా వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో కొండా శ్రీను అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు .ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను కోరుతున్నారు. లారీని గుర్తించే వరకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.కొండా శ్రీనుకు భార్య నాగమ్మతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆయనే ప్రధాన ఆధారం కావడంతో ఆయన మరణంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయడంతో పాటు ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మీడియా టుడే
శనివారం, అక్టోబర్ 24, 2026

వర్ధన్నపేట ఏసీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం మీడియా టుడే అక్టోబర్ 23: పాలకుర్తి మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్ లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఆదేశాల మేరకు వర్ధన్నపేట సబ్ డివిజన్ స్థాయి రక్తదాన శిబిరాన్ని ఏసీపీ అంబటి.నర్సయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా డిసిపి రాజమహేంద్ర నాయక్ విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సర్పంచ్ కమ్మగాని.విజయనాగన్న గౌడ్, పాలకుర్తి, దేవరుప్పుల ఎస్ఐ లు సృజన్ కుమార్, చింత రాజు, తిరుమలగిరి ఎం ఆర్ ఓ హరిప్రసాద్, పోలీసులు, యువకులు తదితరులు పాల్గొన్నారు..

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, పెండింగ్ పెన్షన్లు తక్షణమే మంజూరు చేయాలి

సిపిఎం పులిగిల్ల గ్రామ శాఖ డిమాండ్





మీడియా టుడే వలిగొండ అక్టోబర్ : 23 యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని సిపిఎం గ్రామ శాఖ డిమాండ్ చేశారు. శుక్రవారం పులిగిల్ల గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు వాకిటి వెంకట్‌రెడ్డి, మారబోయిన నరసింహ మాట్లాడుతూ పులిగిల్ల గ్రామంలో అర్హులైన పేదల సంఖ్యకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల సంఖ్యను పెంచి, రాజకీయాలకు అతీతంగా గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే సోమవారం పులిగిల్ల గ్రామపంచాయతీ ఎదుట ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు వేముల నాగరాజు, వేముల అనిత–ఆనంద్, వడ్డెమాను ధనలక్ష్మి–మధు, నాయకులు వేముల చంద్రయ్య, వడ్డేమను రవి, మారబోయిన ముత్యాలు, కొమ్మిడి కృష్ణారెడ్డి, దొడ్డి యాదగిరి, వేముల ప్రవీణ్, ఎల్లయ్య, లక్ష్మణ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ,నాగేశ్వర్ రావు గారి ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా తెలంగాణ భవన్ లో బీ=ూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ ఉద్యమకారులు తునికి సంధ్యరాణి.....

బొమ్మన్‌పల్లిలో ఘనంగా దసరా ఉత్సవాలు

అమ్మవారి ముక్కుపుడక రూ.8.61 లక్షలకు వేలం.



మీడియా టుడే అచ్చంపేట (అక్టోబర్ 23): అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి గ్రామంలో దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. పది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో అమ్మవారి ఆభరణాలు, అలంకరణ వస్తువులు భారీ ధరలకు దక్కించుకోవడం విశేషం.అమ్మవారి రెండు తులాల ముక్కుపుడకను రూ.8,61,000కు ఉప్పునుంతల మండలం లత్తిపూర్ గ్రామానికి చెందిన కట్ట మైసమ్మ దేవాలయ చైర్మన్ ఎడ్ల నరేష్ యాదవ్ వేలంలో దక్కించుకున్నారు. అదేవిధంగా అమ్మవారి వెండి విగ్రహాలను సైతం భక్తులు పోటీపడి వేలంలో సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా వేలంలో పాల్గొని అమ్మవారి ఆభరణాలను దక్కించుకున్న భక్తులందరికీ గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.అమ్మవారి అలంకరణ వస్త్రాల వేలం వివరాలు1. బాలాత్రిపుర సుందరి దేవి -- గంట మల్లయ్య: రూ.36,0002. గాయత్రీ దేవి -- వడ్లకొండ సంజయ్: రూ.37,0003. అన్నపూర్ణాదేవి -- కదారి రామకృష్ణ: రూ.44,0004. మహా చండీ దేవి -- కదారి వెంకయ్య: రూ.40,0005. లలితా త్రిపుర సుందరి -- పోడేండ్ల వీరయ్య: రూ.40,0006. సరస్వతీ దేవి -- కదారి వెంకటయ్య: రూ.42,0007. మహాలక్ష్మీ దేవి -- నూకం ప్రసాద్ (డిండి): రూ.75,0008. దుర్గాదేవి -- కనకటి వెంకటయ్య: రూ.91,0009. మహిషాసుర మర్దిని దేవి -- ఉదుత విష్ణు: రూ.67,00010. రాజరాజేశ్వరి దేవి -- మల్‌రెడ్డి మల్లికార్జున్ రెడ్డి (ఐనోలు): రూ.85,000వెండి విగ్రహాల వేలం వివరాలు1. అమ్మవారి 15 తులాల వెండి విగ్రహం -- కనకటి రాజేందర్: రూ.1,20,0002. అమ్మవారి 5 తులాల వెండి విగ్రహం -- జమాల్‌పూర్ హుస్సేన్: రూ.61,0003. అమ్మవారి 4 తులాల వెండి విగ్రహం -- బిక్కుమాండ్ల రంగయ్య: రూ.71,000భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జిల్లాలోనే అత్యధిక స్థాయిలో భక్తులు వేలంపాటలో పాల్గొని అమ్మవారి ఆభరణాలు, వస్త్రాలు, వెండి విగ్రహాలను దక్కించుకోవడం బొమ్మన్‌పల్లి దసరా ఉత్సవాల ప్రత్యేకతగా నిలిచింది. గ్రామ ప్రజలు, భక్తుల సహకారంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహించడంపై దుర్గామాత కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

ఘనంగానేలకొండపల్లిసబ్ పోస్టాఫీసులోడిసిడిపికార్యక్రమం



నేలకొండపల్లి అక్టోబర్ 23 మీడియా టుడే ప్రతినిధి నేలకొండపల్లి సబ్ పోస్టాఫీసులో సబ్ పోస్ట్ మాస్టర్ జి. కృష్ణయ్య ఆధ్వర్యంలో శుక్రవారం డిసిడిపికార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఖమ్మం సౌత్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్ పి ఎల్ ఐ) కిందమంజూరైనరూ.3,95,000మరణ బీమా క్లెయిమ్ మొత్తాన్ని నామినీ వాకదాని ఇందిరకు అందజేశారు.పోస్టల్ శాఖ అందిస్తున్న వివిధ పథకాలు,వాటి ప్రయోజనాలు, ఖాతాదారులకు అందించే సేవలపై బీపీఎంలు (బి పి యం లు), ఏబీపీఎంలకు (ఏ బి పి యం లు) ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాస్ వివరించారు.గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మరింత మందికి పోస్టల్ సేవలను చేరువ చేయాలని సూచించారు.అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా సబ్ పోస్టాఫీస్ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ కనకాచారి, మెయిల్ ఓవర్సీర్లు ఎం. లక్ష్మణ్, పోస్టుమ్యాన్ ఉపేందర్ రెడ్డి, బీపీఎంలు గోవిందరావు, ఉపేందర్, సందీప్, అజయ్, రామకృష్ణ, జయవర్ధన్, సత్యనారాయణ, కృష్ణవేణి, నవ్య, సుచిత, చరిత, ఏబీపీఎంలు రాకేష్, ప్రణయ్, దీపక్, తిరుమలేశ్, ఓంకారమ్మ, అనూష, చంద్రశేఖర్, హనుమంతు, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

చిర్రాసుజానమ్మకినివాళులర్పించిన సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



నేలకొండపల్లి అక్టోబర్ 23 మీడియా టుడే ప్రతినిధి నేలకొండపల్లి మండల పరిధిలోని సదాశివపురం గ్రామానికి చెందిన భారత కమ్యూనిస్ట్ పార్టీ సీనియర్ నాయకుడు చిర్రా వెంకయ్య సతీమణి చిర్రా సుజానమ్మ గురువారం రాత్రి మృతి చెందారు. ఆమె భౌతిక కాయాన్నిశు క్రవారంసందర్భించి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.నేలకొండపల్లి మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు. నేలకొండపల్లి మండల ఎ ఐ వై ఫ్ కార్యదర్శి పాలపాటి అశోక్, మండల కౌన్సిల్ సభ్యుడు చిర్రా ప్రసాద్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

జిల్లా కేంద్రానికి దూరముగా రవాణా అధికారి కార్యాలయం

గతంలో ధరూర్ క్యాంపులో ఉన్న కార్యాలయం -సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం చోరువ చూపాలి

విధులలో పారదర్శకత పాటిస్తున్న జిల్లా రవాణా అధికారి- దళారి వ్యవస్థకు దూరంగా ప్రజలకు దగ్గరగా..



జగిత్యాల మీడియా టుడే-అక్టోబర్ 23 తెలంగాణ రాష్ట్రంలో జిల్లా రవాణా శాఖ అధికారి జిల్లాలోని వాహనాల రిజిస్ట్రేషన్, వాటి ఫిట్నెస్ , డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేయడం, వాహనాల పన్ను వసూలు, రోడ్డు భద్రత, కార్యాలయ సిబ్బంది పర్యవేక్షణ తదితర విధులు నిర్వహిస్తుంటారు.. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని అందించే శాఖలను అతి ప్రధానమైన శాఖలో ఒకటి రవాణా శాఖ.. అయితే జగిత్యాల జిల్లా రవాణా శాఖ కార్యాలయం పై మాత్రం ప్రభుత్వం శీత కన్ను వేసిందని చెప్పవచ్చు..ఎందుకంటే జిల్లా కేంద్రానికి దాదాపు 8 కిలోమీటర్ల దూరంలో మేడిపల్లి మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో తాటిపల్లి అనే గ్రామంలో ఉంది.. జగిత్యాల జిల్లా ఏర్పడిన తర్వాత ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలకు జిల్లా కలెక్టరేట్లో ప్రత్యేకంగా కార్యాలయాలు ఉన్నవి.. కానీ రవాణా శాఖకు మాత్రం జిల్లా కేంద్రానికి దూరంలో ఉండడం, అది కూడా ప్రభుత్వం వారికి కేటాయించిన స్థలం ప్రస్తుతం కొనసాగుతున్న స్థలానికి అర్థ కిలోమీటర్ దూరంగా కనీసం ప్రభుత్వం కేటాయించిన స్థలానికి ఆర్టీసీ బస్సు కూడా వెళ్లే అవకాశం లేదు.. ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయం తాటిపల్లిలో రోడ్డుపై ఉండడం వల్ల జగిత్యాల నుండి కోరుట్ల వైపుకు వెళ్లే ప్రతి ఆర్టీసీ బస్సు అక్కడ ఆగే ఆస్కారం ఉన్న రిక్వెస్ట్ స్టాప్ లేకపోవడం వల్ల ప్రజలు తాటిపల్లి స్టాప్ వద్ద దిగి అక్కడి నుండి దాదాపు 250 మీటర్ల దూరం నడుచుకుంటూ రావాల్సిన పరిస్థితి.. కనీస సదుపాయాలు కూడా అక్కడ అందుబాటులో లేవు.. దీనికి తోడు కోతుల బెడద కార్యాలయానికి వచ్చే ప్రజలు కోతులను చూసి భయపడుతున్నారు.. సిబ్బంది ప్రతినిత్యం అప్రమత్తంగా ఉంటూ కోతుల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పర్యవేక్షిస్తున్న కానీ వాటిని చూస్తేనే భయపడే పరిస్థితి అక్కడ నెలకొంది.. అంతేకాకుండా వాహనాలకు ఫిట్నెస్ కానీ, లైసెన్స్ మంజూరు కి ముందు డ్రైవింగ్ పరీక్షించడం కానీ రవాణా శాఖకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్వహించడం వలన అక్కడికి వెళ్లాలంటే ప్రస్తుతం కొనసాగుతున్న స్థలానికి అర కిలోమీటర్ దూరంలో వెళ్లాల్సిన పరిస్థితి దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు..ఇప్పటివరకు గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి కావలసిన భవన నిర్మాణం కానీ మరి ఇతర సదుపాయాలపై కానీ దృష్టి కేంద్రీకరించినట్టుగా అనిపించడం లేదు. ఎందుకంటే ప్రస్తుతం కొనసాగుతున్న స్థలం తాత్కాలిక రేకుల షెడ్డులో మాత్రమే కొనసాగుతుండడం దీనికి కొసమెరుపు..

ప్రభుత్వానికి ఆదాయం..

ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే శాఖలలో రవాణా శాఖ ఒకటి అలాంటి శాఖపై జిల్లా కార్యాలయ స్థల మంజూరు మరియు భవన నిర్మాణ ఇతర సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ఎందుకింత చిన్నచూపు చూస్తుందో అర్థం కావడం లేదు..గతంలో క్యాంప్ లో రవాణా శాఖ కార్యాలయం ఉండేది..జగిత్యాల జిల్లా ఏర్పడక ముందు రవాణా శాఖ కార్యాలయం పట్టణంలోని ధరూర్ క్యాంపులో ఉండేవి.. అప్పుడు ఇక్కడ ఎస్సారెస్పీ కార్యాలయం తప్ప ఏ ప్రభుత్వ కార్యాలయాలు ఉండేవి కావు. కానీ జిల్లా ఏర్పడిన తర్వాత క్యాంపు లోనే కలెక్టరేట్ భవన నిర్మాణం పూర్తి చేయడం వలన అన్ని ప్రభుత్వ శాఖలు అక్కడికే వచ్చాయి.. దానికి విరుద్ధంగా జిల్లా రవాణా శాఖ మాత్రమే తాటి పెల్లికి వలస వెళ్లింది.. అందువల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం చోరువచూపి జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని గతంలో ఉన్నట్టుగానే ధరూర్ క్యాంపులో ఏర్పాటు చేయాలని జగిత్యాల జిల్లా ప్రజలు కోరుతున్నారు..

సొంత భవన నిర్మాణానికి చోరువచూపాలి..

అలాగే జగిత్యాల ధరూర్ క్యాంపు కార్యాలయంలో వెంటనే రవాణా శాఖ సొంత భవన నిర్మాణానికి కూడా ప్రభుత్వం ముందుకు వచ్చి రవాణా శాఖకు కావలసిన అన్ని రకాల సదుపాయాలు సమకూర్చి వెంటనే సొంత భవనాన్ని నిర్మించుకునే విధంగా నిధులు మంజూరు చేయాలని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు..

విధులలో జిల్లా రవాణా శాఖ అధికారి పారదర్శకత...

రవాణా శాఖ కార్యాలయానికి సొంత భవనం లేకున్నా ఎలాంటి సదుపాయాలు అందుబాటులో లేకున్నా ఒక విషయాన్ని మాత్రం మనం గమనించాల్సింది.. జిల్లా రవాణా అధికారిగా సందాని అహ్మద్ బాధ్యత స్వీకరించిన తర్వాత పారదర్శతకు పెద్దపీట వేస్తున్నారు.

దళారి వ్యవస్థకు దూరం..

ఆయన విధులలో చేరిన తర్వాత జిల్లా వ్యాప్తంగా ఎవరైనా రవాణా శాఖ కార్యాలయానికి వచ్చి నేరుగా పనులు చేసుకోవాలని ఎలాంటి ఏజెంట్లను పట్టుకొని రావాల్సిన అవసరం లేదని నిక్కచ్చిగా ప్రజలతో చెబుతున్నాడు.. చెప్పడమే కాకుండా ఏజెంట్లను దూరం పెడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సంబంధిత ధ్రువపత్రాలు ఏమేం కావాలో తీసుకొని నేరుగా వచ్చి కలిసే అవకాశం కల్పిస్తూ వారి పనులను చేసి పెడుతున్నారు.. దీనివలన దళారి వ్యవస్థ దూరం అవడమే కాకుండా ప్రజలకు కూడా ఖర్చు తగ్గుతుందని ఆయన అంటున్నారు..

ప్రజలకు అందుబాటులో..

రవాణా శాఖ అధికారి ప్రజలకు కార్యాలయాల వేళలో అందుబాటులో ఉంటున్నారు. ఆయన అందుబాటులో ఉండడమే కాకుండా సిబ్బంది పనులను పర్యవేక్షిస్తూ ఎలాంటి పెండింగ్ లేకుండా పని త్వరగా పూర్తి అయ్యేవిధంగా వారిని ప్రేరేపిస్తున్నారు.. అందువలన కాలయాపన కూడా ప్రజలకు తగ్గుతుంది..

రామాపురం గ్రామంలో అవినీతి ఆరోపణల కలకలం!

రూ.20 వేల పనికి రూ.50 వేల బిల్లు చేయాలంటూ ఒత్తిడి?

మాజీ సర్పంచ్ అభివృద్ధి పనుల బిల్లులు నిలిపివేత ఆ బిల్లులపై సంతకాలు పెట్టాలంటే 20% కమిషన్ ఇవ్వాలని డిమాండ్

భార్య ఉప సర్పంచ్ పదవిని భర్త చలామణి చేస్తున్నాడని వివిధ పార్టీల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు

సొంతంగా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలకు సైతం పంచాయతీ నిధుల నుంచి బిల్లులు కావాలంటూ డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు



చిలుకూరు, అక్టోబర్ 23మీడియా టుడే: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం రామాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ వ్యవహారాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శిపై ఉప సర్పంచ్ భర్త ఎన్నో ఇబ్బందులకి గురి చేస్తుండగా, మరోవైపు ఉప సర్పంచ్ తీరుపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉప సర్పంచ్ పనితీరుపై ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వార్డు మెంబర్లు సైతం వాపోతున్నారు.గ్రామంలో సొంతంగా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలకు సైతం గ్రామ పంచాయతీ నిధుల నుంచి బిల్లులు చెల్లించాలని ఉప సర్పంచ్ డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. అలాగే సుమారు రూ.20 వేలతో చేసిన పనికి రూ.50 వేల బిల్లు చేయాలని ఒత్తిడి తెస్తూ, బిల్లు చేయకపోతే బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా గ్రామంలో చేపట్టే ప్రతి పనిలోనూ కమిషన్ డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత పత్రాలు, బిల్లులు, ఇతర ఆధారాలు పరిశీలించాల్సి ఉంది.ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ఈ నేపథ్యంలో రామాపురం గ్రామ పంచాయతీలో జరిగిన పనులు, వాటి అంచనా వ్యయం, బిల్లులు, నిధుల వినియోగంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఆరోపణల్లో వాస్తవాలు ఎంత? పంచాయతీ నిధుల వినియోగంపై విచారణ జరుగుతుందా? అధికారుల స్పందన ఏమిటి? అన్నది వేచి చూడాల్సి ఉంది.అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలకి బిల్లులు చెల్లించారు తీర్మానాల కాపీలపై సంతకాలు చేశారు కానీ పూర్తిగా నిర్మాణాలు జరిగిన వాటికి మాత్రం బిల్లులలో జాబ్ ఏం చేస్తూ బిల్లుల్ని సంబంధిత మాజీ సర్పంచ్ కి రానివ్వకుండా చేస్తున్నారని ఆరోపణ చేస్తూ మాజీ సర్పంచ్ తన ఆవేదనను వ్యక్తపరిచారు ఈ సందర్భంగా ండల ఉన్నతాధికారి గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి సంబంధిత అంశాలపై విచారణ జరిపి నివేదిక రాసుకోవడం జరిగింది ఇటి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వార్డు మెంబర్లు కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ నాయకులైన నల్లబోతు సత్యనారాయణ రాయబారి వెంకటేశ్వర్లు, షేక్ హస్నా,మీసాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు

గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యత ఇస్తాం

-మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడి మండల రిపోర్టర్ మీడియా టుడే , అక్టోబర్ 23 : హుస్నాబాద్ నియోజకవర్గంలో పూర్తిగా ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ తెలిపారు.నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అత్యంత దయనీయ పరిస్థితుల్లో నివసిస్తున్న వారికి ముందుగా న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లను కేటాయిస్తోందని పేర్కొన్నారు.అదేవిధంగా గౌరవెల్లి–గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయి, ఇప్పటివరకు ఎలాంటి ఇల్లు పొందని నిర్వాసితుల్లో భూమి ఉండి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి విస్తరణలో భాగంగా చిగురుమామిడి, సుందరగిరి తదితర ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన అర్హులైన కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి జనగామ మార్గంలో అక్కన్నపేట మీదుగా రహదారి విస్తరణ తదితర కారణాలతో ఇళ్లు కోల్పోయిన అర్హులైన వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.హుస్నాబాద్ చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూములు ఇచ్చిన వారికి అర్హత ఉండి ఇల్లు లేని వారికి కూడా ఇందిరమ్మ ఇల్లు కేటాయించేల చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం:ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలకు, వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, రహదారి విస్తరణ కారణంగా నివాసాలను కోల్పోయిన అర్హులైన నిర్వాసితులకు న్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అర్హుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, అత్యంత అవసరంలో ఉన్న కుటుంబాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

దాసిరెడ్డి గూడెం, యెదుళ గూడెం గామాలలో ఏల్ నినో ప్రభావం పై రైతులతో సమావేశం ఎంపీడీవో : జి. జలంధర్ రెడ్డి



మీడియా టుడే వలిగొండ అక్టోబర్ : 23 ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉండటంతో పాటు, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి రైతులకు సూచించారు. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల పంటల రకాలను ఎంపిక చేసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.దాసిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ రాపోలు గోపి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతల వల్ల వ్యవసాయ రంగంపై పడే ప్రభావాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, అనువైన పంట రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని, నీటిని వృథా చేయకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ పంటలను సంరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ, వ్యవసాయ శాఖ ఏఈ అంజనీ దేవి, ఏఈఓ స్వప్న, విద్యుత్ శాఖ ఏఈ, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జోక్ అపర్ణ, రైతులు పాల్గొన్నారు.అనంతరం ఎదుళ్ళగూడెం గ్రామ సర్పంచ్ కొంతం శ్రీను అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు కూడా ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించారు. రానున్న కాలంలో వర్షపాతం తగ్గే అవకాశం, ఉష్ణోగ్రతలు పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల పంటల రకాలను ఎంచుకోవాలని, నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుంటూ, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ, వ్యవసాయ శాఖ ఏఈ అంజనీ దేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు నీటి పొదుపు పద్ధతులను పాటిస్తూ, తక్కువ నీటితో పండే పంటల రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకునేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు.

ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభం

ప్రారంభించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి



మీడియా టుడే ఖమ్మం (అర్బన్) ఖమ్మం : జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఈరోజు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు.రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సర్వోత్తం రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా ఈ ఓటర్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షులు తెలిపారు.ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ....రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావంతులకు, నిరుద్యోగ యువతకు ఎన్నో సంక్షేమ పథకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో గట్టిగా వినిపించే నాయకుడు సర్వోత్తం రెడ్డి అని లాంటి విద్యావంతుడు, ఉద్యమకారుడు గెలిస్తేనే పట్టభద్రులకు న్యాయం జరుగుతుందన్నారు.అందుకే ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు కావాల్సిన అర్హతలు, పత్రాలను ఆయన వివరించారు. 2022 కంటే ముందు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి పట్టభద్రుడు అర్హుడని, డిగ్రీ సర్టిఫికెట్ / ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, సెల్ ఫోన్ నంబర్ తో సంజీవరెడ్డి భవన్ లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ, సేవాదళ్ నాయకులు ప్రతి గ్రామంలో, ప్రతి కాలేజీలో, ప్రైవేట్ ఉద్యోగులు,ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువతను కలిసి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తం రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కిలారు అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు రంగా జనార్ధన్,కోసూరి శ్రీనివాస్, వేల్పుల మురళి,మద్దినేని రమేష్, దామా స్వరూప, జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు ఆసిఫ్,యువజన కాంగ్రెస్ నాయకులు క్రాంతి తదితర నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల అంశాలపై

విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 23

రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల అంశాలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఎల్లినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రబీ, వేసవి సీజన్లలో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని 140 మిలియన్ యూనిట్లకు పెంచేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని అన్ని యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకువచ్చేందుకు మిగిలిన సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. యాదాద్రి ప్లాంట్‌లోని రెండు యూనిట్లకు కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.రాష్ట్రంలోని మూతపడిన పరిశ్రమలపై పేరుకుపోయిన విద్యుత్ బకాయిల పరిష్కారానికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించి, సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన పరిశ్రమలకు బకాయిల చెల్లింపుల్లో వెసులుబాటు కల్పించడంతో పాటు, విద్యుత్ పంపిణీ సంస్థలకు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని, సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు.

పుష్కరాల పనుల నిర్వహణకు శాఖల మధ్య సమన్వయం అవసరం

గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలి:

రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు.



నిర్మల్ జిల్లా బాసర: అక్టోబర్ 23, 2026

గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి బాసర లో గోదావరి నది పుష్కరాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గోదావరి పుష్కర ఘాట్లను, తదితర పుష్కరాల నిర్మాణ పనుల ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వేలాది మంది పుణ్యస్నానాలకు తరలివస్తారని, భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాల పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యవంతంగా చేపట్టాలని వివరించారు. సంబంధిత శాఖల అధికారులు అంతా ఎప్పటికప్పుడు పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలని పేర్కొన్నారు. అవసరమైన మేరకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని చెప్పారు. పనుల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు తమకు అందజేస్తూ ఉండాలని తెలిపారు.

పుష్కరాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం:

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

బాసరలో గోదావరి పుష్కరాల పనులన్నీ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా చెప్పారు. పుష్కరాల పనుల వివరాలను కలెక్టర్ కమిషనర్ కు వివరించారు. వారానికి ఒకరోజు బాసరలో పుష్కర పనులపై సమీక్ష నిర్వహించడంతో పాటు, పనులకు సంబంధించి అధికారులందరికీ దిశా నిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నది పుష్కరాల పనులను గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

అంతకుముందు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని కమిషనర్, కలెక్టర్, అధికారులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారులను సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ పరిశీలనలో ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో సీపీఐ మద్దతు కోరిన కాంగ్రెస్

సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఇరు పార్టీల నేతల సమావేశం



మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 23

సీపీఐరాష్ట్రకార్యాలయంలో కాంగ్రెస్, సీపీఐ నేతలు సమావేశమయ్యారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని సీపీఐ నేతలను కాంగ్రెస్ నాయకులు కోరారు.ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవితో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, చాడ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, ఈటి నరసింహ, తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, కలవేని శంకర్, బాల నరసింహ తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి మద్దిమడుగు దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను విడుదల చేసిన చైర్మన్ , ఈఓ.



మీడియా టుడే అచ్చంపేట (అక్టోబర్ 23):

అచ్చంపేట నియోజకవర్గం భద్ర మండలం శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి మద్దిమడుగు దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల గోడపత్రికను చైర్మన్ ఈవో పాలకమండలీ సభ్యులు, ఆలయ అర్చకుల తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వాల్ పోస్టర్ ను శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూనల్లమల అటవీ ప్రాంతంలోని పదర మండలంలో వెలసిన, భక్తుల కొంగుబంగారమైన మద్దిమడుగు క్షేత్రంలో ప్రతి ఏటా నిర్వహించే కార్తీక మాస బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. పాలకమండలి సభ్యులు చైర్మన్ ఈవో ఆలయ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మాలాధారణ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్న వేళ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ , ఈఓ పాలకమండలీ సభ్యులు, ఆలయ అర్చకుల, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో ఆయుష్ విభాగంలో 8 పోస్టుల భర్తీ

నిర్మల్, అక్టోబర్ 23 (మీడియా టుడే సబ్ ఎడిటర్)

నిర్మల్ జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ (చూవీ) ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 8 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ నియామకాలు అవుట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టనున్నారు.ఈ పోస్టుల్లో ఆయుష్ పీజీ వైద్యాధికారి ఒకరు, ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు ఇద్దరు, డైటీషియన్ ఒకరు, సైకోసోషియల్ కౌన్సిలర్ ఒకరు, యోగా ప్రొఫెషనల్ ఒకరు, మల్టీపర్పస్ వర్కర్లు ఇద్దరు ఉన్నారు.అర్హతలు కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 26 నుంచి 31వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్మల్‌లోని ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (xణూజ)లోని ఖీ-25 బ్లాక్‌లో దరఖాస్తులు సమర్పించాలి. పోస్టుల వారీగా విద్యార్హతలు, ఇతర నిబంధనలు, దరఖాస్తు వివరాలను అధికారిక నోటిఫికేషన్‌లో పరిశీలించాలి.

ప్రకాశ్ నగర్‌లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం



కూకట్‌పల్లి, అక్టోబర్ 23,(మీడియా టుడే ప్రతినిధి)

బేగంపేట డివిజన్ పరిధిలోని ప్రకాశ్ నగర్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం పర్యటించారు. ఎస్సీబీసీ కమిటీ హాల్ వద్ద డ్రైనేజీ సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహేశ్వరి, డివిజన్ అధ్యక్షుడు సురేశ్ యాదవ్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలి

వెనకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.



గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు


అక్టోబర్ 23

విద్యార్థులు చదువులో రాణించేందుకు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తప్పకుండా యూనిఫార్మ్ వేసుకొని పాఠశాలకు రావాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలకు తక్కువగా రావడంతో తల్లిదండ్రులకి ఫోన్ చేసి విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా అవగాహన కలిగించాలన్నారు. విద్యార్థులు దసరా సెలవులను ఎలా గడిపారో అడిగారు. సెలవులకు మందు ఇచ్చిన అసైన్మెంట్స్ ను పూర్తిచేసి ఉపాధ్యాయులకు ఇవ్వాలని సూచించారు. వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పాఠశాలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి మాట్లాడారు. దాతల సహకారంతో నిర్మించిన స్టేజి షెడ్ ను పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరిశీలించి విద్యార్థుల సంఖ్య ఆధారంగా తగినన్ని మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో గద్వాల మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, పాఠశాల జిహెచ్ఎం రేణుకా దేవి, తదితరులున్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదుపై కేఎల్ఆర్ కీలక దిశానిర్దేశం

అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు కావాలి

-- డివిజన్ అధ్యక్షులు, కోఆర్డినేటర్లకు పిలుపు



సన్నాయి హనుమంతరావు । జాయింట్ బ్యూరో । రంగారెడ్డి జిల్లా । మీడియాటుడే

అక్టోబర్ 23 న్యూస్: మహేశ్వరం నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని డివిజన్ అధ్యక్షులు, కోఆర్డినేటర్లతో జూమ్ సమావేశం నిర్వహించి ఓటర్ల నమోదు ప్రక్రియపై కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కొత్త పట్టభద్రుల ఓటర్ల నమోదు, ఇప్పటికే ఓటరుగా నమోదైన వారి వివరాల పరిశీలన, అవసరమైన సవరణలు తదితర అంశాలపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) సమన్వయంతో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటర్ల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.మహేశ్వరం నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో అర్హులైన పట్టభద్రుల ఓట్లు నమోదయ్యేలా ప్రతి డివిజన్ అధ్యక్షుడు, కోఆర్డినేటర్ బాధ్యతాయుతంగా పనిచేయాలని కేఎల్ఆర్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఓటరుగా నమోదైన పట్టభద్రులు తమ వివరాలను సరిచూసుకుని, అవసరమైతే సంబంధిత అధికారుల ద్వారా సవరణలు చేసుకోవాలని సూచించారు.మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్‌లో విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియలో నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొని, నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల సమష్టి కృషితో లక్ష్యాన్ని సాధించాలని కేఎల్ఆర్ ఆకాంక్షించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను

మేడ్చల్ నియోజకవర్గం జనరల్ సెక్రెటరీ శివలింగాల శ్రీనివాస్ గౌడ్



మీడియా టుడే/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: కీసర అక్టోబర్ 23

మేడ్చల్ నియోజకవర్గం లో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నియోజకవర్గ జర్న సెక్రెటరీ శివలింగాల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం డిసిసి అధ్యక్షులు వజ్రష్ యాదవ్ చేతుల మీదుగా నియామ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాపై నమ్మకంతో అందించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలంగా ఎదగడానికి కృషి చేస్తానని అన్నారు. డిసిసి అధ్యక్షులు వజ్రష్ యాదవ్ కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు

జనాభా గణన బ్లాకులను పటిష్టంగా ఏర్పాటు చేయాలి

ముగిసిన జనాభా గణన--2027 రెండవ దశ శిక్షణ

జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు



ములుగు జిల్లా అక్టోబర్23(మీడియా టుడే)

జనాభా గణన--2027లో భాగంగా గణన బ్లాకులు, ఉప గణన బ్లాకులను పటిష్టంగా ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు సూచించారు.ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జనాభా గణన--2027 రెండవ దశకు సంబంధించి గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల ఏర్పాటుపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన జనాభా గణనలోని 40 ప్రశ్నలు, స్వీయ గణన, సీఎంఎంఎస్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు.హైదరాబాద్‌లోని జనాభా గణన సంచాలకుల కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు యువేందర్ బాబు, నాయుడు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణలో జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్, ఆర్డీఓ కృష్ణవేణి, ఛార్జ్ అధికారులైన తహసీల్దార్లు, అదనపు ఛార్జ్ అధికారులైన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ముఖ్య ప్రణాళిక అధికారి బి. జవహర్ లాల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, గణాంక అధికారులు భూక్యా లాల్ నాయక్, ఎం. రమేష్ బాబు, ఈడీఎం దేవేందర్ పాల్గొన్నారు.

వారసత్వ సంపద పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలి

రామప్పలో 12 రోజుల ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం

సమ్మక్క సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్



ములుగు జిల్లా అక్టోబర్23(మీడియా టుడే)

చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదపై యువత అవగాహన పెంచుకొని, వాటి ప్రాధాన్యాన్ని ఇతరులకు తెలియ జేయాలని సమ్మక్క సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్ సూచించారు. తెలంగాణ పర్యాటక శాఖ సౌజన్యంతో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్పలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం--2026 కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన 35 మంది స్వచ్ఛంద సేవకులు ఈ 12 రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా ఉపకులపతి శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యాటకం, సంస్కృతి, వారసత్వం, భూగర్భ శాస్త్రం వంటి పలు అంశాలను తెలుసుకునేందుకు ఈ శిబిరం విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. చారిత్రక ప్రదేశాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేస్తూ, వారసత్వ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ మాట్లాడుతూ, శిబిరం నిర్వహణకు పర్యాటక శాఖ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. పర్యాటక పోలీసుల ద్వారా భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు.రామప్పకు ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించినప్పటి నుంచి వరుసగా ఐదో ఏడాది ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. రామప్పకు గుర్తింపు సాధించడంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ చేసిన కృషి, పోషించిన పాత్రను కార్యక్రమంలో వివరించారు. శిబిరంలో కల్పించే సౌకర్యాలు, విద్యార్థులు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. చరిత్రను తెలుసుకోవడం, వారసత్వ సంపదను పరిరక్షించడం, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవడం ద్వారా చారిత్రక ప్రదేశాలకు మరింత ప్రాచుర్యం కల్పించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధి ప్రొఫెసర్ పాండురంగారావు, శిబిర సమన్వయకర్త శ్రీధర్ రావు, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ పరిరక్షణ సహాయకుడు భార్గవ్, పర్యాటక శాఖ సహాయ పర్యాటక ప్రోత్సాహక అధికారి డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, ఆలయ పూజారులు ఉమాశంకర్, హరిశంకర్, పర్యాటక శాఖ సిబ్బంది, పర్యాటక పోలీసులు, దేవస్థానం సిబ్బంది, పర్యాటక మార్గదర్శకులు, వివిధ రాష్ట్రాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

యువ సంఘసంస్కర్త అవార్డు అందుకున్న గుర్రాల నాగరాజు

ఏం ఎన్ ఎస్ ఫౌండర్స్ డాక్టర్ బైరి నరేష్

గాండ్ల సుజాత టీచర్ చేతుల మీదుగా ప్రధానం



ఆలేరు ఆర్సీ, అక్టోబరు23/మీడియా టుడే:

సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని, హేతువాద భావాలను పెంపొందించే లక్ష్యంతో 'మూఢనమ్మకాల నిర్మూలన సంఘం' (ఏం ఎన్ ఎస్) ఆధ్వర్యంలో తమిళనాడులోని చెన్నై నగరంలో ఉన్న ప్రసిద్ధ 'పెరియార్ తిడల్' వేదికగా అక్టోబరు 17, 18, 19 తేదీలలో మూడు రోజుల పాటు 3వ జాతీయ మహాసభలు అత్యంత వైభవంగా జరిగాయి. ఏం ఎన్ ఎస్ వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు డాక్టర్ బైరి నరేష్ మరియు జాతీయ సమన్వయకర్త గాండ్ల సుజాత నేతృత్వంలో ఈ మహాసభలు దిగ్విజయంగా ముగిశాయి. దేశవ్యాప్తంగా మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, సంఘం కోసం, సమాజ హితం కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలు మరియు నాయకులను ఈ మహాసభల వేదికగా అభినందిస్తూ ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. ఈ క్రమంలోనే సమాజ మార్పు కోసం, హేతువాద భావాల ప్రచారానికి తాను చేస్తున్న సేవలను గుర్తించి, యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఏం ఎన్ ఎస్ తెలంగాణ రాష్ట్ర యూత్ కమిటీ జాయింట్ సెక్రటరీ గుర్రాల నాగరాజుకి జాతీయ నాయకత్వం యువ సంఘసంస్కర్త' అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా గుర్రాల నాగరాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో లభించిన ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మూఢనమ్మకాల నిర్మూలన కోసం, శాస్త్రీయ సమాజ స్థాపన కోసం తన వంతు కృషిని మరింత ఉధృతం చేస్తానని తెలిపారు. మహాసభలు విజయవంతంగా ముగియడంతో ప్రతినిధులంతా హేతువాద స్ఫూర్తితో స్వస్థలాలకు పయనమయ్యారు.

క్రేజీ కట్స్ సెలూన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్

యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి: బిక్షమయ్య గౌడ్



ఆలేరు ఆర్సీ,అక్టోబరు 23/మీడియా టుడే:

యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంలోని చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక "క్రేజీ కట్స్" కటింగ్ సెలూన్ ను ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ రిబ్బన్ కట్ చేసి వైభవంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కేవలం ఉద్యోగాలపైనే ఆధారపడకుండా, ఇలాంటి ఆధునిక స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని ఆర్థికంగా స్థిరపడాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా పట్టణ స్థాయి వసతులతో కూడిన సెలూన్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. వ్యాపార నిర్వాహకులు మోహన్ రావు, సాయివిరాట్ మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సంస్థ ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తూ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీపీ సుధీర్ రెడ్డి, సర్పంచ్ కట్ట ఉమాదేవి శ్రీకాంత్ గౌడ్,మాజీపాక్స్ చైర్మన్ బాల్ నరసింహ,మాజీ జడ్పీటిసి, తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట కలెక్టరేట్ పనులు వేగవంతం

వారం నుంచి పది రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశం

-?పరిశీలనలో అధికారులకు స్పష్టమైన సూచనలు - ?ప్రారంభోత్సవానికి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశం.

నారాయణపేట జిల్లా, అక్టోబర్ 23, మీడియా టుడే ప్రతినిధి

కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు వద్ద నిర్మిస్తున్న నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవన సముదాయంలో కొనసాగుతున్న వివిధ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.నూతన కలెక్టరేట్‌లోని మంత్రి ఛాంబర్, కలెక్టర్, అదనపు కలెక్టర్ ఛాంబర్లు, వీడియో కాన్ఫరెన్స్ హాల్, ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లలో కొనసాగుతున్న ఫర్నిచర్ పనులను కలెక్టర్ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఛాంబర్లలో ఇంటీరియర్ డిజైన్ ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని, అవసరమైన మార్పులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేస్తున్న ఫర్నిచర్, సౌండ్ సిస్టమ్ నాణ్యత, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం భవన సముదాయంలోని వివిధ శాఖలకు కేటాయిస్తున్న హాళ్లు, గదులను పరిశీలించారు. పై అంతస్తులో శాఖలకు కేటాయిస్తున్న గదుల వివరాలను అదనపు కలెక్టర్ శ్రీను, ఏవో అనిల్ కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన శాఖలకు కూడా అవసరానికి అనుగుణంగా గదులు కేటాయించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.కలెక్టరేట్ భవన సముదాయానికి నిరంతర తాగునీటి సరఫరా కల్పించే అంశంపై మిషన్ భగీరథ ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. భవన సముదాయానికి అవసరమైన తాగునీటి సరఫరా ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు, బ్యాంకు ఏటీఎం కేంద్రానికి కేటాయించనున్న గదులను పరిశీలించి, వాటి వినియోగానికి సంబంధించి పలు సూచనలు చేశారు.కలెక్టరేట్ ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో చర్చించారు. హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని గుర్తించి, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.నూతన కలెక్టరేట్ భవన సముదాయంలో మిగిలిన నిర్మాణ పనులన్నింటినీ వారం నుంచి పది రోజుల్లోగా పూర్తి



చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. పనుల పూర్తిలో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకట రమణయ్య, డీఈఈ రాములు, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

అర్వాల ఓట్లు తొలగించిన జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలి

ఏ ఐ కే ఎం ఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ఆలేరు ఆర్సీ, అక్టోబరు23/మీడియా టుడే:

ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పేరుతో మోడీ షాలు చెప్పినట్లుగా వాళ్ళకి నచ్చని ఓట్లు మొత్తాన్ని తొలగించి, అప్రజాస్వామిక పద్ధతిలో తన విధులను దుర్వినియోగ పరిచిన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ని వెంటనే తొలగించాలని అఖిల భారత రైతు-కూలీ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కల్లెపు అడివయ్య, బేజాడి కుమార్లు డిమాండ్ చేశారు.సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) పిలుపులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలో అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏ.ఐ.కే.ఎం.ఎస్) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అడివయ్య, కుమార్ లు మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్.ను తక్షణమే రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించి, ఆయనపై విచారణ జరపాలని, పారదర్శకత లేకుండా ఓటర్ల జాబితా నుండి తొలగించబడిన 13.41 కోట్ల మంది పౌరులందరికీ ఓటు హక్కును పునరుద్ధరించాలని, ఎంపిక ప్యానెల్‌లో క్యాబినెట్ మంత్రి స్థానంలో భారత ప్రధాన న్యాయమూర్తిని నియమించేలా 'ప్రధాన ఎన్నికల కమిషనర్ మరియు ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు మరియు పదవీకాలం) చట్టం, 2023'కు సవరణ చేయాలని, పదవీ విరమణ తర్వాత కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఈసి), ఎన్నికల కమిషనర్లకు (ఈసిలు)చట్టబ ద్ధమైన రక్షణ కల్పించే సెక్షన్ 16ను రద్దు చేయాలి. ఈ సెక్షన్, హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు లభించే రక్షణల కంటే కూడా విస్తృతమైనదని సుప్రీంకోర్టు తన వ్యాఖ్యలలో పేర్కొందని అన్నారు. ఎస్ ఐ ఆర్ కు వ్యతిరేకంగా ఢిల్లీలో పోరాడుతున్నయువ, విద్యార్థినులతో సహా నిరసనకారులపై జరుగుతున్న క్రూరమైన దాడులు, హింసలను ఆపాలన్నారు. శాంతియుత నిరసనలలో పాల్గొంటున్న విద్యార్థులు, యువత మరియు ప్రగతిశీల వాదులను రక్షించడానికి రైతులు ముందుకు రావాలని బీజేపీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల కింద రాష్ట్రాల్లో నిరసనకారులను విచ్చలవిడిగా గృహ నిర్బంధం చేయడం చట్టవిరుద్ధమని, ఇది భారతదేశాన్ని ఒక పోలీసు రాజ్యంగా మారుస్తోందని పౌరుల గోప్యతపై ప్రభుత్వం చేస్తున్న ఇటువంటి మితిమీరిన జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని ఎస్.కె.ఎం రైతులకు, ప్రజలకు పిలుపునిచ్చిందని అన్నారు. రాజధానిలో విస్తృతంగా జరుగుతున్న నేరాలను సుప్రీంకోర్టుతో సహా న్యాయవ్యవస్థ సుమోటోగా స్వీకరించనందుకు, శాంతిభద్రతలు కుప్పకూలడానికి అనుమతించడాన్ని వ్యతిరే కించాలన్నారు. దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడానికి రైతులు, సాధారణ ప్రజలు క్రియాశీలంగా ఏకం కావాలని, బీజేపీ కి జేబు సంస్థగా వ్యవహరిస్తున్న ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు మామిడాల సోమయ్య, ఉపాధ్యక్షులు చిరబోయిన రాజయ్య, మామిడాల బాల మల్లేష్, సహాయ కార్యదర్శి తమ్మడి అంజయ్య, కోశాధికారి బర్మా బాబు, జిల్లా నాయకులు చిరబోయిన కొమరయ్య, ఇప్ట జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, మేకల వెంకటేష్, కుర్రి సత్యనారాయణ, రామచంద్రు, ఐలయ్య, కడకంచి స్వామి, సుంచు రాములు, ఆర్. ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

మొరిపిరాల గ్రామంలో మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎంఎస్ఎఫ్) నూతన కమిటీ ఎన్నిక

మంద కృష్ణ మాదిగ 32 ఏండ్లు పోరాడి సాధించిన ఎస్సీ వర్గీకరణ ఫలాలు

ప్రతి మాదిగ విద్యార్థి అందుకోవాలి

మాదిగ విద్యార్థులంతా ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థానానికి ఎదగాలి

ఏ ఒక్క విద్యార్థి కూడా డ్రాపౌట్ కావొద్దు విద్యకు దూరం కావొద్దు

విద్య సంస్థలలో విద్యార్థులు ఏ సమస్య ఎదుర్కొన్న వారికి

ఎమ్మెసేఫ్,ఎమ్మార్పియస్ అండగా ఉంటుంది

ఎమ్మార్పియస్ ఆలేరు నియోజకవర్గం ఇంచార్జీ ఎంఎస్పీ

మాజీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ



ఆలేరు ఆర్సీ, అక్టోబరు23/మీడియా టుడే:

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు(ఎం)మండలం మొరిపిరాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) గ్రామ నూతన కమిటీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం రోజు మొరిపిరాల ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రదేశం లో ఎంఎస్ఎఫ్ గ్రామ నూతన కమిటీ ఎన్నిక సమావేశం ఎమ్మార్పీఎస్ మండల సహాయ కార్యదర్శి ముప్పిడి స్వామి మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పియస్ ఆలేరు నియోజకవర్గం ఇంచార్జీ ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఎస్సి రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎమ్మార్పియస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మాదిగ జాతీని, ఉపకులాలను ఏకం చేసి ముప్పై రెండు సంవత్సరాలు పోరాటంతో సాదించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను అందుకునే దగ్గర మాదిగ విద్యార్థులు వెనుకబాటు పడొద్దని విద్యతోనే మన భవిష్యత్ ముడిపడి ఉందని మాదిగ విద్యార్థులు బాగా చదువుకొని రానున్న రోజుల్లో ఉన్నత స్థాయికి వెళ్లే విధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఏ ఒక్క విద్యార్థి కూడా డ్రాపౌట్ కావొద్దని మాదిగ విద్యార్థులకు ఎలాంటి విద్య సంస్థలలో ఎలాంటి సమస్యలు వచ్చిన ఎమ్మార్పియస్ దృష్టికి తీసుకు రావాలని వారికి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెసేఫ్, ఎమ్మార్పియస్ అండగా నిలుస్తుందని అన్నారు. చదువే ద్యేయంగా విద్యార్థులు ముందుకు సాగాలని తల్లిదండ్రులు కన్న కలలని నిజం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల సహాయ కార్యదర్శి ముప్పిడి స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ మొదటితరం సీనియర్ నాయకులు ముప్పిడి రాజయ్య మాదిగ,వార్డు మెంబర్ ముప్పిడి ప్రవీణ్ మాదిగ,గ్రామ శాఖ నాయకులు ముప్పిడి మహేష్ మాదిగ, గంగారాం రమేష్ మాదిగ, ఇందప్రల్లి రమేష్ బైండ్ల, ముప్పిడి అఖిల్ మాదిగ, ముప్పిడి అనిల్ మాదిగ, ముప్పిడి బుచ్చయ్య మాదిగ, ముప్పిడి పరుశురామ్ మాదిగ, ముప్పిడి భాను ప్రసాద్ మాదిగ, ముప్పిడి వెంకటేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.మొరిపిరాల గ్రామ ఎంఎస్ఎఫ్ నూతన కమిటీఅధ్యక్షులు:పుట్టల రమేష్ మాదిగ –ఇంటర్ ప్రథమ సంవత్సరం,అధికార ప్రతినిధి: ముప్పిడి భాను ప్రసాద్ మాదిగ – పీజీ, ప్రధాన కార్యదర్శి: ముప్పిడి సందీప్ మాదిగ –ఇంటర్ ప్రథమ సంవత్సరం,ఉపాధ్యక్షులు: ముప్పిడి వర్ధన్ మాదిగ – బిటెక్,ఉపాధ్యక్షులు: ముప్పిడి శ్రవణ్ మాదిగ – బిటెక్,కార్యదర్శి: ముప్పిడి తనుష్ మాదిగ – బిటెక్,సహాయకార్యదర్శి: ముప్పిడి అఖిల్ మాదిగ – డిగ్రీ,ప్రచార కార్యదర్శి : ముప్పిడి అనిల్ మాదిగ – డిగ్రీ,సంయుక్త కార్యదర్శి : ముప్పిడి మహేధర్ మాదిగ ఎన్నిక,ఎంఎస్ఎఫ్ గర్ల్స్ కమిటీ అధ్యక్షులు : ముప్పిడి వెన్నెల మాదిగ, అధికార ప్రతినిధి : నల్ల గౌతమి మాదిగ,ప్రధాన కార్యదర్శి : పుట్టల వెన్నెల మాదిగ, ఉపాధ్యక్షులు : నల్ల గేహాలశ్రీ మాదిగ,కార్యదర్శి : ముప్పిడి చైత్ర మాదిగ, సహాయకార్యదర్శి : టీన మాదిగ, సంయుక్త కార్యదర్శి : ముప్పిడి భవ్య,ప్రచార కార్యదర్శి : ముప్పిడి సారిక, రేష్మ మాదిగ ఎన్నికయ్యారు.ఎంఎస్యూ (మహాజన స్టూడెంట్ యూనియన్) అధ్యక్షులుగా బండారి సిద్దార్థ ఎన్నికయ్యారు.

దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఆలేరులో పాలాభిషేకం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కురుమ సంఘం నాయకులు




ఆలేరు ఆర్సీ, అక్టోబరు 23/మీడియా టుడే:

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడంపై ఆలేరు పట్టణ కురుమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక రైల్వే గేట్ సమీపంలో కురుమ సంఘం అధ్యక్షుడు చిన్నం యాదగిరి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బీజాన బాలమణి భాస్కర్ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరవీరుడిగా నిలిచిన దొడ్డి కొమురయ్య సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో ఆయనకు సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేయడం అభినందనీయమన్నారు.ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేసే అంశంపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖకు ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని తెలిపారు. ఈ నిర్ణయం దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడంతో పాటు, ఆయన త్యాగాలకు తగిన గుర్తింపు లభించేందుకు దోహదపడుతుందని అన్నారు.దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సానుకూల స్పందన వచ్చేలా కృషి చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఆలేరు పట్టణ ప్రజల తరఫున, కురుమ సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజాన బాలమణి భాస్కర్ పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగిన దొడ్డి కొమురయ్యకు గౌరవప్రదమైన గుర్తింపు లభించడం బీసీ వర్గాలకు, ముఖ్యంగా కురుమ సామాజిక వర్గానికి గర్వకారణమని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో 10 వ వార్డు కౌన్సిలర్ మల్లెల సరిత శ్రీకాంత్, 11 వ వార్డు కౌన్సిలర్ జూకంటి సంపత్, 12 వ వార్డు కౌన్సిలర్ జెట్ట నీరజ సిద్దులు, కురుమసంఘం నాయకులు ఏగ్గిడి శ్రీనివాస్, చిమ్మి అబ్బాసాయిలు, పేరపు రాములు, బండ పర్వతాలు, వట్టిపెల్లి శ్రీనివాస్,పిక్క శ్రీనివాస్ ఎగ్గిడి మల్లయ్య, కుళ్ళ సిద్దులు, కుళ్ళ నర్సింహులు, ఎగ్గిడి రవి, మైల వెంకటేష్, భాల్ద శేఖర్, బుడిగే సిద్దులు, బర్ల సిద్దులు మరియు కురుమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాజ్‌పూర్‌లో నీటి సంరక్షణపై ప్రత్యేక గ్రామసభ


ఆలేరు ఆర్సీ,అక్టోబరు 23/మీడియా టుడే:



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిజీ రామ్ జి ప్లాన్ ప్రక్రియలో భాగంగా నీటి కొరత నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశానికి మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీవో దినకర్, ఏపీవో బాలస్వామితో పాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్‌లో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, విద్యుత్‌ను కూడా ఆదా చేయాలని కోరారు. సర్పంచ్ సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని బోర్లలో నీటి లభ్యత తగ్గడంతో గత కొన్ని నెలలుగా తన సొంత వ్యవసాయ బోరు ద్వారా గ్రామానికి నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ఇతర రైతుల నుంచి మరో రెండు బోర్లను అద్దెకు తీసుకున్నట్లు చెప్పారు. విద్యుత్ అధికారుల సహకారంతో నిరంతర విద్యుత్ సరఫరా అందడంతో నీటి సమస్య కొంతవరకు తగ్గిందన్నారు.ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, నల్లాలకు తప్పనిసరిగా ట్యాప్‌లు బిగించుకుని నీటి వృథాను అరికట్టాలని సర్పంచ్ సూచించారు. నీటిని అనవసరంగా వృథా చేస్తే గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సామాజికవేత్త డా. ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నర్సింగ్‌రావు, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు మహ్మద్ గాలిబీ యాకుబ్, బొమ్మారపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజు, బీట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజుతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శక్తి నగర్‌లో 15 ఏళ్ల రహదారి సమస్యకు తాత్కాలిక పరిష్కారం వడ్డేపల్లి రాజేశ్వరరావు







కూకట్‌పల్లి, అక్టోబర్ 23 (మీడియా టుడే ప్రతినిధి)

ఖైతలాపూర్ డివిజన్ పరిధిలోని శక్తి నగర్ వైట్ వాటర్ అపార్ట్‌మెంట్స్ వద్ద 15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న రహదారికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు సహకారంతో తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మించారు. స్థానిక ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆయన చొరవ తీసుకున్నారు. నూతనంగా నిర్మించిన మట్టి రోడ్డును రాజేశ్వరరావు నాయకులతో కలిసి ప్రారంభించారు. రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న స్థానికులకు ఈ నిర్మాణంతో కొంత ఉపశమనం లభించింది. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. రోడ్డు నిర్మాణానికి సహకరించిన డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ఇతర నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయ భవాని, యంజల పద్మయ్య, కోడిచెర్ల వినోద్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

కీసర సీఐ ఎలక్షన్ రెడ్డిపోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వ్వారోత్సవాలులి

సెన్సిటీ మోడల్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ



మీడియా టుడే/ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: నాగారం అక్టోబర్ 23

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం నాగారంలోని సెన్సిటీ మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. కీసర సీఐ ఎలక్షన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం సెన్సిటీ మోడల్ స్కూల్ నుండి ప్రారంభమైన ర్యాలీ నాగారం ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ – విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి కుటుంబాలకు అండగా ఉండాలని, విద్యార్థులు క్రమశిక్షణతో, దేశభక్తితో మెలగాలని సూచించారు.విద్యార్థులు "పోలీస్ అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నాగారం ఎస్సై శ్రీనివాస్, సెన్సిటీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జంగి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెర్లలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం



ఆలేరు ఆర్సీ, అక్టోబరు23/మీడియా టుడే:

వ్యవసాయ భూముల సారవంతాన్ని కాపాడుతూ, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని వ్యవసాయ విస్తరణ అధికారి ముప్పిడి అశోక్ కుమార్ సూచించారు. శుక్రవారం పల్లెర్ల గ్రామ పంచాయతీలో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ భూముల పరిరక్షణ, నేల పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత, పంట మార్పిడి, నీటి సంరక్షణ, పంట అవశేషాల సమర్థ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని, పశువుల ఎరువు, కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులతో నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచుకోవాలని, పంట అవశేషాలను కాల్చకుండా ఉపయోగించాలని సూచించారు. భూగర్భజలాల లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని, నేల కోతను నివారిస్తూ పర్యావరణహిత సాగు పద్ధతులను అనుసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, ఏఈ మెహర్ సాయి, వెటర్నరీ డాక్టర్ గిరి, ఏపీవో రమేష్, హెచ్ఈవో శ్రీనివాసులు, పల్లెర్ల సర్పంచ్ తండ మంజుల, లింగరాజుపల్లి సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి, రాఘవాపురం సర్పంచ్ ఎరుకల యతీశ్వర్, పంచాయతీ కార్యదర్శులు బాలరాజు, వి. శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, రైతులు నర్సింహా గౌడ్, సుదర్శన్, రామలక్ష్మయ్య, యాదిరెడ్డి, మల్లేష్, మచ్చగిరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి ఢిల్లీ ఉద్యమకారులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి -ములకలపల్లి రాములు డిమాండ్



కోదాడ, అక్టోబర్ 23 (మీడియా టుడే)–:

భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జ్లి అధ్యక్షులు ములకలపల్లి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం స్థానిక రంగా థియేటర్ సెంటర్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జ్ఞానేష్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు అనంతరం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కార్ రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ భారత ఎలక్షన్ ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాల వల్ల దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓట్లు రద్దు అయినాయి అని రాములు అన్నాడు మోడీ సర్కారు నాలుగోసారి అధికారంలోకి రావడం కోసం కీలుబొమ్మలాంటి జ్ఞానేష్ కుమార్ అడ్డం పెట్టుకొని 14 కోట్ల ఓట్లు తొలగించారని ఆయన విమర్శించారు దేశంలో చీఫ్ ఎలక్షన్ కమిషన్ నియమించడంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉంటారని పార్లమెంట్లో తన మంది బలాన్ని ఉపయోగించుకొని చీఫ్ ఎలక్షన్ కమిషన్ నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తొలగించి తన మంత్రిని పెట్టుకొని మోడీ సర్కార్ తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు ప్రజాస్వామ్యం కోసం ఓటు హక్కు కోసం పోరాడుతున్న నాయకుల పైన లాటి చార్జీ అక్రమ కేసులు మోపుతున్నారని అని విమర్శించారు తక్షణమే అక్రమ కేసులు ఎత్తివేయాలని జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ యొక్క కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మీద వెంకటేశ్వరరావు సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ సిఐటియు పట్టణ కన్వీనర్ ఎం ముత్యాలు కౌల్దారు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ సైదా ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జూలకంటి విజయలక్ష్మి రైతు సంఘం నాయకులు అలసగాని బ్రహ్మయ్య రాపోలు సూర్యనారాయణ నాగాటి రాములు రాములు సోంపంగు రాధాకృష్ణ జంగాపల్లి శీను కలయాసన్ తదితరులు పాల్గొన్నారు

-వైద్య వృత్తిలో కరుణ, సేవాభావం ముఖ్యం

జిల్లా కలెక్టర్ ప్రియాంక


-- అప్పక్‌పల్లి ప్రభుత్వ జనరల్ జిల్లా ఆస్పత్రిలో ఎంబీబీఎస్ మూడో బ్యాచ్ ఓరియంటేషన్, వైట్ కోట్ సెర్మనీ

- నిరంతరం నేర్చుకుంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని విద్యార్థులకు పిలుపు



?నారాయణపేట, అక్టోబరు 23, మీడియా టుడే ప్రతినిధి: వైద్య వృత్తిలో కరుణ, మానవత్వం, సేవాభావం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. మండల పరిధిలోని అప్పక్‌పల్లి వద్ద గల ప్రభుత్వ జనరల్ జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం వైభవంగా నిర్వహించిన ఎంబీబీఎస్ మూడో బ్యాచ్ ఓరియంటేషన్ డే, 'వైట్ కోట్ సెర్మనీ'కి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్య విద్యలో సీటు సాధించడం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సుదీర్ఘ శ్రమ, పట్టుదలల ఫలితమని కొనియాడారు. డాక్టర్లుగా మారే అద్భుత ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.?నారాయణపేట వైద్య కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, ప్రత్యక్ష వైద్య సేవలను లోతుగా నేర్చుకోవడానికి ఇక్కడ మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే విభిన్న రకాల కేసుల ద్వారా విద్యార్థులు విస్తృత అనుభవాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. సమాజం వైద్యులను ఎంతో నమ్మకంతో చూస్తుందని, ప్రతి రోగిని ఓర్పు, గౌరవంతో పలకరిస్తూ ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.?వైద్య విద్య అనేది డిగ్రీతో ముగిసేది కాదని, నిరంతరం నేర్చుకోవాల్సిన ప్రక్రియ అని పేర్కొన్నారు. నూతన పరిజ్ఞానం, చికిత్సా విధానాలపై అవగాహన పెంచుకుంటూ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ ఆదర్శవంతమైన పౌరులుగా ఎదగాలని కోరారు. కళాశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు జిల్లా యంత్రాంగం నిరంతరం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంపత్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆదిత్య గౌడ్, ఆర్ఎంవో బాలాజీ సింగాడే, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శేరి సతీష్ రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేత


GANDHI BHAVAN, HYDERABAD – 500001

To
Sri Sheri Satish Reddy,
Former President,
Kukatpally Town Congress Party.

Sub: Revocation of Suspension Order – Reg.

The Disciplinary Action Committee (DAC) of the Telangana Pradesh Congress Committee (TPCC) has carefully examined the explanation submitted by you on 01.10.2026 and decided to revoke your suspension.

You are hereby advised to adhere to the party's discipline and guidelines and to work in close coordination with the local Congress leaders and the District Congress Committee (DCC) President to strengthen the party and prepare for the forthcoming elections.

Shyam Mohan Anantula
Vice Chairman, DAC-TPCC

(Dr. MALLU RAVI, MP)
Chairman, TPCC - DAC



కూకట్‌పల్లి,అక్టోబర్ 23,(మీడియా టుడే ప్రతినిధి)

కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) క్రమశిక్షణ చర్యల కమిటీ ఎత్తివేసింది. తన వివరణను పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నందుకు టీపీసీసీ నాయకత్వానికి, కమిటీ చైర్మన్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ అనంతుల, డీసీసీ నాయకత్వానికి సతీష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తనకు అండగా నిలిచిన శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ క్రమశిక్షణను గౌరవిస్తూ స్థానిక, జిల్లా నాయకత్వంతో సమన్వయంగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానని శేరి సతీష్ రెడ్డి వెల్లడించారు.

నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

మీడియా టుడే నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (అక్టోబర్ 23):



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం పనులను వేగవంతంగా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పెంట్లవెల్లి మండలం జటప్రోల్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ లను శుక్రవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటలు సందర్శించి పాఠశాల నిర్మాణం పనుల పురోగతిని సమీక్షించి ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర సమాచారాన్ని సేకరించారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించి పూర్తి అయిన పనులు పురోగతిలో ఉన్న పనులు మిగిలి ఉన్న పనుల వివరాలను అధికారులు కలెక్టర్కు వివరించారు. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు పరిస్థితిని పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు.నిర్మాణం పనులను వేగవంతం చేసి మిగిలి ఉన్న పనులను త్రుతగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణం పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ పనుల నిర్వహణలో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్.

పర్వతగిరి అక్టోబర్ 23 మీడియా టుడే



నిరుపేద కుటుంబానికి చెందిన భైరబోయిన దూడమ్మ ఇటీవల మృతి చెందడంతో, ఆమె కుటుంబాన్ని జమాల్‌పురం గ్రామ సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరికి కష్టం వచ్చినా అండగా నిలబడటం తన బాధ్యతగా భావిస్తానని తెలిపారు. మృతురాలి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఆర్థిక సాయం అందించిన సర్పంచ్‌కు బాధిత కుటుంబ సభ్యులు వనపూల, గంగరాజు, శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భైరబోయిన సదయ్య, పిడుగు రాంబాబు, గోదారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భూక్య భాస్కర్ అంతిమయాత్రలో పాల్గొని కుటుంబానికి ఆర్థిక సాయం

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం: బొంపెల్లి దేవేందర్ రావు, జాటోత్ శ్రీనివాస్ నాయక్.

పర్వతగిరి అక్టోబర్ 23 మీడియా టుడే



వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలంలోని మల్యాల తండా పరిధి గడ్డపార తండాకు చెందిన భూక్య భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన అంతిమయాత్రలో జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావు, జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన జాటోత్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు. బొంపెల్లి దేవేందర్ రావు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా జాటోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ భూక్య భాస్కర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున, ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లె తండా సర్పంచ్ భూక్య మంజుల, శ్రీనివాస్, ఏనుగల్లు సర్పంచ్ తొర్రి పద్మ యాదవ్, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బూత్ కన్వీనర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని రోడ్లపై బైక్ స్టంట్లు చేస్తున్న యువకుడిపై కేసు నమోదు

-టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ



మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి

రోడ్లపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ నగరంలో ని ఘట్టయ్య సెంటర్ రోడ్లపై మితిమీరిన వేగంతో బైక్ స్టంట్లు చేస్తూస్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న వల్లూరు కృష్ణకిశోర్ రెడ్డి ని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేయడం జరిగిందని టూ టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. బైక్ స్టంట్లు,తల్వార్ ప్రదర్శనలు, రోడ్లపై పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం వంటి చట్ట వ్యతిరేక చర్యలపై సీరియస్ గా దృష్టి పట్టాలని టాస్క్ ఫోర్స్, సిసియస్, స్పెషల్ బ్రాంచ్, స్థానిక పోలీసులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించడంతో ఖమ్మం టూ టౌన్ పోలీసులు సముక్తంగా రాత్రి పలు ప్రాంతాలలో రోడ్లపై బైక్ విన్యాసాలు చేస్తున్న వారిపై దృష్టి పెట్టి తనిఖీలు నిర్వహించామని ఇన్స్పెక్టర్ తెలిపారు. బైక్ విన్యాసాలు చేయడం, వాటిని సోషల్ మీడియా లో పోస్ట్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు.దేవిదంగా పుట్టినరోజు వేడుకల పేరుతో తల్వార్ వంటి ఆయుధాలను ప్రదర్శిస్తూ నడిరోడ్డు పైన హడావుడి చేయడం, బైక్ లకు మార్పు చేసిన సైలెన్సర్లు అమర్చి పెద్ద శబ్దాలతో చేయడం, బైక్ కు నెంబర్లు లేకుండా తిరుగుతే కేసులు నమోదు చేస్తామని అన్నారు. మద్యం మత్తులో వాహనాన్ని డ్రైవింగ్ చేస్తే వారి వాహనాన్ని సీజ్ చేసి అట్టి వ్యక్తిని కోర్టులో హాజరు పరిచి శిక్ష పడే విధంగా చేస్తామని హెచ్చరించారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా, ప్రజల భద్రతకు భంగం కలిగించినా ఉపేక్షించే ప్రసక్తే లేదని,ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అత్యుత్సాహంతో తమ జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకోవడమే కాకుండా, ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, రోడ్లపై బైక్ స్టంట్లు చేయడం, ఆయుధాలతో భయాందోళనలు సృష్టించడం నేరమని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రదానంగా తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు బైక్‌లు ఇవ్వకూడదని, అదేవిధంగా పిల్లల రోజువారి కార్యకలాపాలను నిశితంగా గమనిస్తూ ఉండాలని, చట్టవరుద్ధమైన ప్రాణాపాయం కలిగించే ఇలాంటి పనులకు దూరం ఉండేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. అవసరమైతే తల్లిదండ్రులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే యువత ఇలాంటి సాహసాలకు పోయి ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు. ప్రజల భద్రతకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే, స్థానిక పోలీసులకు లేదా దయల్ 112 కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.వా

ఖమ్మం డి పి ఆర్సి భవనంలో జనగణన -2027 ఫేజ్-2 శిక్షణా కార్యక్రమం



మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :

జనగణన-2027 ప్రక్రియలో భాగంగా జిల్లా పంచాయతీ రీసోర్స్ సెంటర్ భవనం నందు జిల్లా స్థాయి , డివిజన్ స్థాయి మరియు ఛార్జ్ స్థాయి అధికారులకు రెండు రోజులు నిర్వహించిన ఫేజ్-2 శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రాబోయే ఫిబ్రవరి 2027 లో జరగనున్న జనగణన క్షేత్రస్థాయి విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణను ఏర్పాటు చేశారు.ఈ శిక్షణా తరగతులకు హైదరాబాద్‌లోని సెన్సస్ డైరెక్టరేట్ కార్యాలయం నుండి విచ్చేసిన సెన్సస్ అధికారులు హిమవర్ష మరియు రాజు ముఖ్య శిక్షకులుగా హాజరయ్యారు. జిల్లా పరిధిలోని జిల్లా స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు మరియు ఛార్జ్ స్థాయి అధికారులకు, వారు జనగణన విధివిధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు.శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ... జనగణన-2027 ప్రక్రియ దేశ ప్రగతికి, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. ఫిబ్రవరి 2027 లో జరిగే జనగణన(పాపులేషన్ ఏనుమేరేషన్)ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో సేకరించాల్సిన వివరాలు, ఫారాల నమోదు, మొబైల్ యాప్ / పోర్టల్ వినియోగం, ఛార్జ్ రిజిస్టర్ల నిర్వహణ తదితర సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా ప్రణాళికతో, గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. విధుల నిర్వహణలో ఏవైనా సందేహాలుంటే ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటూ సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రణాళిక విభాగ అధికారులు, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు మరియు ఛార్జ్ఖాయి అధికారులకు,పాల్గొన్నారు.

రబీలో రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి సాగు చేయొద్దు

వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

ఖేతి బచావో అభియాన్ పై అవగాహన అవసరం.

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు (అక్టోబర్ 23)



ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున జిల్లాలోని రిజర్వాయర్లలో నీళ్లు డెడ్ స్టోరేజీలో ఉన్నందున రైతులు రబీలో వరి ఎట్టి పరిస్థితుల్లో వేయవద్దని, ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వెబ్ ఎక్స్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లాలో మొత్తం పంట ఏరియా 319470 ఎకరాలు ఉండగా వరితోపాటు పత్తి, మిరప, వేరుశనగ, కందులు, తదితర పంటల పరిస్థితిపై మాట్లాడారు. వర్షాలు తక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు మొదటి నుంచి చెబుతున్నప్పటికీ జిల్లాలోని పలువురు రైతులు ఖరీఫ్ సీజన్ లో వరి సాగు చేశారని, ఆ పంటలను బతికించేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి వారబందీ విధానంలో కాలువలకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

వరి వద్దు - ఆరుతడే ముద్దు

రబీ సీజన్ లో రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి సాగు చేయకుండా ముందస్తుగానే గ్రామసభలు నిర్వహించి అవగాహన కలిగించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై ఉందన్నారు. బోరు, బావుల వద్ద నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని సూచించారు. వ్యవసాయానికి ప్రస్తుతం విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం ఉన్నందున భవిష్యత్తులో ఆ సమస్య పెరిగితే పంటలను బతికించుకోవడం కష్టతరమవుతుందన్నారు. కాబట్టి రైతులు తక్కువ నీటితో పండే పంటలను ఎన్నుకోవాల్సిందిగా కోరారు.

ఖేతి బచావో అభియాన్ పై అవగాహన అవసరం.

ఖేతి బచావో అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని, వాటితోపాటు గ్రామసభలలో కరువు పరిస్థితులు, పంటల ఎంపిక, పశుగ్రాసం, ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించాలన్నారు. సర్పంచులు, ఎంఎవోలు, ఏఈవోలు, మండల ప్రత్యేక అధికారులు, తసిల్దారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శిలు గ్రామ సభలలో పాల్గొనేలా చూడాలన్నారు. ప్రతి క్లస్టర్ లోని గ్రామాల వారిగా సమావేశాల షెడ్యూల్ తయారుచేసి జిల్లా వ్యవసాయ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. రైతులకు పంపిణీ చేయడానికి జిల్లా, మండల స్థాయిలో పంటల సలహా పత్రాలు రూపొందించాలన్నారు. ఖేతి బచావో అభియాన్ అనేది భారత దేశంలో వ్యవసాయ భూముల పరిరక్షణ మరియు రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక దేశవ్యాప్త అవగాహన ఉద్యమం అని పేర్కొన్నారు. ఈ అభియాన్ (ఉద్యమం) యొక్క ప్రధాన ఉద్దేశాలు నేల ఆరోగ్యాన్ని కాపాడటం, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల దెబ్బతింటున్న నేల సారాన్ని, భూమి ఆరోగ్యాన్ని కాపాడటం ప్రధానమని తెలిపారు. పంట దిగుబడి పేరుతో రైతులు విపరీతంగా యూరియా, ఇతర రసాయనాలు వాడకుండా "సాయిల్ హెల్త్ కార్డ్" ఆధారంగా నేల పరీక్షలు చేయించుకుని, ఎంత మోతాదులో ఎరువులు అవసరమో అంతే వాడేలా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అవసరానికి మించి రసాయనాలు వాడటం వల్ల రైతులపై ఆర్థిక భారం పడుతుంది కాబట్టి సరైన పద్ధతిలో ఎరువులు వాడటం ద్వారా పెట్టుబడి ఖర్చును తగ్గించి, లాభాలు పెంచడం అవసరమన్నారు. సహజ, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ముఖ్యమని పేర్కొన్నారు. రసాయనిక ఎరువులకు బదులుగా బయో-ఫెర్టిలైజర్స్ (జీవ ఎరువులు), పచ్చి రొట్ట ఎరువులు, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించేలా రైతులను ప్రోత్సహించడం, నీటి వృధాను అరికట్టడానికి జల సంరక్షణ పద్ధతులు, ఆధునిక సాగు పద్ధతులు మరియు శాస్త్రీయ పంట నిర్వహణ గురించి గ్రామస్థాయిలో రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నకిలీ ఎరువులు, పురుగుమందుల వలన నష్టపోకుండా రైతులను అప్రమత్తం చేయడం, వ్యవసాయంలో సరికొత్త సాంకేతికతను పరిచయం చేయడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 31 తేదీ వరకు ప్రతి నియోజకవర్గానికి 30 సమావేశాలను నిర్వహించి రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు (అక్టోబర్ 23)



జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలోని వైఎస్సార్ చౌక్‌లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు న్యాయమైన హక్కుల సాధన కోసం గత 11 రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని 78 కేడర్లలో 20 ఏళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమ బద్ధీకరించాలని ప్రధాన డిమాండ్‌గా పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రాంతి మాట్లాడారు.ఈ సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, టీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు కురువపల్లయ్య డీటీఎఫ్ నాయకుడు ప్రభాకర్, పీఎల్‌వై నాయకుడు దానయ్య, రైతు సంఘం నాయకుడు గోపాల్ తదితరులు మద్దతు తెలిపారు.

మూఢనమ్మకాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తాం

(ఎంఎన్ఎస్ జాతీయ మహాసభల్లో పెరుమాళ్ల సునీల్ అంబేద్కర్...

జగిత్యాల మీడియా టుడే - అక్టోబర్ 23



చెన్నైలోని పెరియార్ తిడల్ వేదికగా అక్టోబర్ 17, 18, 19 తేదీల్లో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం (ఎంఎన్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల జాతీయ మహాసభలు ముగిశాయి. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేష్, జాతీయ సమన్వయకర్త గాండ్ల సుజాత నేతృత్వంలో జరిగిన ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా హేతువాదులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు.జగిత్యాల జిల్లా నుంచి పెరుమాళ్ల సునీల్ అంబేద్కర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మహాసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ అంబేద్కర్ మాట్లాడుతూ.. సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని, హేతువాద భావాలను విస్తృతంగా ప్రచారం చేస్తామని తెలిపారు. మూఢనమ్మకాలు, మూఢాచారాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తామని వెల్లడించారు.

త్రివిధ దళాల సమన్వయంలో సీడీఎస్ కీలక భూమిక

కె.ఎస్.పి.పి. ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న నితిన్ ఎ. గోఖలే


పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, అక్టోబర్ 23 :



భారతదేశ రక్షణ రంగంలోని త్రివిధ దళాలను సమన్వయం చేయడంతో పాటు ప్రభుత్వానికి ఏకోన్ముఖంగా సైనిక సలహాలు ఇవ్వడం, దళాల నైపుణ్యాన్ని పెంపొందించడంలో త్రివిధ దళాధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ -- సీడీఎస్) కీలక భూమిక పోషిస్తున్నారని భారత్ శక్తి గ్రూపు వ్యవస్థాపకుడు, ఎడిటర్-ఇన్-చీఫ్ నితిన్ ఎ. గోఖలే అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కె.ఎస్.పి.పి)లో 'రేపటి యుద్ధాలకు సన్నద్ధం: త్రివిధ దళాల నుంచి ఒకే పోరాట శక్తిగా' అనే అంశంపై శుక్రవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. గోఖలే భారతదేశ ఉన్నత రక్షణ వ్యవస్థ పరిణామక్రమాన్ని వివరిస్తూ, లార్డ్ ఇస్మే ప్రతిపాదించిన మూడు అంచెల నిర్మాణం, జాతీయ భద్రతా దళం (ఎన్.ఎస్.జీ) ఏర్పాటు గురించి చర్చించారు. కార్గిల్ సమీక్షా కమిటీ సిఫార్సులు, సీడీఎస్ ఏర్పాటుకు సంబంధించి 2019 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనతో సహా రక్షణ సంస్కరణలలోని కీలక మైలురాళ్లను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. 2020 జనవరి 1న భారతదేశపు మొట్టమొదటి సీడీఎస్ నియామకం, సైనిక వ్యవహారాల శాఖ (డీఎంఏ) ఏర్పాటు గురించిన వివరాలను కూడా తెలియజేశారు. సీడీఎస్ పాత్ర గురించి, చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీఓఎస్సీ) అధ్యక్షునిగా, డీఎంఏ కార్యదర్శిగా, త్రివిధ దళాల అధిపతిగా సీడీఎస్ బాధ్యతలను గోఖలే వివరించారు. ఈ సంస్థాగత మార్పులు, సాయుధ దళాల మధ్య త్రివిధ దళాల ఏకీకరణ (థియేటరైజేషన్), అధిక కార్యాచరణ సమన్వయానికి పునాది వేశాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఉపన్యాసం రక్షణ పరివర్తనలోని కీలక రంగాలను పరిశీలించింది. వాటిలో పోరాట సామర్థ్యాన్ని పెంచడం, మానవశక్తి, వనరులను ఉత్తమంగా వినియోగించుకోవడం, ఆధునీకరణ, స్వదేశీకరణ, మానవ వనరుల సంస్కరణలు, సాయుధ దళాలలో మహిళల భాగస్వామ్యం, వలసవాద వారసత్వాలను పరిష్కరించడం, జాతీయ భద్రతా ప్రయత్నాలను బలోపేతం చేయడం వంటి ఉన్నాయి. త్రివిధ దళాల ప్రధాన కార్యాలయాలలో తేడాలు, కార్యాచరణ అవసరాలు, సైనిక, పౌర పరిపాలనా నిర్మాణాల సమన్వయం వంటి ఏకీకరణకు ఎదురయ్యే ఆచరణాత్మక, సంస్థాగత సవాళ్లను కూడా గోఖలే ప్రస్తావించారు. త్రివిధ దళాలు ఏకోన్ముఖంగా ముందుకెళ్లే మార్గాన్ని గోఖలే వివరిస్తూ, సమీకృత థియేటర్ కమాండ్లను స్థాపించడం, వాయు రక్షణ, సంయుక్త కమాండ్ నిర్మాణాలను ఏకీకృతం చేసి కార్యాచరణలోకి తీసుకురావడం, 2047 నాటికి సాయుధ దళాల కోసం ఒక దీర్ఘకాలిక దార్శనికతను అభివృద్ధి చేయడం, సంయుక్త సిద్ధాంతాలను రూపొందించడం, త్రివిధ దళాలకు ఆదేశాలు, సూచనలు జారీ చేయడం, సంబంధిత ఏజెన్సీలను విస్తరించడం వంటి వాటి ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. భారతదేశ ఉన్నత రక్షణ సంస్థపై ఆపరేషన్ సింధూర్ ప్రభావాలను, చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ యొక్క కేంద్రీకృత పాత్రను గోఖలే విశదీకరించారు. సీడీఎస్ వ్యవస్థలోని లోటుపాట్లను విశ్లేషిస్తూ, డొమైన్ నైపుణ్యం, ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యాన్ని కీలక బలాలుగా ఆయన గుర్తించారు. నేర్చుకోవలసిన విషయాలు, సంస్థాగత పక్షపాతాలు, పరిపాలనా పనిభారం వంటివి బలహీనతలుగా విశ్లేషించారు. విధాన నిర్ణయాలలో మరింత సన్నిహిత భాగస్వామ్యం, తక్కువ సమయం వల్ల తలెత్తే అవకాశాలలతో పాటు, వివిధ సేవల మధ్య సమన్వయం, సంస్థాగత సహకారాన్ని బలోపేతం ఆవశ్యకతను ఆయన ప్రస్తావించారు. ఉపన్యాసం ముగిశాక నిర్వహించిన ముఖాముఖిలో గోఖలే, విధాన రంగ నిపుణులుగా ఎదగాలనుకుంటున్న ఔత్సాహిక విద్యార్థులతో సంభాషించి, వారి ప్రశ్నలకు ఓపికగా సమాధానమిచ్చారు. కె.ఎస్.పి.పి. డీన్, ఐక్యరాజ్య సమితిలో భారతదేశ మాజీ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ కూడా ఈ ఉపన్యాస కార్యక్రమానికి హాజరయ్యారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆర్థిక చేయూత

యాచారం, అక్టోబర్ 23(మీడియా టుడే)



మండల పరిధిలోని అయ్యవారిగూడ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కొప్పు పోచమ్మ కుటుంబ సభ్యులను అయ్యవారిగూడ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు పరామర్శించి, వారి కుటుంబానికి ?10,000 ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నక్క లక్ష్మయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచులు నక్క మహేందర్ యాదవ్, కొప్పు వెంకటస్వామి, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, వార్డు సభ్యులు నక్క కలమ్మ నందు, పసులాది కరుణాకర్ రెడ్డి, పోలమోని జంగయ్య, మండలి చెన్నకేశవులు, కొప్పు చంద్రశేఖర్, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గల్లీ నుంచి ఢిల్లీ వరకు దామరకుంట సింధుజ సత్తా

దామరకుంట విద్యార్థిని సింధుజకు గైడ్ టీచర్ కు ఘన సన్మానం

గ్రామ సర్పంచ్ పత్తి నర్సింలు యాదవ్



మర్కుక్ అక్టోబర్ 23 (మీడియా టుడే)

గ్రామీణ విద్యార్థులు సైతం జాతీయ స్థాయిలో ప్రతిభ చాటగలరని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బోయిని సింధుజ నిరూపించింది. ఢిల్లీలో అక్టోబర్ 12 నుంచి 14 వరకు నిర్వహించిన 12వ జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మానక్ ఎగ్జిబిషన్-కమ్-ప్రెజెంటేషన్ ఎన్ ఎల్ ఈ పి సి లో సింధుజ పాల్గొంది. జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మానక్ పోటీల్లో బహుళార్థక పిచికారి పనిముట్లు అనే వ్యవసాయ ఉపయోగకరమైన ప్రాజెక్టును ప్రదర్శించింది. మర్కుక్ మండలం దామరకుంటకు చెందిన సింధుజ జాతీయ స్థాయి వేదికపై ప్రతిభ ప్రదర్శించడం పాఠశాలతో పాటు గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. సింధుజ మార్గదర్శకత్వం వహించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వై. చిన్నబ్రహ్మయ్యను కూడా పలువురు అభినందించారు. శుక్రవారం గ్రామస్థులు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు సింధుజను గైడ్ టీచర్ చిన్నబ్రహ్మయ్యను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ పత్తినర్సింలుయాదవ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింధుజకు శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్తులో మరిన్ని విద్యా వైజ్ఞానిక విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సింధుజను ప్రోత్సహిస్తూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి. రజిత చెరొక రూ.500 చొప్పున నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, గ్రామీణ విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం లభిస్తే వారు జాతీయ స్థాయిలో రాణించగలరని అన్నారు. సింధుజ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని వారు శాస్త్రీయ దృక్పథం సృజనాత్మకత సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ పత్తి నర్సింలు యాదవ్ మాట్లాడుతూ సింధుజ గ్రామానికి మండలానికి గర్వకారణమని ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహించడం మన బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఏ. వెంకటరాములు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బాలరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత, సర్పంచ్ పత్తి నర్సింలు, ఉప సర్పంచ్ దేవి విజయ రమేష్ వార్డ్ మెంబర్లు రాజబోయిన రమేష్ బక్కల సంజీవ గ్రామ అధ్యక్షులు రవి గౌడ్ ప్రతి శంకర్ పత్తి భాను యూత్ అధ్యక్షులు శ్యాం ప్రసాద్ గౌడ్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రతిభకు గుర్తింపు విద్యార్థుల భవిష్యత్తుకు స్ఫూర్తి! సింధుజ సాధించిన ఈ గుర్తింపు మరెంతో మంది విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలవాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

అటవీ శాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ములుగు జిల్లా అక్టోబర్23(మీడియా టుడే)



గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు.
శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ శాఖాధికారి వికాస్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాలలో సోలార్ లైట్ల ఏర్పాటు, బోర్ల తవ్వకం, రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ శాఖ అనుమతులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి అనుమతుల కోసం పూర్తి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లో పారిశ్రామిక ప్రమాదాలు

కార్మికుల ప్రాణాలకు భద్రతేది? పరిశ్రమల భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యమెందుకు ?

సిగాచి ఘటన మరువకముందే సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ.. ఇద్దరు కార్మికుల మృతి..

సిగాచి ఘటన నుండి గుణపాఠం నేర్చుకోవడంలో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం..మృతుల కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. ఒక్కో కుటుంబానికి రూ.70 లక్షల పరిహారం..అంత్యక్రియల కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయం..

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం..



పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, అక్టోబర్ 23 :

సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం తాలూకు విషాదం మరువకముందే.. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన పరిశ్రమల యాజమాన్యాలు.. పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరాక పరిశ్రమ గ్యాస్ లీకేజీ ఘటనలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు యాజమాన్యంతో చర్చించి 70 లక్షల రూపాయల నష్టపరిహారంతో పాటు అంత్యక్రియల కోసం లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఘటనలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత యాజమాన్యాన్ని ఆదేశించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలానికి వెళ్లిన ఎమ్మెల్యే జిఎంఆర్.. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశ్రమ యాజమాన్యంతో పాటు వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఘటన పైన పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటాన్చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక శాసనసభ్యుడిగా కుటుంబాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పారిశ్రామిక అభివృద్ధికి పటాన్ చెరు ప్రాంతం కీలక కేంద్రంగా ఎదుగుతున్నప్పటికీ.. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. పరిశ్రమల అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తి, లాభాల పెరుగుదల మాత్రమే కాదని.. అక్కడ పనిచేసే ప్రతి కార్మికుడి ప్రాణానికి భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా? ప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థలు పనిచేస్తున్నాయా ? గ్యాస్ లీకేజీలను నివారించే రక్షణ చర్యలు తీసుకుంటున్నారా ? అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు ఉన్నాయా ? అనే అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీకి దారితీసిన కారణాలను వెలికితీయాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. భద్రతా లోపాలు ఏమైనా ఉన్నట్లయితే వాటిని గుర్తించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సిగాచి ఘటన నుంచి తగిన గుణపాఠాలు నేర్చుకుని కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, వరుస పారిశ్రామిక ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని విమర్శించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్మికుల భద్రత విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

అటవీ సంరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులతో ఉద్గారాలను తగ్గించొచ్చు

ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న ఈడీఎఫ్ ముఖ్య సలహాదారు హిషామ్ ముండోల్



పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, అక్టోబర్ 23 :

అటవీ సంరక్షణ, సుస్థిర వ్యవసాయం, పునరుత్పాదక ఇంధన విస్తరణ, ఇంధన సామర్థ్యం మెరుగుదల పద్ధతుల ద్వారా భారతదేశ లక్ష్యమైన 2070 నాటికి నికర సున్నా ఉద్గారాలను సాధించగలమని పర్యావరణ రక్షణ నిధి (ఈడీఎఫ్)కి భారతదేశంలో ముఖ్య సలహాదారు హిషామ్ ముండోల్ ఆశాభావం వ్యక్తపరిచారు. గీతం, హైదరాబాదులోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కె.ఎస్.పి.పి)లో 'ఉమ్మడి సుస్థిర శ్రేయస్సుకు ఒక భారతీయ మార్గం' అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఉద్గారాలను తగ్గిస్తూ, అభివృద్ధి, పర్యావరణ లక్ష్యాలను సాధిస్తూనే భారతదేశం ఆర్థిక వృద్ధిని ఎలా వేగవంతం చేయగలదో ఆయన వివరించారు. తన విస్తృత అనుభవం ఆధారంగా, ముండోల్ సుస్థిర జీవనోపాధులు, వాతావరణ కార్యాచరణ, బాధ్యతాయుతమైన వ్యాపార పద్ధతులు, సమ్మిళిత ఆర్థిక వృద్ధిపై అంతర్దృష్టులను పంచుకున్నారు. సైన్స్, ఆర్థిక శాస్త్రం, వాతావరణ పరిష్కారాల కూడలిలో ఈడీఎఫ్ చేస్తున్న కృషిని విద్యార్థులకు తెలియజేశారు. మీథేన్ శాట్ ఉపగ్రహ మిషన్ తో సహా వినూత్న పర్యావరణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో ఈడీఎఫ్ పాత్రను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. 2070 నాటికి నిరక సున్నా ఉద్గారాల దిశగా భారతదేశ మార్గాన్ని నొక్కి చెబుతూ, పునరుత్పాదక ఇంధన నిల్వ సవాళ్లను పరిష్కరించడం, ఎరువుల వినియోగాన్ని మెరుగుపరచడం, మెరుగైన పశువుల దాణా పద్ధతుల ద్వారా మీథేన్ ఉద్గారాలను తగ్గించడం వంటి వాటి ఆవశ్యకతను ఆయన విశదీకరించారు. మధ్యప్రదేశ్ లోని ఇండోర్ ను ఉదహరిస్తూ, పర్యావరణ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం ప్రాముఖ్యతను కూడా ఆయన స్పష్టీకరించారు. ఇండోర్ లో, వ్యర్థాలను వాటి మూలం వద్దనే వేరు చేయడంలో పౌరులు గణనీయమైన పురోగతి సాధించారన్నారు. ఈ సందర్భంగా, వాతావరణ విధానం, సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పురోగతిని సాధించడంలో మార్కెట్లు, సాంకేతికత పాత్ర వంటి అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ముండోల్ సమాధానమిచ్చారు. వాతావరణ పరిష్కారాలు, మార్కెట్ ఆధారిత యంత్రాంగాలు, వాతావరణ సాంకేతికత ద్వారా సుస్థిర శ్రేయస్సుపై దృష్టి సారిస్తూ, భారతదేశంలో ఈడీఎఫ్ వ్యూహానికి ముండోల్ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన విశిష్ట వృత్తి జీవితంలో చిల్డ్రన్స్ ఇన్వెస్ట్ మెంట్ ఫండ్ ఫౌండేషన్, భారతదేశ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వికీమీడియా ఫౌండేషన్లలో నాయకత్వ పాత్రలను పోషించారు. భారతదేశానికి మరింత సుసంపన్నమైన, సమానమైన భవిష్యత్తును రూపొందించడంలో సహాయపడటానికి, ఆర్థిక వృద్ధి, పర్యావరణ సుస్థిరత, సమ్మిళిత ప్రజా విధానాలను ఏకీకృతం చేయడంపై ఈ ఉపన్యాసం విద్యార్థులకు విలువైన దృక్పథాలను అందించింది.

ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలి

జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలి

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఉపాధి పనుల విస్తరణకు చర్యలు తీసుకోవాలి

వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల మీడియా టుడే-అక్టోబర్ 23

జిల్లాలో వి బి జి.వి.రాం, ఉపాధి హామీ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం (xనూ), తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, జల సంరక్షణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న కాలంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలని సూచించారు. ప్రస్తుతం రోజువారీ సగటున 60 మందికి ఉపాధి కల్పిస్తున్న నేపథ్యంలో, ప్రతి గ్రామంలో సగటున 45 మంది కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకొని, ఆ సంఖ్యను స్థిరంగా కొనసాగించాలని ఆదేశించారు. కాలువల్లో పూడికతీత వంటి సామూహిక పనులను విస్తృతంగా చేపట్టాలని, పనుల షెల్ఫ్‌ను 200 శాతానికి పెంచాలని సూచించారు. సెప్టెంబర్ నెలకు నిర్దేశించిన మూడు లక్షల లక్ష్యంలో ఇప్పటివరకు రెండు లక్షల మేర పురోగతి సాధించినందున, మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

ఫార్మ్ పాండ్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

జిల్లాలో ఫార్మ్ పాండ్ల నిర్మాణానికి సంబంధించి 1,250 లక్ష్యానికి గాను 1,256 మంజూరు చేయగా, ఇప్పటివరకు 828 పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన పనులకు సంబంధించి మంజూరు, నిర్మాణ ప్రక్రియను సమన్వయంతో చేపట్టి రానున్న రెండు నెలల్లో లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.

జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే మ్యాజిక్ సోక్‌పిట్స్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్స్ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ పనులకు సంబంధించి సోమవారం లోగా మంజూరుల ప్రక్రియను పూర్తి చేయాలని, అక్టోబర్ 31 నాటికి మ్యాజిక్ సోక్‌పిట్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల సాధనలో ఎంపీవోలు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలకు సంబంధించి జిల్లాలో 177 లక్ష్యానికి గాను 118 పనులకు మంజూరు లభించిందని అధికారులు తెలిపారు. మిగిలిన పనుల పురోగతిని సమీక్షిస్తూ, తాగునీటి వనరుల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరులు వెంటనే పూర్తి చేయాలి

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం (xనూ) కింద మిగిలి ఉన్న 918 మంజూరులను డీఆర్‌డీఏ, హౌసింగ్ అధికారులు సమన్వయంతో వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అర్హులైన లబ్ధిదారులకు మరుగుదొడ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం లేకుండా చర్యలు

ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత నిర్మాణ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, మొత్తం 11,654 ఇళ్ల లక్ష్యానికి సంబంధించి 10,901 ఇళ్లకు ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో మిగిలి ఉన్న 860 ఇళ్ల మంజూరు ప్రక్రియను వెంటనే పూర్తి



చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రెండో విడతలో 4,953 కొత్త ఇళ్లు, 1,772 పైకప్పుల మార్పిడి పనులు కలిపి మొత్తం 6,725 ఇళ్లకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించాలని తెలిపారు. సంబంధిత శాసనసభ్యుల ప్రతిపాదనలు, గెజిటెడ్ అధికారుల ధ్రువీకరణ అనంతరం నిబంధనల ప్రకారం మంజూరు ఉత్తర్వులు జారీ చేసే ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఉపాధి కల్పన, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, జల సంరక్షణ, పారిశుద్ధ్యం, పేదలకు గృహ వసతి కల్పన వంటి అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా సాధించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, డిప్యూటీ సీఈఓ పి. నరేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, హౌసింగ్ పీడీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి , ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి- జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలి

వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి అక్టోబర్ 23

శుక్రవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి తో కలిసి రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన(ఎన్ సీ ఓ ఆర్ డీ) పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులతో పాటు అంతర్గత రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని సూచించారు. జాతీయ రహదారులపై అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, అండర్‌పాస్‌ల నిర్మాణ పురోగతిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొత్తకోట మదర్ థెరిసా జంక్షన్ వద్ద రహదారిపై ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారి నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులతో పాటు అంతర్గత రహదారులపై కూడా ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. పెద్దమందడి మండలం బలిజపల్లి క్రాస్‌రోడ్డు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి రాహత్ పథకం కింద గోల్డెన్ అవర్‌లో అందించే అత్యవసర వైద్య చికిత్సపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు సమన్వయంతో పనిచేయాలి

అనంతరం నిర్వహించిన మాదకద్రవ్యాల నిర్మూలన సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి, విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల కట్టడికి పోలీసుల ప్రత్యేక చర్యలు

జిల్లా ఎస్పీ డి. సునీతా రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ తరఫున అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జాతీయ రహదారుల అధికారులు, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. సివిల్ రైట్స్ డే సందర్భంగా, ఇతర సందర్భాల్లోనూ ప్రజలకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ తరఫున యాంటీ డ్రగ్ కమిటీలను బలోపేతం చేస్తూ విద్యార్థుల్లో పూర్తిస్థాయిలో చురుకుగా అవగాహన కార్యక్రమాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, డీఎస్పీలు బాలాజీ నాయక్, గిరిబాబు, డీఆర్వో రామ్ రెడ్డి, సుబ్రహ్మన్యం, ఈ డార్ మేనేజర్ మురళీకృష్ణ, ఆర్ అండ్ బీ అధికారులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి పనికి గడువు విధించి .. వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే , అక్టోబర్ 22

: శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రతి దానికి గడువు విధించాలని, నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీ టీఏడీఏ) ఆధ్వర్యంలో రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, అన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ప్రతి పనికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకొని..అధికారులకు సూచనలు చేశారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో దేవాదాయ శాఖ, మున్సిపల్, ఆర్ అండ్ బీ, ఎన్పీడీసీఎల్, రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి పని చేయాలని సూచించారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్మికుల సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. రాజన్న ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు చేపడుతున్న 80 ఫీట్ల రహదారి విస్తరణ పనులు గడువులోగా పూర్తి చేయాలని, విద్యుత్ టవర్లు తదితర పనులు చేపట్టాలని సూచించారు. గుడిచెరువు బండ్ పార్క్ లో టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ తదితర అంశాలపై వేములవాడ మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. పరిశీలనలో ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, ఎన్ పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస్, ఆలయ ఈఈ రాజేష్, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, వీ టీ ఏ డీ ఏ, పర్యాటక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

కేబుల్ చోరీ యత్నాన్ని అడ్డుకున్న సింగరేణి భద్రతా సిబ్బంది

- రూ.80 వేల విలువైన కేబుల్ కాపాడిన మణుగూరు ఓసీ స్పెషల్ టీం.



మణుగూరు,అక్టోబర్ 23(మీడియా టుడే):

మణుగూరు ఓసి ప్రాజెక్టులో కేబుల్ చోరీ యత్నాన్ని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో ఓసీ ఇంటెక్ వెల్ వద్దనున్న సబ్‌స్టేషన్ పరిసరాల్లో ఈ ఘటన జరిగింది.సుమారు రూ.80 వేల విలువైన, 35 మీటర్ల పొడవు గల ఆర్మర్డ్ కేబుల్‌ను దొంగిలించేందుకు గుర్తుతెలియని వ్యక్తులు యత్నించారని ఒప్త్రఅట్ జమేదార్ తెలిపారు.నైట్ షిఫ్టులో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ టీం అప్రమత్తంగా స్పందించడంతో భద్రతా సిబ్బందిని చూసి వారు పరారయ్యారన్నారు. ఈ ఘటనలో ఎవరూ పట్టుబడలేదని, కేబుల్ చోరీ కాకుండా సిబ్బంది కాపాడారన్నారు.ఈ ఘటనపై ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మాట్లాడుతూ...సంస్థ ఆస్తుల భద్రత విషయంలో రాజీ పడకుండా, ఏరియాలో దొంగతనాల నియంత్రణకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేస్తామని, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందితో సమన్వయాన్ని పెంచి సింగరేణి ఆస్తుల పరిరక్షణను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిని సన్మానించిన మాజీ వైస్ ఎంపీపీ



యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,అక్టోబర్ 23:రామన్నపేట,ప్రతినిధి

రామన్నపేట మండలంలో రిజిస్ట్రేషన్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షునిగా తెలుసూరి మల్లేష్ ఎన్నిక సందర్భంగా రామన్నపేట మాజీ వైస్ ఎంపీపీ బత్తుల ఉమా రమేష్ యాదవ్ తన మిత్ర బృందంతో కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది, ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, పబ్బు ధనుంజయ గౌడ్,గోగు మధు యాదవ్,గోగు సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి.

పట్టభద్రులకు పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు పిలుపు.

పర్వతగిరి,అక్టోబర్ 23,తెలుగు ప్రభ.



వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.2023 నవంబర్ నాటికి డిగ్రీ లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగిన డిప్లొమా పూర్తి చేసిన వారు ఫారం-18 ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సెప్టెంబర్ 28 నుంచి ప్రారంభమైన నమోదు ప్రక్రియకు నవంబర్ 6 చివరి తేదీగా పేర్కొన్నారు.కావాల్సిన పత్రాలు:ఓటరు గుర్తింపు కార్డు ఆధార్ కార్డుడిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్పాస్‌పోర్ట్ సైజు ఫొటోమొబైల్ నంబర్

అర్హతలు, నమోదు విధానం, అవసరమైన వివరాల కోసం తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ప్త్రజూం://ఎివశీవశ్రీఖఅస్త్రుఖు.అఙ.అఅ? ను సందర్శించాలని అనిల్ రావు సూచించారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు నిలవాలి

- బీఆర్ఎస్ నేత గుర్రపు మచ్చేందర్



నారాయణఖేడ్, అక్టోబర్ 23:

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత గుర్రపు మచ్చేందర్ అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు.శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని స్వర్ణకార సంఘం భవనంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుర్రపు మచ్చేందర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడంతోపాటు సంబంధిత అధికారుల దృష్టికి చేర్చి పరిష్కారానికి కృషి చేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రజల గొంతుకగా నిలుస్తున్న జర్నలిస్టుల సేవలను గుర్తించి వారిని గౌరవించడం అభినందనీయమన్నారు. ప్రజాసేవలో భాగంగా మీడియా మిత్రులకు అండగా నిలవాలనే సదుద్దేశంతో జీఎంఆర్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగేల మాణిక్ ప్రభు, నారాయణఖేడ్ అధ్యక్షుడు సంజీవ్ కుమార్, కార్య నిర్వహణ అధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి కైసర్, వెంకటేశం, జీవన్ పటేల్ , ఇబ్రహీంఖాన్లను,తెలంగాణ రాష్ట్ర మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుముల మారుతి, కంగ్టి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గంగారం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బసవరాజు పటేల్, నాయకులు తుకారాంతో పాటు పలువురు జర్నలిస్టులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా పొన్నం శ్రీనివాస్ నియామకం

పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్న పొన్నం శ్రీనివాస్

చిగురుమామిడి మండల రిపోర్టర్ : మీడియా టుడే , అక్టోబర్ 23 :



భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పొన్నం శ్రీనివాస్ నియమితులయ్యారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ఆశీస్సులతో,తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ కు పొన్నం శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నియామకానికి సహకరించి,ప్రోత్సాహం అందించిన సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకన్న,కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ప్రవీణ్ రావు, హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి,మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్శెట్టి సంపత్, బీజేపీ చిగురుమామిడి మండల అధ్యక్షులు పోలోజు సంతోష్‌లకు శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా పొన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా భావిస్తూ,జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ సూచనలు, మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని,పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు.పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసి,రాబోయే రోజుల్లో కాషాయ జెండా ఎగురవేయడమే తన లక్ష్యమని పొన్నం శ్రీనివాస్ స్పష్టం చేశారు.తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ,పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు.శ్రీనివాస్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

బ్యాంక్ రుణాలు వ్యాపారాభివృద్ధికి వినియోగించాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సంస్థాగత రుణాలపై వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులకు అవగాహన



సిరిసిల్ల మండల రిపోర్టర్ : మీడియా టుడే , అక్టోబర్ 23

బ్యాంక్ రుణాలు వ్యాపారాభివృద్ధికి వినియోగించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆద్వర్యంలో ఎంఎస్ఎంఈ సంవాద్ పేరిట సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ సంవాద్ కార్యక్రమం ద్వారా చేనేత, పవర్‌లూమ్ రంగాలకు చెందిన యజమానులు, ఆసాములు, కార్మికులకు సంస్థాగత రుణాలపై అవగాహన కల్పించడం, బ్యాంకింగ్ సేవలను వినియోగించుకునేలా ప్రోత్సహించడం, ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రక్రియలను జోడించడం ద్వారా ఆదాయం, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడానికి మార్గనిర్దేశం . ఆర్బీఐ ఎల్డీఓ శ్రీ చేతన్ సంస్థాగత రుణాల ప్రాధాన్యత, బ్యాంకుల ద్వారా లభించే రుణ సదుపాయాలు, ఆర్థిక క్రమశిక్షణ, రుణాల సక్రమ వినియోగంపై అవగాహన కల్పించారు. వీవర్లు వివిధ మార్గాల్లో రుణాలు తీసుకోవడం వల్ల ఎదురవుతున్న ఆర్థిక సమస్యలను వివరించి, అనధికారిక రుణాలపై ఆధారపడకుండా బ్యాంకులను సంప్రదించి, తమ అవసరాలకు అనుగుణంగా తగిన రుణ సదుపాయాలను పొందాలని సూచించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులు బ్యాంకుల ద్వారా సంస్థాగత రుణాలు పొందుతూ, వాటిని తమ వ్యాపారాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఆర్థికంగా ఎదిగి మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. చేనేత పవర్‌లూమ్‌ల ద్వారా ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మరింత నాణ్యమైన, ఆకర్షణీయమైన ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. దీంతో ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు, వీవర్లు, యూనిట్ యజమానులు అధిక ఆదాయం పొందేందుకు, ఉపాధి అవకాశాలను పెంపొందించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్ తో పోటీ పడాలని, ప్రభుత్వ ఆర్డర్లతో ప్రైవేట్ ఆర్డర్లు తయారు చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చేనేత వస్త్రాల తయారీ వైపు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు మార్పు చెందాలని, సిరిసిల్ల ఖ్యాతిని మరింత చాటాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్డీఓ చేతన్, నాబార్డ్ డీ డీ ఎం దిలీప్ చంద్ర, ఎల్ డీ ఎం రాజీవ్ కుమార్, ఇండస్ట్రీస్‌శీ జీఎం హనుమంతు, హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సంతోష్ కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, చేనేత, పవర్‌లూమ్ యూనిట్ యజమానులు, వీవర్లు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి ఆదుకోవాలి

మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

శేరిలింగంపల్లి మీడియా టుడే న్యూస్ అక్టోబర్ 23:



గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో రోడ్డు విస్తరణ కారణంగా జీవనోపాధి కోల్పోయే పరిస్థితిని ఎదుర్కొంటున్న చిరు వ్యాపారులకు తక్షణమే ప్రత్యామ్నాయ వ్యాపార స్థలాలు కేటాయించి ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్ ,గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అధికారులను కోరారుస్థానిక చిరు వ్యాపారులతో కలిసి అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రసీదను కలిసి వారి సమస్యలను వివరించి, వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణ పనులకు తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో ఎన్నో సంవత్సరాలుగా చిన్నచిన్న వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్న పేద కుటుంబాలు ఉపాధిని కోల్పోకుండా అధికారులు మానవతా దృక్పథంతో చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నానక్‌రామ్‌గూడలో పలువురు చిరు వ్యాపారులు పండ్లు, కూరగాయలు, టిఫిన్లు తదితర వస్తువులను విక్రయిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. వీరిలో అనేక కుటుంబాలు రోజువారీ ఆదాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రస్తుతం బడ్డీ దుకాణాలు, చిన్న వ్యాపార కేంద్రాల తొలగింపు నిర్ణయంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.పేదల పొట్ట కొట్టే అభివృద్ధి కాకుండా, అందరికీ ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి జరగాలని అన్నారు. రోడ్డు విస్తరణ పనులు సజావుగా సాగడంతో పాటు చిరు వ్యాపారుల కుటుంబాలు రోడ్డున పడకుండా ంచూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. బాధిత చిరు వ్యాపారులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివ సింగ్, సీనియర్ నాయకులు మీన్ లాల్ సింగ్, శేఖర్, బన్సీ లాల్ సింగ్, సోహన్ లాల్, మునావర్, కవిత భాయ్, మోహన్ లాల్, సంపత్, రాజ్ కుమార్, శ్రీను, రాజు, యాదయ్య, శ్రీశైలం,బీజేపీ నాయకులు, కార్యకర్తలు, నానక్‌రామ్‌గూడ వాసులు, బాధిత చిరు వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేర నియంత్రణ జరగాలంటే ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సీఐ మెరుగు రవి,ఎస్సై గోపాతి సతీష్

యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,అక్టోబర్ 23: రామన్నపేట, ప్రతినిధి



రామన్నపేట పట్టణ కేంద్రంలో సిఐ మెరుగు రవి,ఎస్సై గోపతి సతీష్,లు రామన్నపేట పట్టణ కేంద్రంలో సీసీ కెమెరాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐఎస్ఐ లు మాట్లాడుతూ,ప్రజల ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సమాజంలో నేర నియంత్రణ జరగాలంటే సీసీ కెమెరాలు ఏర్పాటు ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనగణన ఫేజ్--XXపై సమగ్ర శిక్షణ పూర్తి..

- కచ్చితమైన సమాచార సేకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి: సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



భద్రాచలం, అక్టోబర్ 23(మీడియా టుడే):

జిల్లాలో జనగణన ఫేజ్--×× నిర్వహణకు సంబంధించి ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జె. సునీత ఆధ్వర్యంలో, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అధ్యక్షతన ఈ శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. జనగణన వివరాల సేకరణలో కచ్చితత్వం పాటిస్తూ, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు సూచించారు. సమాచార నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు.శిక్షణలో భాగంగా సెన్సెస్ శాఖ రూపొందించిన 40 ప్రశ్నల ప్రశ్నావళి, సమాచార సేకరణ విధానం, వివరాల నమోదు, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హైదరాబాద్ సెన్సెస్ శాఖ మాస్టర్ ట్రైనర్లు రవీందర్ నాయక్, శివ శిక్షణ అందించారు.కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో డి. మధు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి అనూష, జిల్లా విద్యాశాఖ అధికారి శంభుప్రసాద్‌తో పాటు మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమం.



సిరిసిల్ల మండల రిపోర్టర్ : మీడియా టుడే , అక్టోబర్ 23

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థినీ, విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు

ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు.పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, శాఖ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని, పోలీస్ స్టేషన్ విధులు, ప్రజలకు అందించే సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల బాధ్యతలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని,పోలీస్ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై స్టాళ్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు వివరించిన విషయాలు.....

ప్రజలకు చేరువగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిర్వహించే డే, నైట్ బీట్స్, పెట్రోలింగ్ విధానాలతో పాటు, పోలీస్ స్టేషన్ పనితీరు, బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, బాధితులకు న్యాయం అందించేందుకు చేపట్టే చర్యల గురించి విద్యార్థులకు వివరించారు.నేరస్తులను గుర్తించేందుకు పోలీసీ శాఖ వినియోగిస్తున్న ఆధునిక సాంకేతక పరిజ్ఞానం, ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాల పనితీరును వివరించారు.నేరాల నివారణతో పాటు, జరిగిన నేరాలను త్వరగా ఛేదించడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేశారు.మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలు, వాటి విధుల గురించి వివరించారు.పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి, బ్లాక్ చేసి రికవరీ చేయడంలో సీఈఐఆర్ వ్యవస్థ వినియోగంపై వివరించారు.బాంబ్ స్క్వాడ్ బృందం విధులు, పేలుడు పదార్థాలను గుర్తించి నిర్వీర్యం చేసే విధానం, పోలీస్ జాగిలాల సేవలను వివరించారు.తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు.ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో , ఐటీ కోర్, భరోసా కేంద్రం, షీ టీమ్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ స్క్వాడ్ బృందం ,కమ్యూనికేషన్ విభాగాల సిబ్బంది పాల్గొని విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, సేవలు, ప్రజల రక్షణ కోసం చేపడుతున్న చర్యలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ గణేష్, అనిల్, రంజిత్, ఆర్.ఎస్.ఐ సాయి కిరణ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కొడకండ్ల విద్యార్థిని శాలిని ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన బాలిక



గజ్వేల్ అక్టోబర్ 23 మీడియా టూ దే

హ్యాండ్‌బాల్ క్రీడలో గజ్వేల్ మండలం కొడకండ్ల విద్యార్థిని శాలిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటింది. మహబూబ్‌నగర్‌లో ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీల్లో పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ కొడకండ్ల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కర్రె సత్తయ్య కుమార్తె కె. శాలిని తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికైంది.ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన కె.శాలినితో పాటు ఎనిమిదో తరగతి విద్యార్థినులు వై. అక్షయ, ఎం. సింధూజ తొమ్మిదో తరగతి విద్యార్థి టి. అజిత్ సాయి ఉమ్మడి మెదక్ జిల్లా తరపున పాల్గొన్నారు. వీరిలో శాలిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకుంది.ఈ సందర్భంగా కొడకండ్ల గ్రామ సర్పంచ్ ముంద్రాతి లక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మాధవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ పాల్ సింగ్, ఉపాధ్యాయ బృందం శాలినిని అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలతో పాటు గ్రామానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలి: ఎస్పీ రోహిత్ రాజు.

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 23(మీడియా టుడే):




జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ కరకగూడెం పోలీస్‌స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, ఆయుధాలు, స్టేషన్ ప్రాపర్టీ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించి, కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు.పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సకాలంలో నమోదు చేయాలని, సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి రవాణా, జూదం, పేకాట, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టి, శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అనంతరం ఏడూళ్ల బయ్యారం, మణుగూరు పోలీస్‌స్టేషన్లలో నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, నాగబాబు, ఎస్ఐ పి.వి.ఎన్. రావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పెడకంటి లోహిత్ కృష్ణకు గాయాలు

ఆస్పత్రికి వెళ్లి పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.

మీడియా టుడే/సత్తుపల్లి/ అక్టోబర్ 23.



ఖమ్మం పట్టణంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లూరుకు చెందిన పెడకంటి లోహిత్ కృష్ణ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు.కల్లూరు పట్టణానికి చెందిన న్యూ ప్రతాప్ ల్యాబ్ అధినేత, 18వ వార్డు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ కుమారుడైన లోహిత్ కృష్ణ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఆయన కుడికాలికి తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో ఖమ్మంలోని ఆరోగ్య ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిసింది.ప్రమాద విషయం తెలుసుకున్న సండ్ర వెంకట వీరయ్య ఆస్పత్రికి వెళ్లి పెడకంటి రామకృష్ణను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు, చికిత్స పొందుతున్న లోహిత్ కృష్ణ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగారు. మెరుగైన వైద్యం అందించాలని సూచిస్తూ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.లోహిత్ కృష్ణ త్వరలోనే కోలుకుంటారని వైద్యులు తెలిపినట్లు సమాచారం.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధత

వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం.



పర్వతగిరి అక్టోబర్ 23 మీడియా టుడే

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో మాలోతు శంకర్ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి, డీసీఓ కె. నీరజ ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, సంబంధిత శాఖల అధికారులు చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వీఏబీజీఆర్ఏఎంజీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- జిల్లాలో 410 ప్రమాదాలు.. 191 మంది మృతి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి: డీఆర్వో పద్మావతి



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 23 (మీడియా టుడే):

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి ఆదేశించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ఆమె సమీక్షించారు. జనవరి 1 నుంచి అక్టోబర్ 15 వరకు జిల్లాలో 410 ప్రమాదాలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. వీటిలో 179 ప్రాణాంతక ప్రమాదాలు కాగా, 231 ప్రాణాపాయం లేని ప్రమాదాలు ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో 191 మంది మృతిచెందగా, 26 మంది తీవ్రంగా, 383 మంది స్వల్పంగా గాయపడ్డారు. జాతీయ రహదారులపై అత్యధికంగా 177 ప్రమాదాలు జరిగి 75 మంది మృతిచెందినట్లు అధికారులు వివరించారు. గ్రామీణ రహదారులపై 71 ప్రమాదాల్లో 41 మంది, ఇతర జిల్లా రహదారులపై 66 ప్రమాదాల్లో 33 మంది, రాష్ట్ర రహదారులపై 54 ప్రమాదాల్లో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డీఆర్వో ఆదేశించారు.అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రమాద స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, డీఆర్ఎం జి. బాలాజీ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ వెంకన్న బాబు, వైద్యశాఖ అధికారులు, ఆర్‌అండ్‌బీ ఈఈ, ట్రాఫిక్ ఎస్ఐ, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ పుష్ప నగేష్ టీచర్లకు చీరల పంపిణీ




పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, అక్టోబర్ 23 :

రామచంద్రాపురం డివిజన్ రామచంద్రారెడ్డి నగర్ కాలనీ లో ఉన్న తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ నివాసంలో రామచంద్రాపురం డివిజన్ లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్ లకు దసరా పండుగ చిరుకానుకగా చీరల బహుమతులు ప్రదానం చేసి రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ దసరా శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బబ్లూ సింగ్

కేటీఆర్‌ను సన్మానించి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన -బబ్లూ సింగ్



మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 23

కాచిగూడ, తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను కాచిగూడ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బబ్లూ సింగ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తో ఆయన కేటీఆర్ ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు ఆయన దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగను పురస్కరించుకుని కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి తన అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం పార్టీ నాయకత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. పార్టీ అధిష్ఠానం మార్గదర్శకత్వంలో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని బబ్లూ సింగ్ పేర్కొన్నారు.

గజ్వేల్ అలాయ్ బలయ్ పోస్టర్ ఆవిష్కరణ



గజ్వేల్ అక్టోబర్ 23 మీడియా టుడే

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర గజ్వేల్ అలయ్ బలయ్ దసరా ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ జరిగింది గజ్వేల్ అలయ్ బలయ్ దసరా ఆత్మీయ సమ్మేళన విజయవంతం చేయాలని గజ్వేల్ అలయ్ బలయ్ కమిటీ పొన్నాల కుమార్. నీరుడి స్వామి. బాకీ స్వామి ముదిరాజ్. సంఘపు కన్న యాదవ్. కొడకండ్ల నర్సింలు. శుక్రవారం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 25 తేదీ ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు తూప్రాన్ రోడ్ లోని టి లక్ష్మణ్ గార్డెన్ లో అలయ్ బలయ్ నిర్వహించడం జరుగుతుందని పార్టీలకు అతీతంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజలందరూ పాల్గొనాలని, కోరారు, దసరా ఆత్మీయ సమ్మేళనం గజ్వేల్ లో మొదటిసారిగా నిర్వహించడం జరుగుతుందని, అందరూ సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు ఉద్యోగ సంఘాలు.అన్ని రాజకీయ పార్టీలు హాజరై పోస్టర్ ఆవిష్కరణ విజయవంతం చేశారు.

టీజీపీఎస్సీ, కాలుష్య నియంత్రణ మండలి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ, అదనపు కలెక్టర్.

-ఆన్‌లైన్ పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి.



మహబూబ్ నగర్.అక్టోబర్23(మీడియా టుడే ప్రతినిధి):-

మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-××) 2026న, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో, పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, ఫాతిమా విద్యాలయం పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్, అదనపు కలెక్టర్ హరిప్రియ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, కంప్యూటర్ వ్యవస్థలు, విద్యుత్ సరఫరా, సీసీటీవీ నిఘా, భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థుల ప్రవేశం, గుర్తింపు పత్రాల పరిశీలన తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షలు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. పరీక్షల విధులకు కేటాయించిన సిబ్బంది సమయానికి విధుల్లో హాజరై అప్రమత్తంగా ఉండాలి. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి. అమలులో ఉన్న నిబంధనలు, సంబంధిత అధికారుల ఉత్తర్వుల మేరకు పరీక్షా కేంద్రాల 200 మీటర్ల పరిధిలో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ కేంద్రాలు తదితర పరీక్షలకు ఆటంకం కలిగించే కార్యకలాపాలను నియంత్రించాలి. పరీక్షా కేంద్రాల వద్ద అనుమతి లేని వ్యక్తులు గుమిగూడకుండా చూడాలి. అభ్యర్థులు, పరీక్షా విధులకు నియమితులైన సిబ్బంది మినహా ఇతరుల ప్రవేశాన్ని నిబంధనల ప్రకారం నియంత్రించాలి. ఆన్‌లైన్ పరీక్షలకు అవసరమైన కంప్యూటర్లు, సర్వర్ కనెక్టివిటీ, ఇంటర్నెట్ కనెక్షన్, విద్యుత్ సరఫరా, బ్యాకప్ సదుపాయాలు సక్రమంగా పనిచేస్తున్నాయో ముందుగానే తనిఖీ చేయాలి. పరీక్ష ప్రారంభానికి ముందే అభ్యర్థుల హాల్‌టికెట్లు, గుర్తింపు పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అనుమతించిన సమయానికి పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించేలా చర్యలు తీసుకోవాలి. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, బ్లూటూత్ పరికరాలు తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించకూడదు. పరీక్ష నిర్వహణ సంస్థ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి. పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, ప్రవేశ ద్వారాల వద్ద తనిఖీలు, అభ్యర్థుల కదలికల పర్యవేక్షణ సక్రమంగా జరిగేలా చూడాలి. పరీక్షా నిర్వహణకు సంబంధించిన సమాచారం, అభ్యర్థుల వివరాల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.పరీక్ష సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే సంబంధిత పరీక్షా నిర్వహణ అధికారులకు సమాచారం అందించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలి. అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా, పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి.పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ మార్గదర్శకాలు, పరీక్షా నిర్వహణ సంస్థ నిబంధనలు, జిల్లా యంత్రాంగం జారీ చేసిన ఉత్తర్వులను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం



మహబూబ్ నగర్, అక్టోబర్23(మీడియా టుడే):

మహబూబ్ నగర్ జిల్లా పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్ నందు రక్తదాన శిబిరం నిర్వహించారు.మహబూబ్ నగర్ ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువతీ యువకులు ముందుకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకొని రక్తదానం చేయడం వలన ఎంతో మంది ప్రాణాలు కాపాడిన వారవుతారని తెలిపారు. అత్యవసర సమయంలో రక్తదానం చేయడం నేటి యువత అలవర్చుకోవాలి మన శరీరంలో ఉత్పత్తి అయ్యే రక్తకణాలు ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతాయి. కావున ఏలాంటి అపోహలు లేకుండా రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడిన వారు అవుతారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రూ.10 వేల విరాళం

తండా ఆధ్యాత్మిక అభివృద్ధికి మాధురి నరేష్ చేయూత.



పర్వతగిరి అక్టోబర్ 23 (తెలుగు ప్రభ): .

పర్వతగిరి మండలం, రోళ్లకల్ గ్రామపంచాయతీ పరిధిలోని చెరువు ముందు తండాలో నిర్మిస్తున్న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ దేవి మంగ్య నాయక్ కుమార్తె, అల్లుడు మాధురి నరేష్ రూ.10 వేల విరాళం అందించారు. తండా పెద్దమనుషుల సమక్షంలో ఆలయ నిర్మాణ పనులకు తమ వంతు ఆర్థిక సహకారం అందజేశారు.తండా ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి విరాళం అందించడం పట్ల తండా పెద్దలు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయాలు ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతోపాటు బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు తండా ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు.ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించిన మాధురి నరేష్‌ను తండా పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మంగ నాయక్, బిలు నాయక్, భూషయ్య, సురేందర్, అనిల్, లస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ

కొండా మురళీధర్ రావు పుట్టినరోజు సందర్భంగా పుస్తకాల పంపిణీ

శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు

సుమారు రూ.25 వేల రూపాయల విలువైన పుస్తకాల అందజేసిన శ్రీరాం రాజేష్



మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 23

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పుట్టినరోజును పురస్కరించుకొని శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు చదువులో ఉపయోగపడే ఆల్ ఇన్ వన్ పుస్తకాలను కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్ అందజేశారు. సుమారు 25 వేల రూపాయల విలువైన పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నవీన్ రాజ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాం రాజేష్ మాట్లాడుతూ మొదటగా మా నాయకుడు మురళీధర్ రావు కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. మా బాస్ పుట్టినరోజు సందర్భంగా ఏదైనా మంచి కార్యక్రమం చేయాలనుకున్నప్పుడు మా అన్న నవీన్ రాజు ఇచ్చిన సలహా మీద బుక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువులో అవసరమైన సహాయాన్ని అందించాలనే ఉద్దేశంతో పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ లక్ష్యంతో చదివి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్ర స్వామి,జిల్లా కాంగ్రెస్ నాయకులు రేణుకుంట్ల శివ కుమార్,బత్తుల నవీన్ కుమార్,బుక్కరాజు మాధవి,జావిద్, నాగరాజు,సంతోష్, భాస్కర్,రాంప్రసాద్ ,అపర్ణ,ప్రియదర్శిని,శ్రీలత,పాఠశాల ఉపాధ్యాయులు మరియు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లో పారిశ్రామిక ప్రమాదాలు

కార్మికుల ప్రాణాలకు భద్రతేది ?

పరిశ్రమల భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యమెందుకు ?


సిగాచి ఘటన మరువకముందే సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ.. ఇద్దరు కార్మికుల మృతి..

సిగాచి ఘటన నుండి గుణపాఠం నేర్చుకోవడంలో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం..

మృతుల కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. ఒక్కో కుటుంబానికి రూ.70 లక్షల పరిహారం..

అంత్యక్రియల కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయం..

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి



సంగారెడ్డి జిల్లా, మీడియా టుడే బ్యూరో, అక్టోబర్ 23.

సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం తాలూకు విషాదం మరువకముందే.. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన పరిశ్రమల యాజమాన్యాలు.. పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సరాక పరిశ్రమ గ్యాస్ లీకేజీ ఘటనలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు యాజమాన్యంతో చర్చించి 70 లక్షల రూపాయల నష్టపరిహారంతో పాటు అంత్యక్రియల కోసం లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఘటనలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత యాజమాన్యాన్ని ఆదేశించారు.సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలానికి వెళ్లిన ఎమ్మెల్యే జిఎంఆర్.. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశ్రమ యాజమాన్యంతో పాటు వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఘటన పైన పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటాన్చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక శాసనసభ్యుడిగా కుటుంబాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..పారిశ్రామిక అభివృద్ధికి పటాన్చెరు ప్రాంతం కీలక కేంద్రంగా ఎదుగుతున్నప్పటికీ.. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. పరిశ్రమల అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తి, లాభాల పెరుగుదల మాత్రమే కాదని.. అక్కడ పనిచేసే ప్రతి కార్మికుడి ప్రాణానికి భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా? ప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థలు పనిచేస్తున్నాయా? గ్యాస్ లీకేజీలను నివారించే రక్షణ చర్యలు తీసుకుంటున్నారా? అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు ఉన్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలి


సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీకి దారితీసిన కారణాలను వెలికితీయాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. భద్రతా లోపాలు ఏమైనా ఉన్నట్లయితే వాటిని గుర్తించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.సిగాచి ఘటన నుంచి తగిన గుణపాఠాలు నేర్చుకుని కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, వరుస పారిశ్రామిక ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని విమర్శించారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఎమ్మెల్యే జీఎంఆర్ హామీ ఇచ్చారు. కార్మికుల భద్రత విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

-మసీదులో సీపీ గౌష్ ఆలం ప్రత్యేక ప్రార్థనలు



కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , అక్టోబర్ 23 :

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా స్థానిక సవరన్ స్ట్రీట్ మసీదులో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.సమాజ రక్షణ కోసం, శాంతిభద్రతల పరిరక్షణలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు.అలాగే పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది క్షేమం, ప్రజా సంక్షేమం కోరుతూ ప్రత్యేక దువా నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ. సమాజ శాంతి కోసం అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీతో పాటు ఏసీపీలు యాదగిరిస్వామి, వెంకటస్వామి, విజయకుమార్, టౌన్ మరియు ట్రాఫిక్ సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మీడియా టుడే

శనివారం, అక్టోబర్ 24, 2026

కరీంనగర్ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

-కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్
మీడియా టుడే , అక్టోబర్ 23 :

కరీంనగర్ జిల్లా విద్యార్థులు, యువత భవిష్యత్తును మత్తు పదార్థాలు ఛిద్రం చేయకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాను డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిరంతర నిఘా, విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలతో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, వినియోగంపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన కేసులు, నిర్వహించిన తనిఖీలు, మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ సమీక్షించారు.


యువత భవిష్యత్తుకు మత్తు పదార్థాలు ముప్పు:
డ్రగ్స్‌కు అలవాటుపడితే ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా ఆలోచనా శక్తి క్షీణించి, వ్యక్తిగత జీవితం, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తు పదార్థాల ఆకర్షణకు లోనుకాకుండా విద్యాసంస్థల స్థాయి నుంచే నిరంతర అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి మాదకద్రవ్యాల దుష్పరిణామాలను వివరించాలన్నారు. విద్యార్థుల్లో చైతన్యం పెంచేందుకు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు సమావేశంలో వివరించారు.

సరఫరాదారులపై నిరంతర నిఘా:
డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులు, విక్రయదారులు, వినియోగదారులను గుర్తించేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యాసంస్థలు, మెడికల్ షాపులు, బస్టాండ్ల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి మత్తు పదార్థాలు చేరకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

చాక్లెట్ల రూపంలో గంజాయి.. అప్రమత్తంగా ఉండాలి:
సాధారణ చాక్లెట్ల ముసుగులో గంజాయి చాక్లెట్లను విక్రయించే ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద బీహార్ కార్మికులకు అందించేందుకు తీసుకొచ్చిన 168 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని వివరించారు. ఈ కేసు వివరాలను కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు తెలియజేశారు.
చాక్లెట్ల పేరుతో గంజాయి విక్రయించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. పిల్లలు, యువతకు తెలియకుండా ఇలాంటి మత్తు పదార్థాలు చేరే ప్రమాదం ఉన్నందున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాల విక్రయాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని అధికారులు కోరారు.

బాధితులకు చికిత్స, కౌన్సెలింగ్:
మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి, వారిని నేరస్థులుగా చూడకుండా అవసరమైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ అడిక్షన్ సెంటర్లు, పునరావాస కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించడంతో పాటు, ఇప్పటికే వాటికి బానిసైన వారు సాధారణ జీవనంలోకి తిరిగి వచ్చేలా సహకరించాలని సూచించారు. డ్రగ్స్ రహిత కరీంనగర్ లక్ష్యాన్ని సాధించేందుకు పోలీసు, ఎక్సైజ్, విద్యా, వైద్య ఆరోగ్యశాఖలతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేసి, మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసిన సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్



పాలడుగుల నాగరాజు, మీడియా టుడే, వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి మొదటి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన స్వగృహంలో ఎమ్మెల్యేను,యువనేత అవియుక్త్ రెడ్డిని చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్,సొసైటీ డైరెక్టర్లతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆవుల రాములు, ఇంద్రారెడ్డి,వట్టే తిరుపతిరెడ్డి, మహేందర్ రెడ్డి, చిప్ప లక్ష్మణ్, సీఈవో రవి, ఉపసర్పంచ్ కొర్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొగులపల్లి మండలంలో మాజీ గండ్ర పరామర్శ

భూపాలపల్లి/మొగుళ్ళపల్లి మీడియా టుడే అక్టోబర్ 23



మొగుళ్ళపల్లి మండల వాస్తవ్యులు కీ.శే గద్దే భూమయ్య మరణించగా నేడు వారి ఇంటికి వెళ్ళి,వారి చిత్ర పట్టం వద్ద నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అదే విదంగా బండారి రామస్వామి అనారోగ్య కారణం చేత వైద్య చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న వారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు.అనంతరం బంగ్లాపల్లి గ్రామ ఉప సర్పంచ్ మాతృమూర్తి కీ.శే గోనెలు ఓదెమ్మ మరణించగా వారి కుటుంబ సభ్యులనుపరామర్శించారు.అదే విధంగా ఎల్లారెడ్డిపల్లి గ్రామ వాస్తవ్యులు కీ.శే నల్ల కనకమ్మ మరణించగా నేడు వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారి వెంట బిఆర్ఎస్ పార్టీ మండల గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నీ నో ప్రభావం పై గ్రామ సభలు

యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,అక్టోబర్ 23:రామన్నపేట,ప్రతినిధి



రామన్నపేట మండలంలో శుక్రవారం రోజు సిరిపురం, వెల్లంకి,సర్నేనిగూడెం ల లో ఎల్నినో ప్రభావం పై, గ్రామ సభ లు నిర్వహించడం జరిగింది. ఆరుతడి పంటలు,నీటి పొదుపు,వి బి జి రామ్ జి, జలసిరి పనులు,ఇంకుడు గుంతలు,ఫారం పాండ్ పనులు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కే.రాఘవరెడ్డి,ఎంపీడీవో ఆవుల రాములు, తాసిల్దార్ లాల్ బహదూర్,ఏఈ లు అశిష్,రాఘవ,సందీప్,ఎం పి ఓ రఫీ,సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటును అర్హులైన ప్రతి ఒక్కరు ఓటుకు సద్వినియోగం చేసుకోండి

భూపాలపల్లి/గణపురం మీడియా టుడే అక్టోబర్ 23



గణపురం మండల గ్రాడ్యుయేట్ మిత్రులందరికీ విజ్ఞప్తి! ?త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరిన భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసింహారావు
ముఖ్య గమనిక:?గతంలో ఓటు వేసిన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ కూడా మళ్లీ కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది!ముఖ్యమైన తేదీలు:?ప్రక్రియ ప్రారంభం: 28 సెప్టెంబర్ 2026?చివరి తేదీ: 06 నవంబర్ 2026? అర్హత: 01 నవంబర్ 2023 కంటే ముందు డిగ్రీ/గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు అర్హులు.? బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచన:మన మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న గ్రాడ్యుయేట్‌లను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయించేలా శ్రద్ధ వహించాలి. మ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను ఓటర్లుగా చేర్పించే బాధ్యత మనందరిదీ!?ఓటు నమోదు సహాయం కోసం సంప్రదించండి:మీ గ్రామ బి ఎల్ ఓ లను గానీ, ఆన్‌లైన్‌లో గానీ లేదా నేరుగా నన్ను సంప్రదించగలరు. ఫోన్ నంబర్: 9618180666

హుస్నాబాద్ మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం

-హాజరైన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , అక్టోబర్ 23 :

ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన హుస్నాబాద్ మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం, పార్టీ నాయకులు మరియు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని సతీష్ కుమార్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామశాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, గౌరవ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఎలనినో ప్రభావం నేపథ్యంలో ప్రతి పౌరుడు నీటి వినియోగంలో జాగ్రత్తలు వహించాలి

హాలియా టౌన్, నల్లగొండ జిల్లా, నల్లగొండ జిల్లా బ్యూరో



తాజా తెలంగాణ భూగర్భ జల శాఖ నివేదికల ప్రకారం భూగర్భ జలాలు 8 నుండి 11 మీటర్లు కంటే తక్కువగా వున్నది.హాలియా మున్సిపల్ పట్టణంలోని వార్డులలో కొన్ని గృహములలోని గేట్ వాల్వ్ / నీటి సరఫరాను ఆన్--ఆఫ్ చేసే వ్యవస్థ లేకపోవడం వల్ల త్రాగునీరు వృధాగా మురుగు కాలువలలో కలవటం జరుగుతుంది. కావున గేట్ వాల్వ్ / ఆన్ - ఆఫ్ చేసే వ్యవస్థను నల్లా (ట్యాప్) కనెక్షన్‌కు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.నల్లా కనెక్షన్లకు గేట్ వాల్వ్ / ఆన్--ఆఫ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోని వారికి నిబంధనల ప్రకారం జరిమానా 5000/- రూపాయలు విధించబడుతుంది.ప్రజలు తమ గృహములలో భాధ్యతగా నీటి లీకేజీలను వెంటనే అరికట్టి, ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలి.అనవసరపు నీటి వృధాను తగ్గించి నీటి పొదుపులో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. నీటిని పొదుపు చేయండి భవిష్యత్తు తరాలకు నీటిని అందించండి.అని హాలియా మున్సిపల్ కమిషనర్ విలేకరుల సమావేశంలో వివరించడం జరిగినది

మొగిలిచర్లలో ఖేత్ బచావో అభియాన్

నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ పెట్టుబడి ఖర్చులు తగ్గించాలి

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ నిర్మల

పాలడుగుల నాగరాజు,మీడియా టుడే,వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఖేత్ బచావో అభియాన్లో భాగంగా గీసుకొండ మండలం మొగిలిచర్లలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు.సదస్సులో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయనిర్మల మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ పెట్టుబడి ఖర్చులు తగ్గించి, రైతులకు స్థిరమైన ఆదాయం అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని,పంట మార్పిడి, మల్చింగ్, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. నూనెగింజలు, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.వర్ధన్నపేట సహాయ వ్యవసాయ సంచాలకులు జి. నర్సింగం మాట్లాడుతూ విత్తనాలు,ఎరువులు,పురుగు మందులను అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేసి బిల్లులు తీసుకోవాలన్నారు. రైతులు ఫార్మర్ రిజిష్ట్రీ చేయించుకోవాలని,పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని సూచించారు.జాతీయ ఆహార భద్రత మిషన్ జిల్లా కన్సల్టెంట్ పి. సారంగం సమగ్ర పోషక నిర్వహణ, సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. నీటి సంరక్షణకు బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు.మొగిలిచర్ల సొసైటీ చైర్మన్ కొండేటి కొమురారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రైతులకు డ్రిప్ పరికరాలు, సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు జి. రాజేష్, బి. భరత్, సీఈవో కుమారస్వామి, సొసైటీ డైరెక్టర్లు, ఎరువుల డీలర్లు కిరణ్, మనోహర్, ఉమేష్, రైతులు పాల్గొన్నారు.

రైతులు ఆధునిక పద్ధతులతో పత్తి సాగు చేసుకోవాలి.. ఏవో సాయి శివ

అధిక సాంద్రత పద్ధతులు పత్తి సాగుతో అధిక దిగుబడులు



మీడియా టుడే ఎర్రుపాలెం:

అధిక సాంద్రత పద్ధతుల్లో పత్తి సాగు చేస్తే అధిక దిగు సాధించేందుకు దోహదపడతాయని ఎర్రుపాలెం మండలం వ్యవసాయ అధికారి సాయి శివ రైతులకు సూచించారు. మండల పరిధిలోని సఖున వీడు గ్రామంలో రాసి సీడ్స్ వారి ఆధ్వర్యంలో పరిసర గ్రామాల రైతులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి చావ రామకృష్ణ పలువురు గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ పొలంలో అధిక సాంద్రత పద్ధతులతో సాగుచేసిన రాసి సీడ్స్ పత్తి మంటను రైతులకు క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా చూపించారు. పత్తి సాగు చేసే రైతులు పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన యాజమాన్యం చర్యలను సరైన సమయములో చేపట్టాలని రైతులకు తెలియజేశారు. పత్తి పంటకు అవసరమైన ఎరువులు పంట దశకు అనుకూలంగా సమతుల్యంగా వినియోగించాలని, నీటి యాజమాన్యం పై ప్రత్యేక శ్రద్ధ ప్రవహించాలని చెప్పారు. పంటలో కలుపు మొక్కలు పెరగకుండా సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని పురుగులు ఉనికిని ప్రారంభం దశలో గుర్తించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. అధిక సాంద్రత పద్ధతులు పత్తి సాగు చేస్తున్న రైతులు మొక్కలు పెరుగుదల పూత మరియు కాయల అభివృద్ధిని నిశ్చితంగా గమనిస్తూ తగిన యాజమాన్య పద్ధతులను పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాసి సీడ్స్ కంపెనీ సిబ్బంది టెరిటరీ మేనేజర్ పవన్ కుమార్, బాలకోటిరెడ్డి ,బాలకృష్ణ, వీరితోపాటు కంపెనీ డీలర్లు, రైతులు పాల్గొన్నారు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి భరోసా.

రెగ్యులర్ జీతాల పెంపు, ప్రసూతి సెలవుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా.

నిర్మల్ అక్టోబర్ 23 మీడియా టుడే జిల్లా ప్రతినిధి



తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులకు అండగా ఉంటానని, వారి సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు.ముఖ్యంగా ఉద్యోగుల రెగ్యులర్ జీతాల పెంపు, ప్రసూతి సెలవులు తో పాటు వేరే డిమాండ్ల కల్పన వంటి ప్రధాన డిమాండ్లపై ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి తమ సమస్యలను అడిగి తెలుసుకొని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.జీతాల పెంపుతో పాటు ప్రసూతి సెలవుల విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కోరుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.

విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలి

విద్యార్థుల తో పోలీస్ ఓపెన్ హౌస్

రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నాగేశ్వర్ రావు

సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉపేంద్ర చారి

రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , అక్టోబర్ 23



విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలని, ఎవరైన అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలని సిరిసిల్ల రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నాగేశ్వర్ రావు అన్నారు. ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ లో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు భాగంగా విద్యార్థులతో కలిసి ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నాగేశ్వర్ రావు విద్యార్థులకు పోలీస్ స్టేషన్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం పోలీస్ రక్షణలో భాగంగా తుపాకీలు, మందు గుండు సామాగ్రి పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆన్ లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండి ,తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలన్నారు. ఈవ్ టీజింగ్ ను అరికట్టేందుకు ప్రత్యేకంగా షీ టీమ్స్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవల పై విద్యార్థులకు శాఖ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రపై విద్యార్థులక విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పోలీస్ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై స్టాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు .ప్రజలకు చేరువగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిర్వహించే డే, నైట్ బీట్స్, పెట్రోలింగ్ విధానాలతో పాటు, పోలీస్ స్టేషన్ పనితీరు, బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, బాధితులకు న్యాయం అందించేందుకు చేపట్టే చర్యల గురించి విద్యార్థులకు , సిఐ వివరించారు.నేరస్తులను గుర్తించేందుకు పొలిసీ శాఖ వినియోగిస్తున్న ఆధునిక సాంకేతక పరిజ్ఞానం, ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాల పనితీరును వివరించారు.నేరాల నివారణతో పాటు, జరిగిన నేరాలను త్వరగా ఛేదించడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేశారు.మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలు, వాటి విధుల గురించి వివరించారు. అనంతరం ఎస్ఐ ఉపేంద్ర చారి విద్యార్థులతో మాట్లాడుతూ పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి, బ్లాక్ చేసి రికవరీ చేయడంలో సీఈఐఆర్ వ్యవస్థ వినియోగంపై వివరించారు. బాంబ్ స్క్వాడ్ బృందం విధులు, పేలుడు పదార్థాలను గుర్తించి నిర్వీర్యం చేసే విధానం, పోలీస్ జాగిలాల సేవలను వివరించారు.తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ఏ ఎస్ ఫసియుద్దీన్ , తో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు

పల్లెర్లలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

ఆలేరు ఆర్సీ, అక్టోబరు23/మీడియా టుడే:



వ్యవసాయ భూముల సారవంతాన్ని కాపాడుతూ, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని వ్యవసాయ విస్తరణ అధికారి ముప్పిడి అశోక్ కుమార్ సూచించారు. శుక్రవారం పల్లెర్ల గ్రామ పంచాయతీలో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ భూముల పరిరక్షణ, నేల పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత, పంట మార్పిడి, నీటి సంరక్షణ, పంట అవశేషాల సమర్థ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని, పశువుల ఎరువు, కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులతో నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచుకోవాలని, పంట అవశేషాలను కాల్చకుండా ఉపయోగించాలని సూచించారు. భూగర్భజలాల లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని, నేల కోతను నివారిస్తూ పర్యావరణహిత సాగు పద్ధతులను అనుసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, ఏఈ మెహర్ సాయి, వెటర్నరీ డాక్టర్ గిరి, ఏపీవో రమేష్, హెచ్ఈవో శ్రీనివాసులు, పల్లెర్ల సర్పంచ్ తండ మంజుల, లింగరాజుపల్లి సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి, రాఘవాపురం సర్పంచ్ ఎరుకల యతీశ్వర్, పంచాయతీ కార్యదర్శులు బాలరాజు, వి. శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, రైతులు నర్సింహా గౌడ్, సుదర్శన్, రామలక్ష్మయ్య, యాదిరెడ్డి, మల్లేష్, మచ్చగిరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మైలార్ గూడెం గ్రామంలో పిఏసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఆలేరు ఆర్సీ, అక్టోబరు23/మీడియా టుడే:



యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మైలార్ గూడెం గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ధాన్యం విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

ఆలేరు ఆర్సీ, అక్టోబరు23/మీడియా టుడే:



యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పట్టభద్రులను కలిసి అభ్యర్థికి మద్దతు కోరాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తూ ప్రచార కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

గుండాల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

ఆలేరు ఆర్సీ,

అక్టోబరు23/మీడియా టుడే:



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేయాలని, పట్టభద్రులను కలిసి అభ్యర్థికి మద్దతు కోరాలని సూచించారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి ప్రచార కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.గుండాల మండలం అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేసిన ముగ్గు పోసిన బీర్ల అయిలయ్య.సుద్దాల గ్రామంలో బండ శ్రీశైలం అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి శ్రీశైలం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన బీర్ల ఐలయ్య.

ఎలినినో ప్రభావం -- గ్రామసభల నిర్వహణ

ఆలేరు ఆర్సీ, అక్టోబరు23/మీడియా టుడే:



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని లింగరాజు పల్లి, పల్లెర్ల, రాఘవాపురం గ్రామాల్లో ఎలినినో ప్రభావం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సాగునీరు, తాగునీటి, విద్యుత్ సమస్యలను, అధిగమించడంతో పాటు, గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామసభలు నిర్వహించడం జరిగింది.ఈ గ్రామసభల్లో నీటి వనరుల సంరక్షణ, నీటి కొరత నివారణ, ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు పని కల్పించడం వంటి అంశాలపై గ్రామస్తులతో చర్చించి, అవసరమైన చర్యలపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జె రాములు నాయక్,అన్ని గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీవో నారగోని శ్యామ్ కుమార్ గౌడ్,ఏఈ మెహర్ సాయి,ఏపీఓ బొడిగే రమేష్ గౌడ్,వివిధ శాఖల అధికారులు,గ్రామ పంచాయతీ కార్యదర్శులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

కొలనుపాకలో ఘనంగా ప్రార్థనా దినం

ఆలేరు ఆర్సీ,అక్టోబరు23/మీడియా టుడే:



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో మల్లికార్జున ఫంక్షన్ హాల్లో ఆధ్యాత్మిక వాతావరణంలో కొలనుపాక ప్రార్థనా దినం. రీటా శామ్యూల్ యానిస్ కుటుంబం నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ యానిస్ మాట్లాడుతూదేశం, రాష్ట్రం, గ్రామ ప్రజల శాంతి,సౌభాగ్యం,గ్రామాభివృద్ధి, ప్రజల ఐక్యత కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశామని ఆయన అన్నారు. దేశంలో మంచి పాలన కొనసాగాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రకృతి వైపరీత్యాలు, కరువు, తీవ్రమైన ఎండలు, నీటి కొరత వంటి సమస్యల నుంచి ప్రజలకు రక్షణ కలగాలని ప్రార్థించారు.అలాగే కొలనుపాక గ్రామ ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబంలో శాంతి నెలకొనాలని, కష్టాల్లో ఉన్నవారికి ధైర్యం కలగాలని, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి స్వస్థత చేకూరాలని ప్రార్థనలు చేశారు. ముఖ్య అతిథులను శాలువా, మెమెంటోతో, ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె. సోమిరెడ్డి, పాస్టర్లు ,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగులకు అన్యాయం జరుగకుండా చూడాలని కలెక్టర్ కి వినతిపత్రం అందచేత


యాదగిరిగుట్ట దేవస్థానంలో -దళిత వర్గాల ఉద్యోగులకు ప్రమోషన్లు తక్షణమే ఇవ్వాలి

దళిత వర్గాల ప్రయోజనాలు ఇతర వర్గాలు పొందకుండా చూడాలి

ఎమ్మార్పియస్ ఆలేరు నియోజకవర్గం ఇంచార్జీ, ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్రస్వామి మాదిగ

ఆలేరు ఆర్సీ,

అక్టోబరు23/మీడియా టుడే:



యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో నెలకొన్న ప్రాముఖ్యత గల దేవస్థానం అయిన శ్రీలక్ష్మీ నర్సింహ్మ స్వామి వారి దేవస్థానంలో గత కొన్ని నెలలుగా దళిత వర్గాల ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు ఇవ్వడం లేదని, ఇతర సామాజిక వర్గాలకు సంబంధించిన ప్రమోషన్ల ఆర్డర్లు మాత్రం ఇస్తున్నారని, కొందరు బీసీ కేటగిరి క్రింద ఉద్యోగంలో చేరి నేడు ఎస్సీ కేటగిరి క్రింద ప్రయోజనం పొందడం కోసం అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నా సమాచారం దృష్టికి వచ్చిన మేరకు ఈ అంశాల పై సమగ్ర విచారణ జరిపి నిజమైన అర్హతగల దళిత వర్గాల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇప్పించాలని కోరుతు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని దళిత సంఘాల ప్రతినిధులు కలసి విజ్ఞప్తి చేయడం జరిగింది.అనంతరం మాట్లాడుతూ యాదగిరిగుట్ట దేవస్థానంలో దళిత వర్గాల ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని కొందరు బీసీ ఉద్యోగుల క్రింద ఉద్యోగం లో చేరి ఎస్సీ కోట క్రింద ప్రయోజనాలు పొందే విధంగా మోసపూరిత విధానాలకు పాల్పడుతున్నారని మా దృష్టికి వచ్చిందని తక్షణమే ఈ అంశాలపై ఉన్నత అధికారులు సమగ్ర విచారణ చేసి దళితవర్గ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరడం జరిగింది. మా దళిత వర్గాలను అన్యాయంకు గురిచేయాలని చూసే పక్షంలో ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకి ఈ అంశాలు తీసుకువెళ్లి న్యాయం చేసేదాకా ప్రత్యక్ష ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ ఆలేరు నియోజకవర్గం ఇంచార్జీ ఎంఎస్పీ మాజీ జిల్లాఅధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు బీబీనగరం లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షులు పూలేపాక విజయ్ మాదిగ,తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం



ఆలేరు ఆర్సీ, అక్టోబరు23/మీడియా టుడే:

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శుక్రవారం రోజు మండల కేంద్రంలో నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సన్నాహక సమావేశంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సమావేశంను ఉద్దేశించి వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అనంత రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, నాయకులు సిద్దయ్య గౌడ్, హనుమంత్ గౌడ్, జన్నాయికోడే నగేష్, దోంతరబోయిన భాస్కర్, పోతగాని మల్లేశం, కోరే మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



ఆలేరు ఆర్సీ, అక్టోబరు23/మీడియా టుడే:

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని సిద్ధేశ్వర పత్తి మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులకు పత్తి విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు పండించిన పత్తికి మద్దతు ధర లభించేలా, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించేలా చూడాలని తెలిపారు.

నాగార్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి గారి ఆదేశానుసారం

త్రిపురారం మండలశీ, నల్లగొండ జిల్లా, నల్లగొండ జిల్లా బ్యూరో



నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఓటర్ నమోదు అవగాహనా,కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల శాసన మండలి అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారిని గెలిపించుటకు ఈ రోజు 23-10-2026 న పెద్ద దేవులపల్లి పల్లి గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అలంపల్లి జానయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ధనవత్ భాస్కర్ నాయక్, మాజీ మండల అధ్యక్షులు ముడిమల్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ సలహాదారుడు అనుముల శ్రీనివాస్ రెడ్డి,xమీఖజ జిల్లా అధ్యక్షులు అంబటి సోమయ్య,గొపగాని శ్రీనివాస్,బిట్టురవి,బహునూతల, నరేందర్, అనుముల అనంతరెడ్డి,అంబటి రాము, గుండెబోయిన నాగేష్, నాయిని సంతోష్, చందానబోయిన గణేష్, వార్డు మెంబర్లు కందుకూరి భరత్, చందానబోయిన సోమయ్య, చందనబోయిన దుర్గయ్య, సింగం మురళి, అంబటి భూషయ్య, గుండెబోయిన రామయ్య, శ్రీకాంత్, శంకర్,మహేష్, శరత్, అంతయ్య, మల్లయ్య, ఉపేందర్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కాపాడిన పర్వతగిరి పోలీసులు

112కు వచ్చిన సమాచారంతో స్పందించి వ్యక్తి ఆచూకీ గుర్తింపు.

పర్వతగిరి, అక్టోబర్ 23, మీడియా టుడే



వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పర్వతగిరి పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన మహమ్మద్ భాష వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు 112కు సమాచారం అందింది.దీంతో వెంటనే స్పందించిన బ్లూ కోల్ట్స్ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది శ్రావణ్, సుందర్ నూతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో అతని ఆచూకీని గుర్తించి, సురక్షితంగా అతని కుమారుడికి అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు మహమ్మద్ భాషకు ధైర్యం చెప్పి, ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు ఆత్మస్థైర్యంతో వాటిని అధిగమించాలని, అవసరమైతే కుటుంబ సభ్యులు, సన్నిహితుల సహాయం తీసుకోవాలని తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా బోధన సాగాలి

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి



సూర్యాపేట, అక్టోబర్ 23. మీడియా టుడే:

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, రాబోయే ఇంటర్మీడియట్ పరీక్షల్లో గత ఏడాది కంటే మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సులోచన రాణి సూచించారు. శుక్రవారం అకాడమిక్ తనిఖీలో భాగంగా సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్య అధ్యక్షతన కళాశాలను సందర్శించి, కళాశాలలో విద్యా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. హాజరు నమోదును పకడ్బందీగా నిర్వహించడంతో పాటు, అధ్యాపకుల బోధనా ప్రణాళికలు, రోజువారీ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. గత ఏడాది విద్యా ఫలితాలను సమీక్షించి, ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల అభ్యసన ప్రగతిపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. పాఠ్యాంశాల పునశ్చరణ, నమూనా ప్రశ్నపత్రాల సాధనకు తగిన సమయం కేటాయించి, విద్యార్థులు పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. కళాశాల ప్రయోగశాలలను క్రమం తప్పకుండా పర్యవేక్షించి, విద్యార్థులకు ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని అందించాలని తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు సిద్ధాంత బోధనతో పాటు ప్రాయోగిక శిక్షణను సమర్థవంతంగా అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని సులోచన రాణి అన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారిలో అభ్యసన ఆసక్తిని పెంపొందిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యా ప్రమాణాల పెంపు, ఉత్తీర్ణత మెరుగుదల లక్ష్యంగా అధ్యాపకులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కలిసికట్టుగా పోరాడుదాం

డంపింగ్ యార్డ్ తరలిద్దాం

జవహర్ నగర్ డంప్ యార్డ్ ఎత్తి వేసే వరకు ఉద్యమం ఆగదు

నా పుట్టుకే ప్రజా సమస్యల పోరాటానికై రాజీపడే ప్రసక్తే లేదు"

ప్రజా సమస్యలపై భాజపా నిరంతర కృషి

బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం...

రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి విజయం సాధిస్తాం...

డంప్ యార్డ్ ఎత్తివేతపై ఈనెల 27 నుండి పాదయాత్ర...

మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్..

మీడియా టుడే/ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా: జహర్ నగర్ అక్టోబర్ 23

ప్రజలకు శాపంగా మారిన జవహర్ నగర్ డంప్ యార్డును తరలించే వరకురాజీపడే ప్రసక్తే లేదని.. నా పుట్టుకే పోరాటామని డంప్ యార్డ్ ఎత్తివేసే వరకు పోరాట ఆగదని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేసి రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచైనా విజయం సాధించడానికి ఈనెల 27 నుండి బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించడం కోసం శుక్రవారం దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని సాయి భవాని ఫంక్షన్ హాల్ లో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన డంప్ యార్డు ఎత్తివేత ఉద్యమ కార్యచరణ, పాదయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి ఎమ్మెల్యే నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. డంప్ యార్డ్ ఏర్పాటు కాకముందు చెరువులు, కుంటలు జలకలతో సంచరించి పచ్చని పైర్లు, పక్షుల కిలకిల తో కళకళలాడుతుండేదని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో బతుకుదెరువు కోసం కన్న గడ్డను, కనీపెంచిన తల్లిదండ్రులను వదిలి ఈ ప్రాంతానికి వచ్చి బ్రతుకుతున్నారని తెలిపారు. కొన్నేళ్ల తర్వాత ఈ డంప్ యార్డును ఏర్పాటు చేయడంతో బతుకుదెరువు కోసం వచ్చిన ఆశలు అడియాశలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 30 కిలోమీటర్ల మేరకు పరిసర ప్రాంత పరిధిలోని చెరువు, కుంటలు డంపు యార్డు నుండి వదిలే కాలుష్యం నీరుతో కాలుష్యమై, భూగర్భ జలాలు కాలుష్యం వల్ల వేలాది ఎకరాలు సాగుకు నోచుకోవడం లేదని, కలుషిత నీటితో దాదాపు 50 లక్షల మంది ప్రజలను ప్రభావితం చేసి రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. దుర్వాసనతో పలు రోగాలతో బాధపడుతున్నారని అన్నారు. క్యాన్సర్, గర్భస్రావాలు, శ్వాస కోస, చర్మవ్యాధులతో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న కుక్కలు సైతం దుర్వాసనను తట్టుకోలేక మనుషులను సైతం పీక్క తింటున్నాయని గుర్తు చేశారు. ఈ డంప్ యార్డును నిర్వహిస్తున్న రామ్ కీ సంస్థ అధినేతలు ఈ డంపు యార్డు సిఎస్ఆర్ నిధులను బాధిత గ్రామాలకు తాగునీరు, బాధితులకు వైద్య సదుపాయాలు అందించకుండా ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ పరిశ్రమకు హైదరాబాద్ మహానగరం నుండి వేలాది చెత్త లారీలు వస్తున్నాయని ఎక్కడికక్కడ వాటిని అడ్డగించినట్లయితే ప్రభుత్వం దిగి వస్తుందని బాధితులకు పిలుపునిచ్చారు. ఇంటికొక వ్యక్తి ఈ పాదయాత్ర లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రాంతం నుండి ఎంపీగా పోటీ చేసే సమయంలో డంపింగ్ తొలగించే వరకు పోరాటం చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీతో ఎంపీగా గెలిపించి రాజకీయ బిక్ష పెట్టారని ఈటల పేర్కొన్నారు. ఏ ఒక్కనాడు దానిపై పెదవి విరపలేదని, రామ్ కీ సంస్థకు వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. ప్రస్తుతం సీఎం హోదాలో ఉండి సైతం డంప్ యార్డ్ పై నిర్ణయం తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రాణాలు పోతున్నా డంపు యార్డ్ బాధితులను కాపాడలేని సీఎం బంజారాహిల్స్ లో పెద్దల పై ఉన్న ప్రేమ పేదలపై కనికరం లేదని మండిపడ్డారు.కాంగ్రెస్ హైడ్రా పేరిట పేదల ఇళ్లను కూల్చివేసి, సామాన్యులను డ్రోజర్లతో తొక్కించారని ఆరోపించారు. తాము చేసిన పోరాటాల వల్లే ఆ కూల్చివేతలు కొంతమేర ఆగాయని చెప్పారు. మూసీలో కొబ్బరి నీళ్లలాంటి నీళ్లు పారిస్తే తమకేం అభ్యంతరం లేదని, దానికోసం పేదల ఇళ్లను కూల్చవద్దని అక్కడే పడుకుని అడ్డుకున్నామని గుర్తుచేశారు. 22ఏ తెచ్చి పాత అపార్ట్మెంట్లు నిషేధిత జాబితాలో పెట్టినప్పుడు బిజెపి అసెంబ్లీ బయట, లోపల పోరాటం చేసిందన్నారు.

కేంద్రానికి నివేదించడంలో రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుంది....

శాసన సభా పక్ష నేత ఏలేటి మహేందర్ రెడ్డి...

డంప్ యార్డ్ ఎత్తివేత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పరిస్థితులను కేంద్రానికి నివేదికలు ఇవ్వడంలో మోసం చేస్తుందని శాసనసభ పక్ష నేత ఏలేటి మహేందర్ రెడ్డి తెలిపారు. రోజుకు పదివేల మెట్రిక్ టన్నుల చెత్తను చేర్చడంతో ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. రాజ్యాంగం పుస్తకం పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ రాజ్యాంగంలో పొందుపరిచిన ఇలాంటి సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డికి హితబోధ చేస్తలేరా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ఉన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి జోకర్ మాటలు మాట్లాడుతూ.. రామ్ కీ సంస్థ యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మరి కొంతమంది మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆ సంస్థ యాజమాన్యానికి బ్రోకర్లు గా తయారయ్యారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వీరిని తరిమికొట్టాలని బాధిత ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, మల్లారెడ్డి, ఎస్టి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, రంగా రెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా నాయకులు సుదర్శన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ గండే, యం బి సి మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ రూరల్ మేడ్చల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సామ రంగా రెడ్డి, మాజీ మున్సిపల్ ఫైర్మెన్ చంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ కే శ్రీనివాస్, మాణిక్ రెడ్డి, తిర్మల్ రెడ్డి, తిరుపతి యాదవ్, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, ఎల్లంపేట్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దేవేందర్, జిల్లా జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, గాలి సంపత్ యాదవ్, బుధవరం లక్ష్మి వేణుగోపాల్, శామీర్పేట్ మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్, జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ బాబు, జవహర్ నగర్ మాజీ ఎంపిటీసి రషీదా బేగం, కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయ్ ఆనంద్, అధిక సంఖ్య లో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలేరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందేలా చర్యలు -సర్పంచ్ బిల్లా యాదగిరి



పాలడుగుల నాగరాజు,మీడియా టుడే,వేలేరు

మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు మేజర్ గ్రామపంచాయతీకి మంజూరైన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయి సర్వేను సర్పంచ్ బిల్లా యాదగిరి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులకు త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు నిర్ణీత సమయంలోగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రత్యేక అధికారి రూపవతి, హౌసింగ్ ఏఈ అభిలాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డెంటల్ సీటు సాధించిన విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే గండ్ర శుభాకాంక్షలు



భూపాలపల్లి/ రేగొండ మీడియా టుడే అక్టోబర్ 23

రేగొండ మండలం, రామన్నగూడ తండాకు చెందిన బదావత్ గోపీచంద్‌కు నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో డెంటల్ విభాగంలో సీటు లభించడంతో, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి శాలువాతో సన్మానించి,ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదివి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత



రాయికల్-మీడియా టుడే-అక్టోబర్ 23:


రాయికల్ మండలం తాట్లవాయి గ్రామంలో నిర్వహించిన టీపీఎల్ సీజన్--3 విజేతలకు శుక్రవారం మాజీ జడ్పీటీసీ జాదవ్ అశ్విని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాలతో స్నేహభావం పెంపొందుతుందని... పోటీలలో గెలుపు ఓటములు సహజమని అన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలి

రాయికల్-మీడియా టుడే-అక్టోబర్ 23:

సౌదీ అరేబియా నుంచి స్వదేశానికి తిరిగి వస్తున్న తెలంగాణ గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని తెలుగు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. సౌదీ అరేబియా నుంచి వివిధ కారణాలతో శాశ్వతంగా స్వదేశానికి తిరిగి వస్తున్న తెలంగాణ యువకులు, గల్ఫ్ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలవాలని, వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని...గల్ఫ్ దేశాల్లో కష్టపడి పనిచేస్తూ తమ సంపాదనలో కొంత భాగాన్ని రెమిటెన్స్ రూపంలో భారతదేశానికి పంపిస్తూ, తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడిన గల్ఫ్ సోదరులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని...స్వదేశానికి తిరిగి వచ్చిన కార్మికులకు వారి అనుభవం, అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



రాయికల్-మీడియా టుడే-అక్టోబర్ 23:

రాయికల్ పట్టణంలోని 10వ వార్డులో శుక్రవారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. వీధిలో ఇప్పటివరకు విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా మూడు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. నాయకులు మచ్చ శేఖర్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇన్‌చార్జిల నియామకం





రాయికల్-మీడియా టుడే-అక్టోబర్ 23:

రాయికల్ పట్టణ, గ్రామీణ బీజేపీ ఇన్‌చార్జిలను శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు ప్రకటించారు. పట్టణ ఇన్‌చార్జిగా వేముల శ్రీనివాస్‌ను, గ్రామీణ ఇన్‌చార్జిగా కల్లెడ ధర్మపురిని నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా...బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాల విస్తరణకు....పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

గ్రామీణ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా : కుబీర్ మండలం: మీడియా టుడే అక్టోబర్ 23, 2026

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటికి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు.శుక్రవారం సాయంత్రం కుభీర్ మండలంలోని పార్డి (బి), హల్దా గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి స్థానిక ప్రజలు, రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.ముందుగా పార్డి (బి) గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామ సమస్యలను పరిష్కరించాలన్నారు.అనంతరం హల్దా గ్రామంలో రైతులతో సమావేశమైన కలెక్టర్, గ్రామంలో నెలకొన్న సీలింగ్ భూములకు సంబంధించిన సమస్యలపై ఆరా తీశారు. భూములకు సంబంధించిన వివరాలను అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. సీలింగ్ భూముల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రైతులకు వివరించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ శ్రీదేవి, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికుల పాలిట ఆత్మీయుడిగా దేవానంద్!

పండుగ వేళ కుటుంబ సభ్యులతో కలిసి నూతన వస్త్రాల పంపిణీ

కార్మికులను సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరించిన మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్



అమీన్‌పూర్, అక్టోబర్ 23 (మీడియా టుడే):

ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిత్యం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల ఇళ్లల్లో దసరా పండుగ ఆనందాలు నింపేందుకు మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్ ముందుకొచ్చారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్ గూడలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకొని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి నూతన వస్త్రాలను అందజేసి ఆత్మీయతను చాటుకున్నారు. సమాజ పరిశుభ్రత కోసం అహర్నిశలు శ్రమించే కార్మికుల కష్టాన్ని గుర్తించి పండుగ వేళ వారిని సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరించారు. ఈ సందర్భంగా ఈర్ల దేవానంద్ మాట్లాడుతూ ఎండనక, వాననక ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి పాత్ర ఎంతో కీలకమని, అలాంటి శ్రమజీవులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ప్రజల కోసం చెమటోడ్చే కార్మికుల కుటుంబాల్లో పండుగ ఆనందాలు వెల్లివిరియాలనే ఉద్దేశంతో నూతన వస్త్రాలు అందజేసినట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఈర్ల దేవానంద్ పేర్కొన్నారు.

వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

అమర పోలీసు వీరుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకం-

వేములవాడ రూరల్ ఎస్ ఐ ప్రశాంత్ రెడ్డి




వేములవాడ మండలం రిపోర్టర్: మీడియా టుడే , అక్టోబర్ 23

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) కార్యక్రమాల్లో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించిన వేములవాడ రూరల్ ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి. చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసు చట్టాల గురించి, సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాల గురించి, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి మరియు సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ ఎస్ ఐ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాల గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు మరియు ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని మరియు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉత్సహకంగా పాల్గొన్నారు. గంజాయి,డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, డయల్ 112, సైబర్ నేరం జరగగానే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ల గురించి కూడా అవగాహన కల్పించారు జరిగింది. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ మండల విద్యాధికారి కిషన్, ఉపాధ్యాయులు, వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఏ ఎస్ ఐ రవీందర్ రెడ్డి, బాపు రెడ్డి హెడ్ కానిస్టేబుల్, రిసెప్షన్ కానిస్టేబుల్ రేఖా, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ రాజశేఖర్, మనోహర్, దేవరాజు అసిస్టెంట్ రైటర్ లహరి ప్రియా తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

-మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షలు

-జిల్లా విద్యాధికారి విజయకుమారి



మహబూబ్ నగర్, అక్టోబర్ 23(మీడియా టుడే ప్రతినిధి):-

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి - 2027 సంవత్సరమునకు సంబంధించి విద్యార్థుల పరీక్ష రుసుము చెల్లింపు తేదీలు వాటి వివరములు ఈ దిగువ చూపైనది.పరీక్ష ఫీజు వివరాలు:1. రెగ్యులర్ విద్యార్థులకు 125/-2. ఫెయిల్ అయిన విద్యార్థులకు 3 సబ్జెక్టుల వరకు 110/- 3 సబ్జెక్టుల కంటే ఎక్కువగా ఉంటే 125/-3. ఒకేషనల్ విద్యార్థులకు రెగ్యులర్ పరీక్ష రుసుముతో పాటుగా 60/- రూపాయలు అదనంగా చెల్లించి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పైన చూపిన తేదీల ప్రకారము విద్యార్థుల నుండి పరీక్ష రుసుము తీసుకొని చెల్లింపును కేవలం అధికారిక వెబ్ సైట్ ఎఎఒ.ఎంవ్.వశ్రీఖఅస్ఖుఱు.స్ఖశీజ.అఅ లోని పాఠశాల లాగిన్ ద్వారా, సైబర్ ట్రెజరీతో ఆన్ లైన్ అనుసంధానం ద్వారా మాత్రమే చెల్లించుటకు గాను కోరనైనది.

గజ్వేల్ లో స్టార్ హెల్త్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలి - స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బృందం



గజ్వేల్ అక్టోబర్ 23 మీడియా టుడే

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ గజ్వేల్ బ్రాంచ్ మేనేజర్ శివప్రసాద్ అన్నారు శుక్రవారం గజ్వేల్ స్టార్ హెల్త్ బ్రాంచ్ లో స్టార్ హెల్త్ ఏజెంట్లతో కలిసి శివ ప్రసాద్ మాట్లాడుతూ, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని,24 - 10 - 2026 శనివారం ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో, ఉచిత మెగా క్యాన్సర్ అవగాహన స్క్రీనింగ్ హెల్త్ క్యాంపు, నిర్వహించడం జరుగుతుందని, క్యాన్సర్ పై అవగాహన పెంపొందించడం వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, స్క్రీనింగ్ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం లక్ష్యంగా, నిర్వహించనున్నారని, 40 ఏళ్ల పైబడిన అర్హులైన మహిళలకు మేమోగ్రఫీ స్క్రీనింగ్ పరీక్షలు, గైనకాలజీ వైద్యుల సంప్రదింపును కూడా అందించనున్నారని, ఈసీజీ, 2డి ఎకోకార్డియోగ్రఫీ, కార్డియోగ్రఫీ, కార్డియాలజీ, ఆర్థోపెటిక్, ఇఎన్టి పరీక్షలు, జనరల్ ఫిజిషియన్ సంప్రదింపులు కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రజలు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో స్టార్ హెల్త్ ఏజెంట్ గుడాల రాధాకృష్ణ,పాత ప్రసాద్, రిప్పల స్వామి, విద్య సాగర్, బెలీదే సంతోష్,తదితరులు పాల్గొన్నారు


తెలంగాణ రైజింగ్ కాదు.. అప్పుల ఊబిలో సింకింగ్!

రేవంత్ రెడ్డి -కాంగ్రెస్ అసమర్థ పాలనపై అసెంబ్లీలో తక్షణమే సమగ్ర శ్వేతపత్రం (వైట్ పేపర్) విడుదల చేయాలి!

డాక్టర్ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, అక్టోబర్ 23:

కేవలం 6 నెలల్లోనే (ఏప్రిల్--సెప్టెంబర్ 2026) రేవంత్ రెడ్డి సర్కార్ మార్క్ ఆర్థిక వినాశనం బట్టబయలైంది అని డాక్టర్ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అన్నారు.కాగ్ (జూన్+) అధికారిక నివేదిక ప్రకారం:(1): బడ్జెట్ అంతా పచ్చి దగా:రూ. 6,857 కోట్ల "మిగులు" అని అసెంబ్లీలో గొప్పలు చెప్పి, 180 రోజుల్లోనే రాష్ట్రాన్ని ఏకంగా రూ. 15,096 కోట్ల భారీ రెవెన్యూ లోటు మైనస్ 220.13శాతం లోకి నెట్టేశారు! (2): నెలకు సగటున రూ. 2,516 కోట్ల చొప్పున ఖజానా రక్తం ఓడుతోంది. ప్రాథమిక లోటు రూ. 28,046 కోట్లకు 75.49శాతం కు చేరింది.(3): అప్పుల రారాజు రేవంత్:ఏడాది మొత్తం చేయాల్సిన అప్పుల పరిమితి రూ. 58,458 కోట్లు అయితే, 6 నెలల్లోనే 76.31శాతం,రూ. 44,612 కోట్లు గుటుక్కున మింగేశారు! (4): రాబోయే 6 నెలలకు మిగిలింది కేవలం 23.69శాతం కోటా మాత్రమే. సవంబర్ నాటికే ఆర్థిక స్తంభన ూఅనబఅఒఅ్ఎ ఖీతీవవఓవ ఖాయంగా కనిపిస్తోంది.లిపెన్షన్ల బడ్జెట్ 96.6% ఆవిరి:లివార్షిక పెన్షన్ బడ్జెట్ రూ. 14,736 కోట్లలో సెప్టెంబర్ నాటికే రూ. 14,235 కోట్లు 96.60శాతం స్వాహా చేశారు! మిగిలిన 6 నెలలకు కేవలం రూ. 501 కోట్లు 3.4శాతం మాత్రమే మిగిలితే, రిటైర్డ్ ఉద్యోగులకు, పింఛనుదారులకు పెన్షన్లు ఎలా ఇస్తారు? ఆస్తుల కల్పన శూన్యం - కేపిటల్ వ్యయం పక్షవాతం: సాధారణ రంగంలో ఆస్తుల సృష్టి కేవలం 18.44%, పాఠశాలలు-ఆసుపత్రుల సామాజిక మౌలిక వసతుల వ్యయం కేవలం 29.91% మాత్రమే! మొత్తం ఖర్చులో 80% రోజువారీ నిర్వహణకే తగలబెడుతూ అభివృద్ధిని పూర్తిగా పడకేశారు. 'యంగ్ ఇండియా స్కూల్స్' అన్నీ గాలి మాటలే అయ్యాయి అని తెలిపారు.రాబడి పాతాళానికి:నాన్-టాక్స్ రెవెన్యూ 16.10శాతం, ఢిల్లీ దౌత్యం ఘోర వైఫల్యంతో కేంద్ర గ్రాంట్లు 15.34శాతం, ఎక్సైజ్ రాబడి 37.84శాతం వద్దే చచ్చాయి. అఅకౌంట్ అప్పుల లెక్కలు ఇవ్వకుండా దాచిపెట్టారు!నాయకత్వానికి కావలసింది ప్రజలకు ఉపయోగపడే పదునైన ఆలోచనలు, అంతేకాని పసలేని రాజకీయ ఆరోపణలు కావు. కొత్త ఆదాయ మార్గాలను వెతకకుండా ఉన్న ఆస్తులను కరిగిస్తూ పోవడం వల్ల తెలంగాణ భవిష్యత్తుకు తీరని నష్టం జరుగుతోంది.



కొత్తకొత్తూరుగ్రామపంచాయతీకి సోలార్ పవర్ ప్లాంట్ మంజూరు



నేలకొండపల్లి అక్టోబర్ 23 మీడియా టు డే ప్రతినిధి

నేలకొండపల్లి మండలం పరిధిలోని కొత్త కొత్తూరు గ్రామపంచాయతీకితెలంగాణ రాష్ట్రరెవిన్యూ, గృహనిర్మాణం సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డివిద్యుత్ సమస్యలను దృష్టిలో ఉంచుకొనిసోలార్ వారి సహకారంతో కొత్త కొత్తూరు గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్ మంజూరుచేసినారు. శుక్రవారం రెవిన్యూ అధికారులుసోలార్ ప్లాంట్ కోసం గ్రామంలో దాదాపు3.20 ఎకరాలు గుర్తించి విద్యుత్ ఏ.ఈ కి అప్పగించినారు.ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, కొత్త కొత్తూరు గ్రామపంచాయతీ సర్పంచ్ మలోత్ కళావతి, కొత్త కొత్తూరు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ వల్లాల రాధాకృష్ణ,వార్డ్ మెంబెర్ ఠాగూర్ రాంసింగ్, మాలోత్ అయోధ్య రామయ్య, రెవిన్యూ సర్వేయర్, జిపిఓ జన్మియ్యా, ట్రాన్స్కో జూనియర్ లైన్మెన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బిసి పట్టా భూములను కాపాడాలని సబ్ కలెక్టర్కు వినతి.

మీడియా టుడే అచ్చంపేట (అక్టోబర్ 23):



అచ్చంపేట పట్టణంలో తమ పట్టా భూముల్లో ఎస్టీ గురుకులం సబ్ స్టేషన్ నిర్మాణాలను నిలిపివేయాలని బాధిత ఎస్సి, బిసి రైతులు శుక్రవారం అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చోప్రాకు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని సర్వేనెంబర్ 167,167 /2, 167/4 167/2, 167 /31, 167/32 167/ 37 లలో 59 ఎకరాల 20 గుంటల భూమి ఉందని ఈ భూమి ఎస్సీ మాదిగలకు బీసీలకు సంబంధించిన పట్టా భూములను ఈ భూముల్లో ప్రభుత్వ ఎస్సీ గురుకుల నిర్మాణం, దక్షిణం వైపున ఎలక్ట్రికల్ సబ్స్టేషన్ నిర్మాణం పనులు చేయాలని ప్రయత్నిస్తున్నారని, ఈ పనులను వెంటనే నిలుపుదల చేయాలని బాధిత రైతులు జిలకర బాలేశ్వరయ్య, మల్లయ్య, శ్రీలత, మంగమ్మ, చిట్టెమ్మ, జంగమ్మ, హుస్సేన్, లు సబ్ కలెక్టర్కు వినతి పత్రం సమర్పించారు. ఎవరి భూమి వారికి సంబంధించిన పట్టా పుస్తకాలు ఉన్నాయని సబ్ కలెక్టర్కు తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పిలుపు



పర్వతగిరి, అక్టోబర్ 23, మీడియా టుడే,

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అర్హులైన ప్రతి పట్టభద్రుడి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించాలని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.శుక్రవారం పర్వతగిరి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తమ పరిధిలోని ప్రతి పట్టభద్రుడిని వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు.అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి విజయవంతం చేయాలని, ఎన్నికల సమయంలో ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా చొరవ చూపాలని అన్నారు. ఈ ప్రక్రియలో ప్రతి బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

సీఈఓ జ్ఞానేష్ కుమార్‌ను భర్తరఫ్ చేయాలి

ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి..-ఉద్యమకారులపై నిర్బంధం ఆపాలి

వరంగల్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన



పాలడుగుల నాగరాజు, మీడియా టుడే, వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని,ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌ను భర్తరఫ్ చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు వరంగల్‌లోని కాశిబుగ్గ సెంటర్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో జ్ఞానేష్ కుమార్ చిత్రపటాలను దహనం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఓట్ల తొలగింపునకు ప్రయత్నించడం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమేనని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తనకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించేందుకు ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించుకుంటోందని విమర్శించారు.ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాడుతున్న ఉద్యమకారులపై నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయకపోతే విద్యార్థులు, యువకులు, రైతులు, ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్, ఏఐయూకేఎస్, ఏఐకేఎస్ తదితర రైతు సంఘాల నాయకులు రాచర్ల బాలరాజు,చిర్ర సూరి,చుక్క మొగిలి,సుధామల్ల భాస్కర్, వల్లందాస్ కుమార్, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు, నాయకులు సింగతి సాంబయ్య, జక్కుల తిరుపతి, మైదంపాని,బండి వెంకటేశ్వర్లు,ఐతం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో శ్రీ ఆర్కే హాస్పిటల్‌పై వస్తున్న ప్రచారాన్ని ఖండిస్తున్నాం

ఆలేరు ఆర్సీ,అక్టోబరు 23/మీడియా టుడే:



శ్రీ ఆర్కే హాస్పిటల్‌పై గత 24 గంటలుగా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న వివిధ రకాల ప్రచారాలను హాస్పిటల్ మేనేజ్‌మెంట్ తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారం ద్వారా ప్రజల్లో అపోహలు, ఆందోళనలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొంది.సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న విషయాలను ఎలాంటి నిర్ధారణ లేకుండా నమ్మవద్దని హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. హాస్పిటల్‌పై వస్తున్న ఆరోపణలు, ప్రచారంలో ఉన్న అంశాలపై పూర్తి వాస్తవాలను తెలుసుకున్న తర్వాతే స్పందించాలని కోరింది. ఆధారాలు లేకుండా ఒక సంస్థపై ఆరోపణలు చేయడం, అసత్య ప్రచారం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని పేర్కొంది. హాస్పిటల్‌పై ఎవరికైనా సందేహాలు లేదా ఫిర్యాదులు ఉంటే సంబంధిత వాస్తవాలను పరిశీలించి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది.ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న శ్రీ ఆర్కే హాస్పిటల్‌పై అవాస్తవ ప్రచారం చేయకుండా, వాస్తవాలను తెలుసుకొని సహకరించాలని హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విజ్ఞప్తి చేసింది.